సంపుటి: 45
సంచిక: 2

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1987

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-228

[ఫలితాలు]

జులై '87 నెల "అపరాధ పరిశోధన పోటీ-227" కు సరియైన సమాధానాలు:

1. మీరట్.
2. రోగుల సేవలలో.
3 ఫిజి.
4 కాంగ్రెస్-ఐ.
5. అధిక టాక్సులు.

పై జవాబుల ప్రకారం ఒకే ఒక్కరు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి గ్రహీత:—

శ్రీ పౌల్. ఎస్. బాబు,
సి 5-16 1/2.
సెక్టర్-5,
కొంకణ్ భవన్,
న్యూ బాంబే—400614.
(మహారాష్ట్ర)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. రాజమార్గం—జొన్నలగడ్డ రామలక్ష్మి
23. సాక్ష్యాన్ని వెతుకు—అర్.ఎస్. మద్దిపట్ల
53. కోటికి పడగ—తిరుమలశ్రీ
64. జలసమాధి (మినీ సీరియల్)—వి.యస్. రావ్
95. నరమేధం—యస్.డి.వి. అజీజ్
112. నీలం రంగు పెట్టె—ఎమ్. రాధిక
123. కామరూపవిద్య—కంచనపల్లి వెంకటకృష్ణారావు
128. దొంగలు దోచిన సొమ్ము—ఫణిబాబు
138. మిస్ మిస్టరీ (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. జీ—87—వసుంధర
44. ఒకే దోపిడికి ఇద్దరు దొంగలు—సుంకరి రాంప్రసాద్
107. అన్వేషణ (సీరియల్)—వి.యస్. రావ్
126. కిరాయి హంతకుడు—ఫణిబాబు
166. ఎడారి కోయిల (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

రాజమార్గం

జొన్నలగడ్డ రామలక్ష్మి

పోతరాజును చంపేయాలని నిర్ణయించుకున్నాను.

మా యిద్దరి శత్రుత్వం ఈనాటిది కాదు. అయిదేళ్ళ వయసునుంచీ వస్తూందది.

మే మిద్దరం ఇరుగు పొరుగువాళ్ళం.

పోతరాజు తండ్రి కూలిపనిలాంటిదేదో చేసేవాడు. మా నాన్న గుమస్తా. ఇద్దరిలోకీ మా పరిస్థితే కాస్త మెరుగ్గా ఉండేది. అమ్మ పోతరాజు కుటుంబాన్ని కష్టాల్లో ఆదుకుంటూండేది.

పోతరాజు చొరవైన మనిషి. మా వీధిలోని కుర్రాళ్ళు వాడంటే పడిచచ్చేవారు. ఆటలకూ కబుర్లకూ అంతా వాడి చుట్టూ చేరేవారు. అయిదేళ్ళ వయసులోనే నాకు వాడంటే అసూయగా ఉండేది. మావల్ల సాయం పొందుతూ కూడా వాడు నాకంటె అధికుడిలా ప్రవర్తించే వాడు.

అమ్మకు బాగా చిన్నతనంలో వివాహమైంది. తనకు పదిహేనోఏట నేను పుట్టాను. ఆ తర్వాత పిల్లలు లేరు. నాకు పదేళ్ళవయసులో నాన్న ప్రమాదవశాత్తు మరణించాడు. దాంతో మాజీవితం మారిపోయింది. అమ్మ నన్ను జీవితంలో పైకి తీసుకురావాలని పట్టుదలతో ఎంతో కృషి చేసేది. బట్టలు కుట్టేది. అప్పడాలొత్తేది. ఊర గాయలు పెట్టేది.

ఈ పనుల్లో అమ్మకు సాయపడ్డానికి నాకాట్టే చొరవ లేదు. పోతరాజు అమ్మకెంతో సాయం చేసేవాడు. అమ్మ చేసే వ్యాపారాభివృద్ధికి కూడా వాడెంతో సాయపడే వాడు. అమ్మ వాడినెంతో మెచ్చుకుంటూ ఉండేది.

అమ్మ పోతరాజును మెచ్చుకోవడం నాకు నచ్చేది కాదు. కానీ పైకి చెప్పుకునేవాణ్ణి కాదు.

వాడికి పదిహేనేళ్ళ వయసులో ఒకేసారి తల్లీ, తండ్రీ ప్రమాదంలో మరణించారు. ఒక్కసారిగా వాడు నిరాశ్రయుడై పోయాడు.

పోతరాజుది భారీ విగ్రహం. పదిహేనేళ్ళకే పాతికేళ్ళ వయసువాడిలాగుండేవాడు.

అమ్మ వాడిని చదువు కొనసాగించమంది. తను పోషిస్తానంది.

వాడందు కంగీకరించలేదు. వాడికిద్దరు చెల్లెళ్ళున్నారు.

"వాళ్ళిద్దర్నీ పెంచి పెద్దచేస్తాను. ఇప్పట్నించీ వాళ్ళ బాధ్యత నేను స్వీకరిస్తాను-" అన్నాడు పోతరాజు.

ఆవిధంగా పోతరాజు అమ్మ వ్యాపారంలో భాగస్వామి అయ్యాడు. అప్పట్నించీ వ్యాపారం మూడు పువ్వులూ ఆరుకాయలైంది. పోతరాజొక కిరాణా, ఫ్యాన్సీ దుకాణం తెరవడానికో ఏడాది మాత్రం పట్టింది. ఆ తర్వాత వాడు చెల్లెళ్ళనిద్దర్నీ బోర్డింగు స్కూల్లో జేర్పించాడు.

అమ్మ పోతరాజు సమర్థతనెంతగానో మెచ్చుకొంటూంటే నాకెంతో చిన్నతనంగా ఉండేది.

నేను టెన్తుక్లాసు ప్యాసవగానే ఊరొదిలిపెట్టాను కష్టపడి చదువుకుంటూ బీయస్సీ ప్యాసయ్యాను. అమ్మ నన్నింకా చదవమంటోంది. చదవాలనీ ఉంది, ఏ బ్యాంకుద్యోగమైనా సంపాదించాలనీ ఉంది.

పరీక్షలై సెలవుల కింటికి వచ్చాను.

ఇంటికివస్తే నాకింకో రకంగా కూడా ఉత్సాహం....

మా వీధిలోనే ఉందో అమ్మాయి. ఆమె పేరు విమల. రెండేళ్ళనుంచి ఆమెను చూస్తున్నాను.

ఎంతో అందంగా ఉంటుంది. చొరవలేని నన్నే చనువుగా పలకరించి స్నేహం చేసుకుంది. ఆమెకు నేను లెక్కలు, సైన్సులో వచ్చే సందేహాలు తీరుస్తూండేవాణ్ణి.

విమలను నేను ప్రేమిస్తున్నాను. ఆమెను పెళ్ళి చేసుకోవాలనుంది నాకు.

విమల కూడా నన్ను ప్రేమిస్తోందని అనుమానముంది.

ఈసారి సెలవుల్లో నా అనుమానం నివృత్తిచేసుకోవాలనుకున్నాను.

నేను రాగానే విమల మాయింటి కొచ్చింది. ఓ మంచి సమయంచూసి ఆమెతో—"నేను ఎమ్మెస్సీ చదవనా—ఉద్యోగం సంపాదించుకోనా?" అడిగాను.

"నన్నడగడమెందుకు? నీకేమిష్టమైతే అదిచేయి-" అంది విమల.

"నీ యిష్టం నాకు చెప్పకూడాదా?"

"నా యిష్టంతో నీకేంపని?"

"పనుంది కనకే అడిగాను-" అన్నాను.

విమల నావంక అనుమానంగా చూసి— "అదేమిటలాగై పోయావు?" అంది.

నేనేదోలాగై పోయినమాట నిజం-"విమలా! నేనంటే నీ కిష్టమేనా?" అన్నాను.

"ఇష్టం కాబట్టే మీయింటికొచ్చి నీతో మాట్లాడుతున్నాను...." అంది విమల చాలా మామూలుగా.

"నాకూ నువ్వంటే యిష్టం-" అన్నాను.

"అయితే?"

"ఇద్దరికీ యిష్టమైనప్పుడు...." అంటూ నసిగేశాను.

"అలా ఆడపిల్లలా సిగ్గుపడుతున్నావేం? నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"ఊఁ"

"పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నావా?"

"ఊఁ"

"అయాంసారీ-అది సాధ్యపడదు-" అంది విమల.

ఉలిక్కిపడి—"వేళాకోళమాడుతున్నావా?" అన్నాను.

"లేదు-నేను పోతరాజును పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను...." అంది విమల తాపీగా.

నాకు నోటమాట రాలేదు.

"అసలు నేను నిన్ను ప్రేమించాననే అనుకున్నాను - పోతరాజుతో పరిచయం పెరిగేవరకూ. నీ అదృష్టం కొద్దీ పోతరాజుతో పెళ్ళికిముందే పరిచయమయ్యింది. లేకుంటే పెళ్ళయ్యాక అతడితో లేచిపోయేదాన్ని ...." అంది విమల మళ్ళీ.

"ఛీ-" అన్నాను. పెళ్ళికాని ఓ ఆడపిల్ల అలా మాట్లాడ్డం నా కసహ్యమనిపించింది.

"నా మాటలు నీ కాశ్చర్యంగా ఉంటే-కారణం కూడా నేనే చెప్పాలి ...."

నేను నీరసంగా ఆమెవంక చూశాను.

"పోతరాజు - అన్నివిధాలా నీకంటే గొప్పవాడు. కాదంటావా?"

"మా అమ్మ చేరదీయకపోతే వాడేమైపోయేవాడో-" అన్నాను అసూయగా.

"నువ్విలాగంటున్నావు. కానీ పోతరాజే మీ అమ్మను చేరదీశాడని అంతా అనుకుంటున్నారు-"

నా క్రోధం వచ్చింది— "తిన్నగా మాట్లాడు-" అన్నాను.

"నిజంగా నీకిది తెలియదా?" అంది విమల.

ఆవేశపడుతూనే విమల చెప్పింది నేను విన్నాను.

వీధిలో అమ్మకు మంచిపేరు లేదు. అమ్మ ఇప్పటికీ పాతికేళ్ళ పిల్లలా ఎంతో అందంగా ఉంటుంది పోత రాజుకు అమ్మతో అక్రమసంబంధముంది. తన వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలు కావడానికీ, అమ్మ ఆదాయం పెంచడానికీ అమ్మ అందాన్నుపయోగించుకుం టున్నాడు. అమ్మకేం మంత్రం వేశాడో — పోతరాజు గీచిన గీటు దాటదు.

ఆలోచిస్తూంటే అమ్మ ప్రవర్తనలో లోపం లేకపోలే దనిపించింది.

పోతరాజు భాగస్వామి అయ్యాకే మా పరిస్థితీ బాగు పడింది.

నా గుండె మండిపోయింది.

"చదువుకునే వాళ్ళంతా చచ్చుదద్దమ్మలని నా అభిప్రాయం. ఎప్పటికైనా వ్యాపారస్థుణ్ణే పెళ్ళిచేసుకోవాలని నా కోరిక. నా అదృష్టంకొద్దీ పోతరాజు నన్ను ప్రేమించాడు. అతడు నీగురించి నాకెన్ని జోకులు చెప్పాడో. అవన్నీ మీ అమ్మ అతడికి చెప్పిందట...."

"ఛీ—అలాంటి తిరుగుబోతును పెళ్ళిచేసుకుంటావా. సిగ్గులేదూ?" అన్నాను.

"ఒక తిరుగుబోతు బిడ్డకంటె—ఆడదాన్ని వలలో వేసుకోగల తిరుగుబోతే నాకెక్కువిష్టం—" అంది విమల.

ఆమె వెళ్ళిపోగానే బాగా ఆలోచించసాగాను. అప్పుడే పోతరాజును చంపేయాలని నిర్ణయించుకున్నాను.

2

చంపాలనుకోవడం వరకూ బాగానే ఉంది.

కానీ ఎలా చంపడం?

అన్నింట్లోకీ విషప్రయోగం మంచిదనిపించింది.

ఏ అన్నంలోనో మంచినీళ్ళలోనో కలిపిచ్చేస్తే—నిద్రలోనే ప్రాణం పోతుంది.

అప్పుడది హత్యని కూడా ఎవరూ అనుకోరు.

కానీ అందుకు విషం కావాలి....

పొటాషియం సయనైడ్....నిద్రమాత్రలు....

ఈ రెండింటిలో ఒకటి సంపాదించాలి....

మొదటిది నాకు నా లాబొరేటరీలో దొరుకుతుంది. రెండోది మెడికల్ షాపులో సంపాదించాలి.

మర్నాడేదో విధంగా ఆ రెండింటిలో ఒకటి సంపాదించాలనుకుంటూ నిద్రపోయాను.

నిద్ర లేచేసరికి పేపరు నా పక్కనే వుంది.

అందులో మొదటి పేజీలోనే ఒక వార్త....

సయనైడిచ్చి స్నేహితుణ్ణి హత్యచేశాడో వ్యక్తి. పోలీసులు కూపీ లాగి హంతకుణ్ణి పట్టేశారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ పోలీసులు హంతకుడి ఆరా తీయగలిగారు.

ఈ వార్త చదవగానే నాకు భయంవేసింది.

ఇంతవరకూ హత్యగురించే తప్ప పోలీసుల గురించి ఆలోచించలేదు. వాళ్ళు చాలా తెలివైన ఘటాల్లా కనబడుతున్నారు.

నా తల్లిని చెడుమార్గాల్లో దింపాడనీ, నా ప్రియురాల్ని నాక్కాకుండా చేశాడనీ పోతరాజును నేను చంపాలనుకుంటున్నాను. కానీ ఆ ప్రయత్నంలో నాకే నేను కాకుండా పోకూడదుగదా!

విషమిచ్చి చంపడం తెలివైనపని కాదు.

మరేం చేయాలి?

3

పోతరాజు తరచుగా మా యింటి కొస్తూంటాడు. కానీ అతడు పక్కింట్లోనే ఉంటున్నాడు.

ఒకరోజు రాత్రివేళ నేనతడింటికి వెళ్ళాను.

అప్పుడు పోతరాజు మెలకువగానే వున్నాడు.

అభిమానంగా నన్ను పలకరించాడు.

నేను వాడింటికి వెళ్ళడం అమ్మకక్కూడా తెలియదు.

"కాసేపు నీతో మాట్లాడాలనిపించింది—" అన్నాను.

వాడికి నాపై అనుమానంలేదు. అదే అవకాశంగా తీసుకోవాలి.

పోతరాజు పడగ్గదిలో కత్తి ఉంటుంది. అదెప్పుడూ ఓ బల్లమీద ఉంటుంది. ఆపిల్సు లాంటివి దాంతో కోసుకుని తింటూంటాడు వాడు.

వాడి కత్తితో వాడినే పొడిచి చంపేయాలనుకున్నాను.

ఇద్దరం పడగ్గదిలోకి వెళ్ళాం.

అక్కడ నాకు కత్తి కనబడలేదు.

పోతరాజు మంచంమీద కూర్చున్నాడు.

నేను వాడికి పక్కగా కూర్చున్నాను.

కాసేపవీ యివీ కబుర్లయ్యేక—"ఆపిల్సు లేవా?" అన్నాను.

పోతరాజు ముందుకువంగి మంచం కిందనుంచీ ఓ ఆపిల్‌పండు తీసి నాకిచ్చి—"తిను"— అన్నాడు.

"ఇంతపండు తినలేను ....ముక్కలుకోసుకుందాం ...." అన్నాను.

"పండంతా నీకే-మళ్ళీ ముక్కలు కోయడమెందుకూ?"

"నువ్వు తినవా?"

"నేనిప్పుడే రెండుపళ్ళు తిన్నాను. ఇక తినలేను ...."

"పండంతా నేనూ తినలేను .... వద్దులే ...." అంటూ పండు వెనక్కిచ్చేయబోయాను.

"కత్తి వంటింటి అలమారాలో ఉంది. తాళం తీయాలని బద్ధకించాను కానీ—నువ్వు పట్టుబడితే తెస్తాను ...." అన్నాడు పోతరాజు పండు వెనక్కి తీసుకోకుండా.

"నువ్వు కత్తి నీ గదిలోనే ఉంచేవాడివి. వంటింటి అలమారాలో తాళంవేసి దాచడ మెప్పట్నించి?" అనడిగా

నాశ్చర్యంగా.

"వ్యాపారంలో పైకి వచ్చానుగా — నాకు కొందరు విరోధు లేర్పడ్డారు. వాళ్ళలో ఒకడు నన్ను చంపాలను కుంటున్నాడు. ఒక రాత్రివేళ ఇప్పుడు నువ్వొచ్చినట్లే వచ్చి కత్తితో నన్ను పొడవపోయాడు. అప్పట్నించీ నా యింట్లో కత్తి నెవరికీ అందుబాట్లో ఉంచడంలేదు. నా ఇంటి కెవరొచ్చిపోతున్నారో తెలుసుకునేందుకు రాత్రంతా నా మనిషొకడు రహస్యంగా నిఘావేస్తాడు. నన్ను చంపాలనుకున్న వాడు తప్పించుకోలేకుండా ఈ విధంగా ఏర్పాట్లు చేసుకున్నాను—" అన్నాడు పోతరాజు.

వాడు నిజం చెబుతున్నాడో నన్ను హెచ్చరిస్తున్నాడో నా కర్థంకాలేదు కానీ—నేను కత్తివద్దని ఆపిల్ పండు పూర్తిగా తినేసి—ఇంటికి వెళ్ళి బుద్ధిగా పడుకున్నాను.

4

ఎవరికీ దొరక్కుండా పోతరాజునెలా చంపాలో నాకు తెలియడంలేదు.

ఏ కొండమీదకైనా తీసుకెళ్ళి కిందకు తోసేయాలి.

ఏ యింట్లోనేనా మత్తుమందిచ్చి తర్వాత ఊపిరాడకుండా పీకె నొక్కి చంపేయాలి.

ఏం చేసినా హత్యాస్థలంలో నేను, పోతరాజు తప్ప - ఇంకెవ్వరూ ఉండకూడదు.

అలాంటి స్థలం, అవకాశం రెండూ సంపాదించే విధానం నాకు తెలియడంలేదు.

ఈ విషయంలో నేను చేతకాని వాణ్ణని తెలిసేక - నా ప్రతాపం చూపడానికి అమ్మనే ఎన్నుకున్నాను.

ఒక మగాడు ఎందరాడవాళ్ళనైనా అనుభవించవచ్చు. కానీ ఏ మగాడూ అమ్మలో ఆడదాన్ని చూడలేడు. నా

యాడువాడే అయిన పోతరాజుకు నా తల్లి ఆడదయింది.

"అమ్మా! మన మీ ఊరొదిలి వెళ్ళిపోదాం—" అన్నా నమ్మతో.

"ఎందుకురా?" అంది అమ్మ.

"ఇక్కడ నా కవమానంగా ఉంది—" అన్నాను.

"ఎందుకు?"

"నీ గురిం చిక్కడ చెడ్డగా చెప్పుకుంటున్నారు...."

"ఏమని?"

"నేను చెప్పలేను...."

"నువ్వు నమ్ముతున్నావా?"

నేను మాట్లాడలేదు.

"ఇక్కడివారికి నువ్వు నా కొడుకువని తెలుసు. మరో చోటుకు వెడితే మనిద్దరిగురించీ కూడా చెడ్డగా చెప్పుకో వచ్చు. అప్పుడేంచేస్తావ్?" అంది అమ్మ.

చటుక్కున నేను అమ్మను చూశాను.

ఏళ్ళొచ్చినా అమ్మ పెద్దగా మారలేదు. అమ్మ నాకు అమ్మంటే ఎవరూ నమ్మలేరు.

"వెర్రివెధవా! ఇన్నాళ్ళూ లేని అవమానం నీకు కొత్తగా ఎక్కణ్ణుంచి వచ్చింది? ఎవరో నీకేదో చెప్పారు. వాళ్ళెవరో చెప్పు...." అంది అమ్మ.

అప్రయత్నంగా నేను విమల గురించి చెప్పాను.

"విమలా?" అని ఆశ్చర్యపోయిందమ్మ.

"అవును—" అన్నాను.

"కొడుకు దగ్గర అనకూడనిమాట....కానీ....మన పోతరాజుకూ విమల తల్లికీ ఏదో ఉందంటారు...." అంటూ నసిగిందమ్మ.

"విమల నాన్న ఊరుకుంటాడా?" అన్నాను.

"తప్పు పోతరాజుదే అయితే ఊరుకునేవాడు కాదు. ఇంట్లోనే తప్పుందడంవల్ల—గుట్టురట్టు కాకుండా ఎలా కాపాడుకోవాలో తెలియక అవస్థపడుతున్నాడు...."

"అమ్మా—ఈ పోతరాజు మంచివాడు కాదు. మనం వాడికి దూరంగా ఉండడం మంచిది...." అన్నాను.

"వాడికి మనం దూరంగా ఉండాలంటే వాణ్ణి లోకాన్నించి దూరం చేయాలి. మరో మార్గంలేదు—" అంది అమ్మ.

"వాడు చచ్చిపోతే నీకు సంతోషమేనా?" అన్నాను చటుక్కున.

"ఊఁ" అంది అమ్మ.

"అమ్మా—అందుకేమైనా ఉపాయాలు చెప్పగలవా?" అన్నాను.

"వెర్రి వెధవా—నేనేం చేసినా నీకోసమే! నా పద్ధతి నీకవమానంగా ఉంటే నేను చావడానిక్కూడా సిద్ధం. నువ్వు మాత్రం ఏ హత్యా ప్రయత్నమూ చేయకు. నువ్వు కటకటాల వెనక్కు వెడితే నా బ్రతుకర్థంలేదు" అంది అమ్మ.

అమ్మ ఆవేదన నా కర్థమైంది. లోకం దృష్టిలో ఆమె ఏమైనా కావచ్చు....కానీ అమ్మ నాకుమాత్రం అమ్మే!

5

"నా గురించి చాలా చెప్పి చిన్నబుచ్చావు. కానీ నా కిప్పుడసలు రహస్యం తెలిసిపోయింది" అన్నాను.

"ఏమిటి నువ్వు తెలుసుకున్న ఆ రహస్యం?"

"పోతరాజు నీ తల్లిని వలలో...."

"ఛీ—ఊరుకో...." అంది విమల. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆమె ఏడుస్తుందనుకోలేదు "నా గురించిన నిజం చెప్పి అవమానకరంగా మాట్లాడేవు. నీగురించిన నిజం చెబితే ఏడుస్తావెందుకు?" అన్నాను.

"నువ్వు తెలుసుకున్న విశేషం నాకు చాలా అవమాన కరమైనది...." అందామె తడిగొంతుతో.

"తప్పు నాది కాదుగదా!" అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

"నీగురించిన నిజం దాచిపెట్టి — అలాంటి నిజాన్నే నాగురించి చెప్పి అవమానకరంగా మాట్లాడేవు. అది నీ తప్పు" అన్నాను.

"నీగురించి అంచనా వేయడంలో ఇంకా పెద్ద తప్పు చేశాను" అంది విమల నిష్ఠూరంగా.

"మళ్ళీ నన్నే తప్పుపడుతున్నావా? ఇంకా చెప్పాలంటే నీ తల్లిని వలలో వేసుకున్న ఆ పోతరాజునో గొప్ప రసికుడిగా భావించి — ప్రేమించి పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నావు...." అన్నాను.

"పోతరాజును నేనెప్పుడూ ప్రేమించలేదు" అంది విమల.

"మరైతే నాకలా ఎందుకు చెప్పావు?"

"పోతరాజంటే నాకు చంపేయాలన్నంత కసిగా ఉంది. కానీ ఆడదాన్ని నేనేం చేయగలను? నీలాంటివాణ్ణి రెచ్చగొట్టాలనుకున్నాను. అసలైన మగాడెవడూ తన తల్లి నవమానించినవాణ్ణి క్షమించలేడు. నువ్వు పోతరాజును చంపేస్తావనుకున్నాను. కానీ అలా జరగలేదు."

"చంపాలనే అనుకున్నాను....కానీ పట్టుబడతానన్న భయం...."

"చంపడమంటే సంతకు వెళ్ళి తాపీగా కూరలు కొనడ

మనుకున్నావా? దానికి ఆవేశముండాలి. ఆవేశం మగాడి కుండాలంటే—అందుకు చరిత్ర ఉండాలి. చరిత్ర ఉన్న మగాడెవడూ నా మాటలు విన్నాక పోతరాజును చంప కుండా ఉండలేడు. ఆవేశంతో చేసే హత్య వెనుక ఆలో చన ఉండదు" అంది విమల.

"నువ్వు చరిత్రగురించి మాట్లాడుతున్నావు....నాకూ నీ చరిత్ర తెలుసు."

"అదే నేనంటున్నది....నా మాటల కావేశపడి ఓ దుష్టుడి నంతం చేయడానికి బదులు తాపీగా పరిశోధించి నా చరిత్ర తెలుసుకున్నావు. నువ్వు చరిత్ర మార్చే పని చేస్తావనుకున్నాను గానీ — చరిత్రలు తెలుసుకుంటూ కూర్చుంటావనుకోలేదు" అంది విమల.

"అయితే ఏమంటావ్?"

"మా యింట్లో వ్యవహారం నా కవమానంగా ఉంది. పోతరాజు చావుతోగానీ అది అంతంకాదు. నేను నిన్ను కలుసుకున్నప్పుడు నిన్ను చిన్నబుచ్చుతూ మాట్లాడాను. అది తప్పని నాకు తెలుసు. నేనేదో ఉన్నతమైనదాన్ననీ— నువ్వు కులట కొడుకువనీ నా అభిప్రాయం కాదు. నిన్నా వేశపరచాలన్నదే నా ఉద్దేశ్యం...."

"ఆవేశపడి ఏం చేయను? ఊరికంబ మెక్కనా?"

"పెద్దపెద్ద భవనాలకు అగ్నిప్రమాదముండకపోవచ్చు కానీ తాటాకు గుడిసె నంతంచేయడానికో నిప్పురవ్వచాలు. కొందరు స్త్రీలు తాటాకు గుడిసెల్లా బలహీన మనస్కులు. పోతరాజు లాంటి వారు వారి పాలిటి నిప్పురవ్వలు. అలాంటి నిప్పురవ్వల్ని నీవంటి వారంతం చేయాలి. ఆ ప్రయత్నంలో విజయం సాధించేవా? ఎందరో అమాయ కుల్ని రక్షించిన వాడి వౌతావు. నువ్వే హతుడయ్యావా?

నేను నిన్ను దేవుడిలా ఆరాధిస్తాను....''

నాలో ఉత్సాహం పొంగింది — ''నేను పోతరాజును చంపితే నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అన్నాను.

''తప్పకుండా'' అని ''నువ్వు పోతరాజును చంపితే నేను నిన్నే పెళ్ళిచేసుకుంటాను. పోతరాజు కారణంగా నువ్వే హతమారితే నీ పటాన్ని పెళ్ళి చేసుకుంటాను'' అంది విమల.

''పోతరాజుకు మనం మారం కావాలంటే—వాణ్ణి మనమీ లోకాన్నుంచి దూరం చేయాలి. వాడు చచ్చిపోతే నాకు సంతోషమే'' అన్న అమ్మ మాటలు నా చెవుల్లో గింగురుమన్నాయి.

నా వళ్ళంతా ఆవేశంతో ఊగిపోయింది.

విమల దగ్గర ఆవేశంగా సెలవు తీసుకున్నాను.

6

మర్నాడే పోతరాజు ఊరెళ్ళాడు. ఏ ఊరెళ్ళాడో ఎవరికీ తెలియదు కానీ వారంరోజుల దాకా రాడని తెలిసింది.

వాడూరెళ్ళడం ఒకవిధంగా నాకెంతో పనికొచ్చింది.

విమల నాలో సృష్టించిన ఆవేశం నాలోని యుక్తాయుక్త వివేచన జ్ఞానాన్ని తొలగింపజేసింది. ఆ వశంగా నడిరోడ్డుమీద పోతరాజును చంపేసేవాణ్ణాను. అప్పుడు జైలు పాలయ్యేవాణ్ణి.

ఒకరోజులో నా ఆవేశం చల్లారింది.

పోతరాజును చంపి తీరాలన్న నిర్ణయం మటుకు ఆవేశం చల్లారినా మారలేదు.

రోజూ శ్రద్ధగా పేపరు చదువుతున్నాను అందులో హత్యా నేరాలకు సంబంధించినవే ప్రత్యేకంగా చదువు

తున్నాను.

చాలామంది హత్యలు చేస్తున్నారు. చాలామంది చస్తున్నారు.

పోలీసుల పరిశోధనలే ధోరణిలో వెడుతున్నాయీ అన్నది కూడా పరిశీలిస్తున్నాను.

అటుపయిన కొన్ని క్రియిమ్ పుస్తకాలు కూడా చదివాను.

హత్య చేసేవాళ్లు తీసుకునే జాగ్రత్తలు వాటిలో వున్నాయి.

వీటి ఫలితంగా నా బుర్రలో ఓ పథకం రూపు రేఖలు దిద్దుకుంటోంది.

ముందుగా చంపదల్చుకున్న వ్యక్తి - రోజువారీ కార్యక్రమాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

నేనా పని చేశాను.

పోతరాజు దినచర్య గురించి ఎవరికీ అనుమానం రాని విధంగా చాలా కూపీలాగాను.

వాటిలో నన్ను బాగా ఆకర్షించిన దొకటుంది.

పాపాలు చేసేవాళ్ళలో దైవభక్తి పాలు కాస్త ఎక్కువే ఉంటుందంటారు. పోతరాజులో కూడా ఈ విశేషముంది.

ప్రతి మంగళవారము సాయంత్రం ఆంజనేయస్వామి కోవెలకు వెడతాడు పోతరాజు. అందు కతడు వెళ్ళే దారి కూడా ప్రత్యేకమైనది అందులో ఓ చిన్న సందుంది. ఆ సందులో అట్టే రద్దీ ఉండదు. ఇంకా చెప్పాలంటే సందు నిర్మానుష్యంగా వుంటుందనవచ్చు.

పోతరాజునా సందులో చంపాలని నిర్ణయించుకున్నాను.

చంపే పద్ధతి కూడా సింపిల్....

నా చేతికి గ్లవ్స్ ఉంటాయి. జేబులో కత్తిఉంటుంది. రోడ్డు పక్క పార్కు చేయబడ్డ స్కూటర్‌ను స్టార్టు చేసి దానిమీద ఆ సందులోకి వెళ్ళి పోతరాజు నొకే ఒక్క పోటుతో అంతం చేసి-మరి కొంత దూరంపోయి స్కూటర్ని వదిలిపెట్టి నా దారిన నేను పోతాను.

ఇందులో సాహసముంది.

పోతరాజును చంపడానికి నేను సాహసం చేయాలనుకున్నాను.

నా సాహసం అమ్మకు, విమలకు తృప్తి నిస్తుందని తెలుసు.

7

అంతా అనుకున్న ప్రకారమే జరిగింది.

ఒకరోజు ఇరుకు సందులో పోతరాజు కెదురుపడ్డాను.

పోతరాజుకు నేను తననేదో చేస్తానని తెలియదు. వాడు నవ్వుతూ పలకరించాడు.

నేను నవ్వలేదు. వాడిమీద ఆరోపణలు ప్రారంభించాను.

"ఇవేం కొత్త విశేషాలు కాదు" అన్నాడు వాడు చలించకుండా.

"నేనిలా నిన్ను తిట్టడం కొత్తేకదా...."

"ఇంట్లో తల్లి గురించీ, వీధిలో పెళ్ళాం గురించీ ఆవేశ మెందుకు? రేపు నీకు పెళ్ళయ్యాక అప్పుడు నీకూ నాకూ గొడవెలాగూ తప్పదు....అదెలాగూ నిన్నొదిలి నాతోనే ఉంటుందిగా...." అన్నాడు పోతరాజు.

నేను పోతరాజును సాచి లెంపకాయ కొట్టాను. వా డూరుకుంటాడా - చెయ్యెత్తాడు.

మా యిద్దరి మధ్యా యుద్ధం ప్రారంభమయింది. ఒకరి

నొకరు తన్నుకుంటున్నాం. కొట్టుకుంటున్నాం.

నిజానికి పోతరాజును చంపడానికి నేనెన్నుకున్న పద్ధతిది కాదు.

ఏ గొడవా లేకుండా ఒక్క పోటుతో యమపురికి పంపడం.

కానీ పోతరాజు నాలో ఆవేశాన్ని లేపాడు. అటు పైన వాడిది భారీ విగ్రహం. వాడంటే నాకెప్పుడూ భయమే.... కానీ నా ఒక్క దెబ్బకు వాడి కళ్ళు గిర్రున తిరిగాయి. వాడితో సమ ఉజ్జీగా పోరాడగలుగుతున్నానని నాకుత్సాహము వచ్చి మరింతసేపు కొనసాగించాను యుద్ధం.

అలా కాసేపు జరిగాక నాలో అలసట ప్రారంభమైంది. ఇక లాభం లేదని అంతవరకూ దాచిన కత్తిని తీశాను.

పోతరాజిది వూహించలేదు. ఆశ్చర్యంగా - "నువ్వూ కూడా కత్తి తెచ్చుకొచ్చావా?" అన్నాడు.

ఆ క్షణం అవకాశంగా తీసుకుని కత్తిని సరాసరి పోతరాజు గుండెల్లోకి దింపేశాను.

చివ్వున రక్తం చిమ్మింది.

పోతరాజు నేల కూలాడు.

అప్పుడు నేను పరిసరాలు గమనించాను.

మా గలాటా అప్పటికే చాలామందిని ఆకర్షించింది! ఆ యిరుకు సందు నిండా జనం.

అంతా జరుగుతున్నది తెల్లబోయి చూస్తున్నారు.

నేను తెల్లబోయినా అంతలోనే గుండె దిటవు తెచ్చుకుని - "ఎవరయినా నన్ను పట్టించేందుకు ప్రయత్నిస్తే - వారికీ యిదే గతి పడుతుంది" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాను.

ఆశ్చర్యంగా ఎవరూ నన్నడ్డలేదు.

ఇంటికి వెళ్లాను.

నేను ధరించిన బట్టలు విప్పి కాల్చి మసి చేశాను.

జరిగిందేమిటో అమ్మకూడా చెప్పలేదు.

నేను హత్య చేశాను. అది ఎందరో చూశారు. అందులో నన్నూ పోతరాజునూ ఎరిగున్నవాళ్ళు కూడా ఉన్నారు. ఎరుగనివాళ్ళు నన్ను వెంటాడి నా ఉనికిని తెలుసుకోవచ్చు.

మనసులో బెంగగా వున్నా భయపడి చేసేదేముందని గుండె రాయి చేసుకున్నాను.

రెండ్రోజులపాటు నే నిల్లు కదలలేదు.

నా గురించి పోలీసులు రాకపోవడంతో ధైర్యం పెరిగింది. అమ్మతో మాత్రం ఎవరడిగినా నేనింట్లో లేననే చెప్పమన్నాను.

ఆ తర్వాత నాకు తెలిసిన దేమిటంటే....

పోతరాజు హత్య గురించి పోలీసులకు వార్త చాలా ఆలస్యంగా తెలిసింది. హత్య ఎలా జరిగిందో చెప్పడానికి వాళ్ళకు సాక్షులు దొరకలేదు. అసలు వాడి శవాన్ని గుర్తుపట్టడానికే వాళ్ళకు రెండు రోజులు పట్టింది.

నా గురించయితే పోలీసులకెలాంటి ఆచూకీ లేనేలేదు.

తమ చుట్టూ జరిగే నేరాలపట్ల నిర్లక్ష్యం....సాక్ష్యం చెబితే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాలన్న భయం—పోలీసులకంటే నేరస్థులే బలవంతులన్న నమ్మకం—మన ప్రజల్లో బలపడి ఉన్నాయి. ఈ కారణంగా ఎవరయినా హత్యలు చేయాలనుకుంటే - పథకాలు వేసుకుని సమయం వృథా చేసుకోవడం అనవసరం. హాయిగా నడిరోడ్డుమీద హత్య చేసుకోవడం మంచిది.

రహస్యంగా చేసే హత్యలో చిన్న పొరపాటు హంతకుణ్ని పట్టియ్యొచ్చు....నడిరోడ్డుమీద నలుగురి ముందూ హత్యచేస్తే సాక్షులవసరం....ఆ సాక్షులు దొరకరు కాబట్టి హంతకుడికే యిబ్బందీ, పొరపాట్ల బెంగా ఉండదు.

నేను తెలుసుకున్న నిజం నాకు సంతోషాన్ని కలిగించలేదు.

ప్రస్తుతానికి నేను హంతకుడిగా పట్టుబడి ఉండకపోవచ్చు కానీ నాకు నడిరోడ్డుమీద కూడా రక్షణ లేదు కదా! ఏదో రోజున నా శత్రువు నన్నిదేవిధంగా హతమార్చితే....

మన వ్యవస్థలో నేను చేయగలిగిన దొక్కటే....

నన్ను చంపాలనుకునేటంత కసి, పగ - ఇతరులలో ఏర్పడకుండా నన్ను నేను సరిదిద్దుకోవడం! □

ధర్మం!



సాక్ష్యాన్ని వెతుకు

ఆర్.యస్.మద్దిపట్ల



ఆతడు మరణించిన స్థలంలో పోలీస్ టీం ప్రాథమిక పరిశోధన చేస్తోంది. సోమన్న ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో వుందా బృందం.

నిజానికి ఆ స్థలం నేషనల్ హైవేకు లింక్ రోడ్.

ఆ రోడ్‌కు రెండువైపులా ఆఫీసు కార్యాలయాలే.

డెత్ స్పాట్ గెస్ట్‌హౌస్, కాలేజీ భవంతుల మధ్య నడిరోడ్డుమీద జరిగింది. ఆకస్మిక మరణమో లేదా హత్యో తెలిపే ఆధారాలు చాలా తక్కువ.

అతడు స్కూటర్ డ్రైవింగ్‌లో మరణించాడు. ఆకస్మిక మరణానికి కారణాలు బ్రేకులు ఫెయిల్ కావడం, లేదా వీల్స్ స్కిడ్ కావడం లాంటి వయ్యుంటాయి. ఇవేమీ కన్పించడం లేదు కాబట్టి ఆధారాలు స్పష్టంగా దొరకలేదు. అతడు హెల్మెట్ వాడలేదు. పైగా అది రాత్రి పదకొండు గంటల సమయం.

ఆ రోడ్డుమీద ఎక్కడా స్ట్రీట్‌లాంప్ ఓ నూరు గజాల దూరం మేరలో లేవు. గెస్ట్ హౌస్ మీదున్న హైపవర్ ల్యాంప్‌ను వెలిగించారు ప్రస్తుతం.

అక్కడ పరిస్థితులిలా వున్నాయి:

అది మెయిన్‌రోడ్‌కు లింక్ రోడ్డు. పోలీస్ అధికారులకు రక్షణ వ్యవస్థకు సంబంధించిన అన్ని ప్రధాన కార్యాలయాలు ఆ రోడ్డుకు అతి సమీపంలో వున్నాయి. ఇక ఎస్పీ కార్యాలయం, దాని ఎంక్లోజర్‌లో వుండే అతని నివాసగృహమయితే ఆ స్పాట్‌కు మరీ దగ్గరగా ఓ ఫర్లాంగు దూరంలో వుంది.

నడిరోడ్డుమీద స్పీడ్ బ్రేకర్ దాటిన రెండు గజాల దూరంలో పడివుంది ఆ శవం. తల పూర్తిగా చితికి పోయింది. మొత్తం కపాలమంతా పగిలిపోయి లోపల మెదడు, రక్తనాళాలు బయటపడ్డాయి. చుట్టూ ఓ ఏడడుగుల మేర ఆ రక్తము చిందివుంది. మెదడు గుజ్జుగా తయారయింది. మొహం గుర్తుపట్టడానికి అక్కడ ఏమీ మిగల్లేదు. శరీరంమీద అతి కొద్దిగా గీరుకొని పోయింది. దాన్నిబట్టి ఏమీ నిర్ధారించలేని పరిస్థితి అది.

అన్నిటికంటే ముఖ్యం ఆ మరణానికి ప్రత్యక్ష సాక్షులు లేరు—

సోమన్న ముందుగా ఫోటోగ్రఫీ డిపార్ట్‌మెంట్‌కు

పర్మిషనిచ్చాడు. ఫోటోగ్రాఫర్స్ యిద్దరూ చాలా రకాల యాంగిల్స్‌లో కలర్‌ఫిల్మ్‌లో స్నాప్స్ తీస్తున్నారు— సుమారు మూడు ఫిల్ముల వరకూ పట్టింది మొత్తమంతా! తరువాత డాక్టరును పురమాయించాడు.

అతనికి దేని తరువాత దేన్ని చేయాలో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఆ సమయంలో ఆ మరణం సంభవించడం—అదీ అక్కడ అతనూహించలేదు. దానిక్కారణం మరణించిన వ్యక్తి కోటీశ్వరుడు రామారావుగారి కుమారుడు. అతని పేరు కిరణ్.

అతని శరీరం మీద గుర్తులను బట్టి—అంటే పుట్టుమచ్చలు, శరీరం రంగు, యిలా శరీరపు పోలికలనిబట్టీ అందునా ఆ స్కూటర్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను బట్టీ ఐడెంటిఫై చేయగలిగారు. డాక్టర్ తన పరీక్షను ముగించేసరికి సోమన్నకు ఊపిరి చిక్కింది. అతనికి బాగా తెల్సు— డెత్ స్పాట్‌లోని సాక్ష్యాలు సంపాదించాలని గబగబా అన్నీ గమనిస్తే ఫలితముండదని. తికమకపడిపోకుండా నిజమయిన సాక్ష్యాలను వేరు చేస్తేనే కేస్ యొక్క రిజల్ట్ బయటపడ్తుందని. ఇదెంతో ఓపికగా సాధించాల్సిన ప్రక్రియ.

సోమన్న డాక్టర్ కేసి చూశారు.

డాక్టర్ మరణించినట్లు తలవూపాడు. కాబట్టి అత్యంత తొందరగా ఆసుపత్రికి తీసుకెళ్ళాల్సిన అవసరం లేదు.

తల పంకించి ఫింగర్‌ప్రింట్స్ చెకింగ్ ఎక్విప్‌మెంట్‌తో రంగంలోనికి దిగాడు హైపవర్ పెర్చ్‌లైట్లు వాడుతూ!

సోమన్న చేస్తున్న ఇన్వెస్టిగేషన్ అనవసరమని తెలుసు. అసలు ఈ రోజుల్లో యింత ఖచ్చితంగా ప్రతీదీ చెక్

చేస్తున్న పోలీస్ ఆఫీసర్లు కరువయ్యారు. ఉదాహరణకి డెత్ స్పాట్ కు పోలీస్ చేరుకొనేప్పటికి ఆ వ్యక్తి యింకా కొనవూపిరితో వున్నాడనుకోండి — అంతా ఏమీ ఆలోచించకుండా హాస్పిటల్ కు తీసుకెళ్తారు. ఇది మంచిదే— కానీ డెత్ స్పాట్ మీద పెద్దగా ఆసక్తి చూపరు. దాంతో అతి ముఖ్యమయిన కొన్ని విషయాలు మరుగున పడి పోతాయి.

సోమన్న ఫింగర్ ప్రింట్స్ కొరకు వెతకలేదు. ఎందుకంటే అతనవసరం కాబట్టి - బూట్ సోల్ ప్రింట్స్ కానీ, చెప్పుల ప్రింట్స్ కానీ, పాదాల ముద్రలు కానీ దొరుకుతాయేమోనని.

ఆ కార్యక్రమం యించుమించు గంటవరకు సాగింది. చాలా రకాల షూ ప్రింట్స్ దొరికాయి. రోడ్డు ప్రక్కనున్న మట్టిలో తారురోడ్డు మీద ఏవయినా ముద్రలుంటే వాటిని ట్రేస్ చేయడానికి తగిన ఎక్విప్ మెంటంతా అతని దగ్గర లేదు.

మొత్తానికి రాత్రి రెండు గంటల ప్రాంతంలో అతనా ప్రాంతాన్ని వదిలి వెళ్ళాడు. మొత్తం తనక్కావల్సిన సమాచారంతో. డెడ్ బాడీ మార్చ్యురీకి పంపించే ముందు డాక్టర్ తో పోస్ట్ మార్టం రిపోర్ట్స్ కు ప్రోగ్రామ్ అరేంజ్ చేశాడు. తెల్లవారుజామున నాలుగింటికి పోస్ట్ మార్టమ్ జరుగుతుంది.

2

ఆ రోజు

సమయం పగలు పన్నెండవుతోంది.

క్రితం రాత్రి జరిగిన మరణంకు సంబంధించిన ఫైల్ ను చూస్తున్నాడు సోమన్న.

ఆల్ మోస్ట్‌గా డాక్టర్ రిపోర్ట్, టెక్నికల్ రిపోర్ట్, ఫోరెన్సిక్ రిపోర్ట్, ప్రింట్ రిపోర్ట్ ఫోటోస్ కూడా రడీ అయ్యాయి.

వాటి నన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

అతనికి తెలుసు - ఈ పనులకొరకు చాలా ఖర్చు పెట్టారని. ఆ ఖర్చంతా వృధా కాకుండా వుండడానికి అతను రిపోర్ట్స్‌ను చాలా కేర్‌ఫుల్‌గా స్టడీ చేస్తున్నాడు.

అతను డాక్టర్స్ రిపోర్ట్ డాక్యుమెంట్ కిందేశాడు. దానివలన అట్టే ప్రయోజనం కన్పించలేదు. మరణించిన సమయం ఖరారయింది. రాత్రి 10-30 ప్రాంతంలో మరణం సంభవించి వుండవచ్చని డాక్టర్ రిపోర్ట్ చేశాడు. మిగిలిన డీటైల్స్ అనాసక్తంగా వున్నాయి.

తరువాత టెక్నికల్ రిపోర్ట్‌నూ, ఫోరెన్సిక్ రిపోర్ట్‌నూ కలిపి దానికి తోడుగా డాక్టర్ రిపోర్ట్‌నుంచి తన సంతకం ఫైల్స్‌లో పెట్టేశాడు.

ప్రింట్స్ రిపోర్ట్ వంక చూశాడు - చాలా రకాలయిన ప్రింట్స్ వున్నాయి. స్పష్టంగా ట్రేస్ చేసినవి ముప్ఫయి వరకూ వున్నాయి. వీటిలో ఓ ఏడు ప్రింట్స్ సరిగ్గా కాంబినేషన్‌లో అరేంజ్ అవుతున్నాయి. అంటే మూడు స్టెప్స్ - ఓ స్టెప్ అద్దంలో నిలిచిపోయింది. ఆ స్టెప్స్ స్పోర్ట్స్ షూవి. ఎవరో ప్లేయర్ ప్రింట్స్ అవి. ఎప్పుడో సాయంత్రం పూట అతనా ప్రాంతంలో తిరిగి వుండ వచ్చు - స్పోర్ట్స్ షూ కాబట్టి ప్రింట్ స్పష్టంగా వుందను కొని ఆ తాలూకు కాగితాలని కిందేశాడు సోమన్న.

మిగిలిన ప్రింట్స్‌లో ఓ ప్రింట్ కిందకు అయిదు సరిపోయాయి. కానీ ఆ ప్రింట్ పోలీస్ సెంట్రీలు వాడే షూ ప్రింట్స్. ఎవరో సెంట్రీవయి వుంటాయి. అయినా

వాటిని కూడా వదలకుండా సోల్ సైజునుబట్టి షూ సైజ్ నంబర్‌ను వెతకసాగాడు తన ప్రక్కన వున్న బుక్‌లో. ఆ బుక్ పోలీస్ డిపార్టుమెంట్ వారి కోసం తయారు చేసింది. ఒక్కో షూ కంపెనీ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన ఫుల్ డీటయిల్స్ ఆ బుక్‌లో వున్నాయి. మిగిలిన వాటిని కూడా రఫ్‌గా రిపోర్టు చేశాడు.

తరువాత ఫోటోగ్రాఫ్స్ చేతిలోనికి తీసుకొని జాగ్రత్తగా చూడసాగాడు.

కోనికా కంపెనీ ఫిల్మ్ మీద ప్రింట్స్ అవి.

చాలా ఖరీదు చేస్తున్నాయి.

తనకు అవసరమైన ఫోటోస్‌ను ఓ సిరీస్‌లో అవసరం లేనివి యింకో సిరీస్‌లో అరేంజ్ చేయసాగాడు.

ఆ కార్యక్రమమంతా ముగించేసరికి రెండయింది.

కుర్చీలోంచి లేచి టీ తాగి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు.

తెల్లకాగితాలమీద రిపోర్టు తయారు చేయసాగాడు. అంతవరకూ ప్రాధమిక దర్యాప్తులో తేలిన విషయాలను క్రోడీకరిస్తూ చిన్న రిపోర్టు తయారు చేశాడు.

అసలది ఆకస్మిక మరణమా? హత్యా? అంటూ ముగించాడు. స్కూటర్ ఆక్సిడెంట్‌కు ముందు బ్రేకులు వాడకపోవడం యింకో గమనించదగ్గ విషయం. బ్రేకులు వాడకుండానే రైడర్ స్కూటర్ మీదా నుంచి ఎలా విసిరివేయబడ్డాడు! అలా విసిరివేయబడటానికి గల కారణాలు కూడా మెన్షన్ చేశాడు తన రిపోర్టులో.

మొదటిది: స్పీడ్ బ్రేకర్‌మీద వేగంగా పోతున్నపుడు ప్రత్యేక కారణాలవలన స్కూటర్ రోడ్డుమీదికి విసరబడివుండవచ్చు.

రెండవది: స్పీడ్ బ్రేకర్ మీద ఏదైనా వస్తువు అడ్డం

వచ్చివుండాలి.

మూడవది: ఆవు, కుక్క లాంటివి ఆ చీకట్లో స్కూటర్‌కు గుద్దుకొని వుండవచ్చు.

నాలుగు: కావాలని ఎవరయినా స్కూటర్‌కు అడ్డంకును ఏర్పరచి వుండవచ్చు.

మొత్తం తనకున్న అనుమానాలన్నిటినీ కాగితంమీద పెట్టాడు సోమన్న. అతని కెందుకో నాలుగో కారణంమీద బాగా గురి ఏర్పడింది. కానీ ఎవరైనా వ్యక్తి అడ్డు వచ్చివుంటే అతనెలా ఎస్కేప్ కాగలిగాడు. అతడి ప్రింట్స్ దొరకలేదు కదా! పారిపోతున్నప్పుడు సాధారణంగా పరిగెత్తి వుండాలి. అపుడు ప్రింట్స్ కూడా ప్రత్యేకంగా వుంటాయి. వీటన్నిటిని పరిశీలించి సోమన్న ఓ నిర్ణయానికి వచ్చాడు.

తరువాత ఫోటోగ్రాఫ్స్‌ను జాగ్రత్తగా చూడసాగాడు. అతనికి ఏ ఆధారమూ చిక్కలేదు.

తిరిగి మొదటనుంచి చివరవరకూ అన్నింటినీ గమనించాడు. ఈసారి స్కూటర్ మీద అతని దృష్టి పడింది.

శవంకన్నా ఓ రెండు గజాల దూరంలో పడివుంది స్కూటర్ - అంటే బాడీ స్కూటర్‌మీదనుంచి విసిరివేయబడి వుండాలి. అయితే మొదటి కారణం కూడా నిజమే అయివుండాలి. స్పీడ్ బ్రేకర్ స్కూటర్‌ను విసిరేయగానే ఆ అదటుకు అతని శరీరం క్రిందపడిపోయివుండాలి. యిలా పడివుంటే తల వెనుక భాగం పగిలిపోవాలి కానీ మొత్తం తలంతా ఎలా పగిలిపోయిందన్న అనుమానం వచ్చింది సోమన్నకు.

కొద్దిసేపు ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చి యింకో

కాగితం తీసుకొన్నాడు.

అది హత్య అయివుంటే—

ఈ శీర్షిక వ్రాసి దానిక్రింద అనుమానించదగ్గ పరిస్థితులను పాయింట్లుగా వ్రాయసాగాడు.

యింకో పేపర్ మీద ఆకస్మిక మరణమయివుంటే —

అని వ్రాసి దానిక్రింద చాలా కొద్దిగా వ్రాశాడు.

అంటే అతని యిన్‌స్టింక్ట్ కూడా అది హత్యే అని చెప్తోంది.

హత్య అయివుంటే—

దానిక్రింద పాయింట్స్ చూశాడింకోసారి!

ఖచ్చితమైన ఆధారం ఒక్కటి కూడా దొరకలేదు.

తరువాత అతనికి గుర్తొచ్చింది ప్రింట్స్ మ్యాటర్.

అతను అనుమానించిన ప్రింట్స్ రెండే రెండు— ఆ రెండూ ఒకటి స్పోర్ట్స్ షూది—రెండవది పోలీస్ షూది!

పోలీస్ షూ పక్కన పడవేశాడు.

స్పోర్ట్ షూను జాగ్రత్తగా గమనించాడు.

ఆక్షన్ షూది ఆ ప్రింట్.

క్రికెటర్స్ వాడేది. కానీ పరిగెత్తినపుడు పడే ప్రింట్‌లా లేదు. గ్రౌండ్‌లో క్రికెటర్ నడిచిపోయే విధంగా వుంది. అయినా సోమన్న అనుమానం తీరిపోలేదు.

షూ నెంబర్‌ను గమనించాడు. నంబర్ 8. అది సుమారు 20 సంవత్సరాల క్రికెటర్ షూ అయివుండవచ్చు అది.

తిరిగి ప్రింట్స్ వాచ్ చేశాడు.

అవి—అవి బ్యాట్స్‌మన్ ఆఫ్‌స్ట్రోక్ కొట్టాక పరిగెత్తే విధంగా వున్నాయి. కానీ అవి రోడ్డుకి ఎడమ ప్రక్కన

దొరికాయి. అప్‌స్ట్రోక్ తరువాత పరిగెత్తితే కుడివైపు రావాలి. కాబట్టి ఆ మరణంకు క్రికెటర్‌కు సంబంధం లేదని అనుకొన్నాడు.

ఆ ప్రింట్స్ స్ట్రోక్ కొట్టగానే బాల్‌కేసి చూస్తూ నెమ్మదిగా స్టెప్ తరువాత స్టెప్ వేస్తూ పరిగెట్టినట్లున్నాయి. కానీ ఎడమవైపుకి పోతున్నాయి ఎడమవైపుకి పోవాలంటే బ్యాట్స్‌మన్ ఎడమవాటం అయివుండాలి. కానీ బ్యాట్స్‌మన్ పరంగా అది అన్‌స్ట్రోక్ అవుతుంది.

యిలా అన్‌స్ట్రోక్ పరంగా చూస్తే—

సోమన్న యింకోసారి పోల్చాడు.

ఎగ్జాక్టిలీ!

ఖచ్చితంగా సరిపోతాయి.

లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌మన్ అన్‌స్ట్రోక్ కొట్టి పరిగెత్తేది ఎడమవైపుకే! అంటే సమ్ క్రికెటర్‌కూ ఈ మరణానికి సంబంధంవుందా? అయితే అది హత్యేనా? హత్య అయితే, ఎందుకు హత్యచేశాడో తీరిగ్గా కనుకోవచ్చు అనుకొన్నాడు. సోమన్న సంతోషంగా మర్డర్ ఐడెంటిఫికేషన్ వ్రాయబోయి ఆగిపోయాడు. అదంతా తన ఫిక్షన్ మాత్రమే. తన వూహామాత్రమే. అది ఎంతవరకూ నిజమో చెప్పే సాక్ష్యాలు లేవు. టవున్‌లో, టవున్ బయటా కావల్సినంతమంది ఎడంచేతివాటం బ్యాట్స్‌మెన్ వుంటారు. ఎందరిని అనుమానించాలి అన్న అనుమాన మొచ్చి కామ్‌గా కూర్చొని యింకో ఆంగిల్‌లోనికి తన ఆలోచనను తిప్పాడు.

కొద్దిసేపటికి—

అతనికింకో చక్కటి ఐడియా వచ్చింది.

కిరణ్ స్నేహితులలోగానీ, శత్రువులలోగానీ క్రికెట్‌కు చెందిన వారెవరైనా వున్నారేమో కనుక్కొంటే కొంచె మైనా ఆధారం దొరుకుతుంది అనుకొన్నాడు.

ఈ విధంగా మొదటినుంచి చివరివరకూ అనుమానాలూ, ఆలోచనలే వుంటాయి.

తరువాత తిరిగి మొదటినుంచి చివరివరకు ఆలోచించాడు ఆ క్రికెటర్ గూర్చి. ఒకవేళ క్రికటరే హత్యచేసి వుంటే అతను తన చేతిలోని ఏదో కర్రతో గట్టిగా అతని మొఖాన కొట్టాగనుకుంటే అది అతనికి అన్‌స్ట్రోక్ అవుతుంది. ఒకవేళ అతను ఎడంవాటమయితే! అతను కర్రతో కొట్టాడని ఎందుకనుకోవాలి? కిరణ్ తల పూర్తిగా చితికిపోయింది.

కాబట్టి కర్రతో అతని తల పగలగొట్టారు అని అనుకోవచ్చు! తర్వాతే రోడ్డుమీదపడి రెండోసారి తల పగిలివుంటుంది. తల పగిలేలా కొట్టాలంటే చాలా శక్తి కావాలి! కేవలం కానిస్టేబిల్స్‌లాంటి పోలీస్‌వారికి మాత్రమే ఈ శక్తి వుంటుంది. చాలా బలంగా కొట్ట....

యిక్కడాగిపోయాయి సోమన్న ఆలోచనలు. కానీ వెంటనే సర్దుకొని క్రికెటర్ బ్యాటింగ్ పవర్‌ను గుర్తు తెచ్చుకొన్నాడు. ఒకవేళ నిజంగానే బ్యాట్‌నువాడి తల మీద మోదాదేమో అని అనుకొని తన్ని తాను తృప్తి పరచుకొన్నాడు.

అట్లాగనుకొంటే—అది అన్‌స్ట్రోకవుతుంది. తరువాతదంతా ఖచ్చితంగా సరిపోతుంది.

సోమన్న ఉత్సాహంగా లేచాడు.

3

రామారావుగారి యింటినుండి బయటకొచ్చాడు సోమన్న. అతని చేతిలో చిన్న కాగితముంది. దానిమీద చంద్రకాంత్ అడ్రస్వుంది. చంద్రకాంత్ నిజంగానే ఎడమ వాటం బ్యాట్స్మన్.

సోమన్న చంద్రకాంత్ దగ్గర కెళ్ళాడు.

సోమన్నను చూడగానే ఆశ్చర్యపడినా అతన్ని సాదరంగా ఆహ్వానించాడు చంద్రకాంత్.

సోమన్న తను వచ్చినపని చెప్పాడు.

చంద్రకాంత్ తొట్రుపాటు పడకుండా నెమ్మదిగా లేచాడు. తన షెల్ఫ్ దగ్గరికి నడిచి ఓ కప్పు, యింకేవో కొన్ని కాగితాలు పట్టుకొచ్చాడు. అందులో అతనికి ఎలిబీ వుంది.ఆ టైమ్లో అతను స్పోర్ట్స్మీట్ క్యాంపు కెళ్ళినట్టు.

చంద్రకాంత్ యింట్లోకి దూరాడు సోమన్న. రక్తసిక్తమైన క్రికెట్ బ్యాట్ దొరికింది.

చంద్రకాంత్ కళ్ళల్లో స్పష్టంగా భయం కనిపించింది.

సోరుగా రంగంలోకి దిగాడు.

అర్ధగంట తరువాత చంద్రకాంత్ నిజం చెప్పాడు.

ఆరోజు రాత్రి—

ఆ లింక్ రోడ్డుమీద స్కూటర్ మీద వేగంగా పోతున్న కిరణ్ను తనే క్రికెట్ బ్యాట్తో కొట్టి చంపానని చెప్పాడు చంద్రకాంత్. తనకు క్రికెట్ ఆడటం చేతకాదని పదిమందిలో అవమానం చేశాడని, ఆ కసితోనే కిరణ్ను చంపానని కూడ చెప్పాడు.

చంద్రకాంత్ను అరెస్టుచేసి, విజయగర్వంతో బయల్దేరాడు సోమన్న. □

తప్పంత తప్పు

వసుంధర

ఆ కథ నాకెంతగా నచ్చిందో మాటల్లో చెప్పలేను.

పత్రిక పేరు అపరాధ పరిశోధన.

పద్దెనిమిది పేజీల కథ.

ప్రతి పేజీ రసవత్తరంగా ఉంది.

ప్రతి వ్యాసంలో మా సందేశముంది.

కథలో ప్రయోజనముంది.

నేను తరచుగా అపరాధ పరిశోధన చదువుతూంటాను. అందులో ఎన్నో మంచి కథలు వస్తూంటాయి.

కానీ ఏ కథా నాకింతగా నచ్చలేదు.

రచయిత పేరు చూశాను.

కొత్తగా ఉంది....

ఆ రచన నన్నెంతగా ఇంప్రెస్ చేసిందంటే ఆ రచయిత పేరున్న కథలేమైనా కనబడతాయేమోనని - పాత అపరాధ పరిశోధనలన్నీ తిరగేశాను.

ఎక్కడా ఆ పేరులేదు.

అంటే ఎవరో కొత్తరచయితన్నమాట.....

ఒక కథ చదివి ఆనందం పొందినపుడు—చిన్న కార్డయినా రాసి అతడి నభినందించడం మంచి పాఠకుడి లక్షణం.

నేను వెంటనే అపరాధపరిశోధన చిరునామా కేరాఫ్‌గా యిచ్చి—ఆ రచయిత పేరున ఓ కార్డు వ్రాశాను.

దానికి బదులొస్తుందని నే నెప్పుడు అనుకోలేదు.

నా బాధ్యతను నేను నిర్వహించాను - అంతే!

అయితే నా కార్డుకు బదులొచ్చింది.

నా కార్డును పత్రిక ఎడిటరు రచయితకు పంపిస్తే రచయిత నాకు వెంటనే బదులు రాశాడు.

"కథ బాగున్నందుకు సంతోషం. కథ బాగుంటే ఆ గొప్పతనం నాదికాదు. మీవంటివారి అభిమానం నాచేత ముమ్ముందు మరిన్ని మంచి రచనలను చేయించగలదని ఆశిద్దాం—"

ఇదీ ఆ రచయిత నాకు వ్రాసిన జవాబు. ఆ జవాబు అతడి సంస్కారాన్ని తెలియజేస్తూంది.

నాకు రచయిత చిరునామా కూడా దొరికింది. అత

డిది విశాఖపట్నం.

అప్పుడప్పుడు నేను విశాఖపట్నం వెడుతూంటాను. ఈసారి వెళ్ళినప్పు డా కథారచయితను తప్పక కలుసు కోవాలనుకున్నాను.

కానీ యింతలోనే ఓ విచిత్రం జరిగింది.

నా స్నేహితుడు విశ్వనాథానికి కథా రచయితల ఫొటోలు సేకరించే హాబీ ఉంది. అయితే ఫొటో అడిగే ముందు ఆ రచయితల కథ లతడికీ నచ్చాలి. విశ్వనాథా నికి నేను అపన రచయిత గురించి చెప్పాను.

"పేరేమిటన్నావ్?" అన్నాడు విశ్వనాథం కుతూహ లంగా.

"పే్రరాజు___"

"ఇంతవరకూ అలాంటి పేరున్న రచయిత గురించి నే నెక్కడా వినలేదే?" అన్నాడు విశ్వనాథం.

"ఇతడో కొత్త రచయిత. ఫొటో సేకరించ కూడదూ?"

"నీ కెందుకూ అంత ఆసక్తి!"

"చాలా మంచి కథ రాశాడులే___ముఖం చూడా లనుంది...."

"ఎన్నికథ్రలాశాడేమిటి?"

"నాకు తెలిసి - ఒక్కటే కథ...."

కుతూహలంకొద్ది విశ్వనాథం ఆ కథ చదివాడు.

"ఎలా ఉంది?"

"బాగుంది కానీ యిది నేనెక్కడో చదివాను...."

"ఇక్కడే చదివావు...."

"ఇక్కడ కాదు___మరెక్కడో?"

"అయితే ఇది కాపీ కథంటావా?"

"అలాగే ఉంది—"

నాకు వళ్ళు మండింది. పేర్రాజు కాపీ కథ రాసి దానికి నేనభినందిస్తే సంతోషించాడా? విశ్వనాథం చెప్పింది నిజమైతే పేర్రాజును దుయ్యబట్టాలి.

ఒక మంచి రచన నభినందించడమెంత ముఖ్యమో - కాపీ రచనను గర్హించడమూ పాఠకులకంతే ముఖ్యం.

"ఈ రచన నింతకు ముందే నువ్వెక్కడ—ఎలా చదివావో నాకు తెలియబర్చాలి. చాలా ముఖ్యం" అన్నాను.

ఒక్క నిముషమాలోచించి "ఆఁ గుర్తొచ్చింది" అన్నాడు విశ్వనాథం.

"చెప్పు"

"ఈ కథ నాకు సుచరిత చెప్పింది...."

సుచరిత విశ్వనాథం ప్రియురాలు. వాళ్ళిద్దరికీ త్వరలోనే వివాహం జరుగవచ్చు తాను చదివిన ప్రతి మంచి కథనూ సుచరిత విశ్వనాథానికి వినిపిస్తుంది. కథ చెప్పినప్పుడతడు శ్రద్ధగానే వింటాడు. కానీ ఆమె యీ కథలు చెప్పే అలవాటు మానుకోవాలని వాడు సుచరితను కోరి ఉన్నాడు. బహుశా అందుకే వాళ్ళ వివాహం వాయిదాలు పడుతున్నట్లుంది.

"ఆమెకీ కథ ఎక్కడిది?"

"ఎక్కడిదో చెప్పిందో లేదో నాకిప్పుడు గుర్తులేదు. చెప్పి నాలుగు నెలలు పైగా అయిందనుకుంటాను."

"సరిగ్గా యిదే కథా?"

"కథలో పేర్లుకూడా యివేననుకుంటాను...."

"సుచరిత నడిగి నాకు వివరాలు చెప్పగలవా?"

"ఏం — నువ్వే అడగొచ్చుగా?"

సుచరిత నాకు కజిన్ సిస్టర్. అసలు నా ద్వారానే

ఆమెకూ విశ్వనాధానికీ పరిచయం కలిగి ప్రేమగా మారింది. సుచరిత కథలు భరించలేక నేనామెకు బాయ్ ఫ్రెండ్‌గా విశ్వనాధాన్ని చేశానని విశ్వనాధం తరచు నా దగ్గర వాపోతూంటాడు. హాస్యానికి నాతో వాదలాగన్నప్పటికీ — సుచరితకు కథలు చెప్పడమెంతిష్టమో వినడం వాడికీ అంతిష్టమే —

"ఊళ్ళోనే ఉందా సుచరిత?"

"ఉంది —"

ఆ రోజే నేను సుచరితను కలుసుకున్నాను. కూడా అపరాధ పరిశోధన తీసుకుని వెళ్ళాను. సుచరితతో "ఈ కథ చదివి నీ అభిప్రాయం చెప్పు" అన్నాను.

సుచరిత ఆ కథ రెండు పేజీలు చదివి — "ఈ కథ నేనెప్పుడో చదివాను" అంది.

"అదెలా సాధ్యం?"

సుచరిత నాకు మొత్తం కథ పోల్లుపోకుండా చెప్పింది.

"నిజమే — ఈ కథ నువ్వెక్కడ చదివావు?"

సుచరిత ఆలోచనలో పడింది. ఆమె తరచుగా ఇంగ్లీషు నవల్లు చదువుతూంటుంది. అందులో ఎక్కడైనా తగిలిందేమో యిది। ఆమె కాసేపాలోచించి "ఇది నే నెక్కడా చదవలేదు - శారద చెప్పింది" అంది.

"శారదెక్కడ చెప్పింది?"

"ఏమో —"

"గుర్తు వేసుకుందూ?" అన్నాను ప్రాధేయపడుతున్నట్లు.

"గుర్తురాదు. శారదానే అడగాలి...."

"అడిగి నాకు చెబుతావా?"

"ఊఁ"

"ఎప్పుడడుగుతావు?"

"ఇప్పుడే అడుగుతాను" అంటూ ఫోన్‌వద్దకు వెళ్ళింది సుచరిత.

శారద తండ్రికి కిరాణా దుకాణముంది. ఆమె ఇంట్లో కూడా ఫోనుంది.

శారద, సుచరిత కాలేజీ మేట్స్.

ఫోన్లో సుచరితకు శారద వెంటనే దొరికింది. ఓక్షణం మాట్లాడేక "శారద నీతోనే మాట్లాడుతుందిట" అంది.

నాకు శారదతో పరిచయముంది. నేను, సుచరిత, శారద చాలాసార్లు పేక, క్యారమ్సు వగైరాలాడుతూంటాం.

"హలో!" అన్నాను.

"ఏమిటి — ఏదో కథగురించడుగుతున్నావుట?" అంది శారద.

"అవును — అర్జంటుగా చెప్పాలి...."

"కథలు వినే మూడుంటే తిన్నగా మా ఇంటికొచ్చేయకూడదూ — ఒంటరిగా ఉన్నాను...."

శారద చాలా ఫ్రీగా మాట్లాడుతుంది. మనసులో మాయా మర్మాలుండదు.

నా మనసులో మాయ, మర్మం రెండూ ఉంటాయి. అందుకే నేను ఫ్రీగా మాట్లాడలేను.

"కథగురించిన వివరాలు కావాలి...."

"ఎందుకు?"

"ఎందుకో నీకెందుకు — వెంటనే నే నడిగింది చెప్పు...."

"చెప్పడానికి నాకో యిబ్బంది ఉంది...."

"ఏమిటది?"

"ఈ కథ నేను చదవలేదు—విన్నాను...."

నా కాశ్చర్యం కలిగింది "ఎవరు వినిపించారు?"

"ఆ పేరు చెప్పడానికే భయపడుతున్నాను...."

"చెప్పు—ప్లీజ్" అన్నాను.

"ఏడుకొండలు...."

"వాడెవరు?"

"మా దుకాణంలో పని చేస్తూంటాడు....గుర్తులేదూ?"

ఏడుకొండలు నాకు గుర్తొచ్చాడు. వాడికి నా వయసే ఉంటుంది. చేసేది చాలా చిన్న ఉద్యోగమైనా, చదువు చాలా తక్కువైనా వాడు చూడ్డానికి నాకంటే బాగుంటాడు.

"తెలుసు....వాడు చెప్పాడా నీకీ కథ?" అన్నా నాశ్చర్యంగా.

"గట్టిగా ఏమీ అనకు—వాడే చెప్పాడు...."

"వాడికి కథలు చెప్పడం వచ్చా?"

"అందరికీ చెప్పడు. నాకే చెబుతూంటాడు...."

"నిజమా?" అన్నా నాశ్చర్యాన్నించింకా తేరుకోకుండా.

"ఈ నిజం నాన్నదాకా కూడా వెళ్ళింది...."

"అంటే?"

"ఏడుకొండలు నాకు కథచెప్పడం నాన్న కళ్ళపడింది. ఆయన మా యిద్దర్నీ కలిసి మాట్లాడుకోరాదని శాసించాడు. కాబట్టి ఆ కథగురించి నే నేడుకొండల్నేమీ అడగలేను. నువ్వే అడిగి తెలుసుకోవాలి...."

"నువ్వు ఏడుకొండల్ని ప్రేమిస్తున్నావా?" అన్నాను.

"ప్రేమిస్తున్నానో లేదో—వాడంటే నా కిష్టం. వాడు చెప్పే కథలు నాకిష్టం... "

"అయితే వాణ్ణి పెళ్ళి చేసుకుంటావా?" అనడిగాను.

"వ్యవహారం పెళ్ళిదాకా వస్తే—తప్పెవరిదంటావు?"

"ఇందులో తప్పు ప్రసక్తి ఏముంది?"

"నాన్న ఈ పెళ్ళి కొప్పుకోడు. అలాంటప్పుడు పెళ్ళి కొప్పుకోని ఆయనదా—ప్రేమించిన నాదా—తప్పెవరిది?"

"ఆలోచించి చెబుతాను" ఫోన్ పెట్టేశాను.

"ఏమిటో పెళ్ళి సంగతులు మాట్లాడుతున్నావ్?" అంది సుచరిత.

కథ ఆమెకు చెప్పాను.

"ఛీఛీ—అంత గొప్పింట్లో పుట్టి ఏడుకొండల్ని ప్రేమిస్తుందా— ఆ శారదకు బుద్ధిలేదు" అంది సుచరిత.

"శారదకు బుద్ధిలేదంటే ఆ తప్పు నీది" అన్నాను.

"నాది తప్పెందు కవుతుంది?"

"నువ్వా ప్రేమలో పద్ధాపని మరిచిపోకూడదు...."

"నా ప్రేమకూ దాని ప్రేమకూ పోలికలేదు. నేను ప్రేమించింది విశ్వనాథాన్ని. మా ప్రేమను నా తలిదండ్రులు కూడా ఆమోదిస్తారు...."

"తలిదండ్రులామోదించిన వ్యక్తిని ప్రేమించడం నీ అదృష్టం. అవునా?" అన్నాను.

"అయితే—?"

"నీ అదృష్టం కొద్ది విశ్వనాథాన్ని ప్రేమించావు. దురదృష్టం కొద్దీ శారద ఏడుకొండిల్ని ప్రేమించింది. అందువల్ల ఆమెకు బుద్ధి లేదనడం తప్పుకదూ?" అన్నాను.

"అదా నీ అనుమానం—? బుద్ధున్నవాళ్ళు పెద్దలామోదించే వ్యక్తుల్నే ప్రేమిస్తారు—" అంది సుచరిత.

"ఒక వ్యక్తితో పెళ్ళిని పెద్దలామోదిస్తారని తెలిసేకనే పుట్టే ప్రేమను ప్రేమంటారా? అంటే ఆ తప్పెవరిది?" అన్నాను.

సుచరిత ముఖం ఎర్రబడింది—"మైండ్ యువర్ బిజినెస్...." అందామె.

"శారదది ప్రేమ-నీది బిజినెస్....ఇది గుర్తుంచుకో" అని సుచరితవద్ద సెలవు తీసుకున్నాను.

2

రాత్రి పదకొండింటికి వెళ్ళాను ఏడుకొండలింటికి.

శారద తండ్రి పదింటికి దుకాణం మూసేస్తాడు. ఆ తర్వాత ఇంకో అరగంటకి ఏడుకొండలిల్లు చేరుకుంటాడు.

"నమస్కారంబాబూ!" అన్నాడు ఏడుకొండలు నన్ను చూస్తూనే గుర్తుపట్టి.

"నీతో పనుండి వచ్చాను—" అంటూ కథ గురించడిగాను.

ఏడుకొండలాశ్చర్యపడి—"ఎందుకు బాబూ మీకాకథ గురించింత పట్టింపు:" అన్నాడు.

"ఒక మంచి కథకు ఒరిజినల్ రైటరెవరో తెలుసుకోవడం సమకాలీన పాఠకుడి కర్తవ్యం...."

"ఎందుకని?"

"ఆ రచయితలో నా అభిరుచులకు సరిపడ్డ సందేశాలు, ప్రయోజనకర భావాలు ఉన్నాయి. ఆ రచయితవే మరిన్ని రచనలు చదివి నన్ను నేను సంస్కరించుకోవాలనుకుంటున్నాను —" అన్నాను.

"మనిషిని మనిషి సంస్కరించుకునేటందుకు కథలు పనికొస్తాయంటారా బాబూ?" అన్నాడు ఏడుకొండలు.

"పనికొస్తాయి. మనం చదివే ప్రతిరచనా మనకు తెలియకుండానే మనలో మార్పు తెస్తుంది...."

ఏడుకొండలు నవ్వి—"సమాజంలోని ప్రతి సమస్య గురించి కనీసం కొన్ని దశాబ్దాలుగా రచనలు వస్తూనే ఉన్నాయి. ప్రజలపై వాటి ప్రభావమే గనుక ఉంటే—ఈ పాటికి సంఘంలో సమస్యలన్నవేమీ ఉండకూడదు." అన్నాడు.

వాడి మాటల్లోని కఠోరసత్యం కంటె—ఆ కఠోర సత్యాన్ని తెలుసుకో గలిగిన వాడి సంస్కారానికి నే నెక్కువగా ఆశ్చర్యపడ్డాను.

"అయితే ఏమంటావ్?"

"రచయిత గురించి మీరు తెలుసుకోవడ మెందుకు బాబూ—అనవసరం...."

అప్పుడు నాకోచిన్న అనుమానం కలిగి—"కొంపదీసి ఆ కథ నువ్వే కల్పించావేమిటి?" అన్నాను.

"లేదు బాబూ—కథలు కల్పించేవారిదగ్గరే పనిచేస్తున్నప్పటికీ—చదివినవీ, విన్నవీ ఒకరికి చెప్పడమే తప్ప-కల్పించడం నాకు చేతకాలేదు బాబూ—" అన్నాడు ఏడుకొండలు.

వాడు తెలివిగా మాట్లాడగలడని నాకర్థమైంది. నేర్పుగా వాణ్ణి దెబ్బతీయాలని—"కథలు కల్పించడం చేతకాదంటూనే గ్రంథ సాంగుడివయ్యావు. కథలు కల్పించగల గొప్పవాళ్ళ కూతుళ్ళనే వల్లో వేసుకుంటున్నావు...." అన్నాను.

"బాబూ-ఎవడైనా వలేసి చేపను పట్టేది తిండానికో—తిండిగింజలు సంపాదించుకోడానికో! అలాగే ఏ మగాడైనా పెళ్ళి చేసుకునేది ఆడదాన్నే!"

దెబ్బతిన్నాను. రెండేరెండు వాక్యాల్లో ఎంత వేదాంతం చెప్పాడు ఏడుకొండలు!

ఒక ఆడది, మగాడు కలిసి జీవించడంకోసం పెళ్ళి

అనే సాంఘిక వ్యవస్థ ఏర్పడింది. ఈ చిన్న వ్యవస్థచుట్టూ కులాలు, మతాలు, అంతస్థులు వగైరాలన్నీ పేరుకుంటూ పెళ్ళి ఉద్దేశ్యాన్నే దెబ్బతీస్తున్నాయి.

సుచరిత విశ్వనాథంను ప్రేమిస్తే అది సబబు.

ఏడుకొండలు శారదను ప్రేమిస్తే అది తప్పు.

రెండు సందర్భాల్లోనూ సంబంధం—ఒక ఆడదానికీ మగాడికీ మధ్య!

తప్పెక్కడుంది? ఎవరిలో ఉంది?

"రచయిత గురించి చెప్పడంలేదు-" అన్నాను నేను మాట మారుస్తూ.

"చెప్పడానికి మొహమాటంగా ఉంది బాబూ—"

"ఎందుకని?"

"ఆ కథ మా దుకాణాని కమ్మకాని కొచ్చిన చిత్తు కాగితాల్లో చూశాను....చదివి థ్రిల్లైపోయి ఆ కాగితాలు వేరే పెట్టాను...."

"చిత్తుకాగితాల్లో చూశావా? ఇంకా ఉన్నాయా అందులో కథలు."

"ఉన్నాయి బాబూ—అవన్నీ కథలే—ఓ పత్రికాఫీసులో రిజెక్టయిన కథలు...." అన్నాడు ఏడుకొండలు.

"వాటిలో ఇంకా మంచికథలున్నాయా...."

"అన్నీ చదివాను బాబూ! వాటిలో నా అభిరుచికి సరిపడ్డవి పది కథలున్నాయి. వాటిని తీసి వేరే పెట్టుకుని వాటి తూకానికి సరిపడ డబ్బులు నా యజమాని కిచ్చుకున్నాను...." అన్నాడు ఏడుకొండలు.

"అయితే ఆ కథలన్నీ యిప్పుడు నీ దగ్గరున్నాయా?"

"లేవు బాబూ!"

"ఏమయ్యాయి—చదివేక చించి పారేశావా?"

"లేదుబాబూ - అంత మంచికథల్ని చించిపారేస్తానా?" అన్నా డేడుకొండలు.

"అయితే ఏమయ్యా యా కథలు?"

"మా నాన్న విశాఖపట్నంలో ఉంటున్నాడు బాబూ - ఆయన పనిచేసే షాపు భీమారావుగారిది. ఆ భీమారావుగారబ్బాయి పేర్రాజు. ఆయనకా పది కథలూ ఇచ్చాను...."

అసలు విషయం నా కర్థమైపోయింది.

"చిక్కావులే—పేర్రాజూ!" అని మనసులో అనుకుని "ఆయనకు నువ్వెందుకిచ్చావు?" అన్నాను.

"పేర్రాజుది మా మంచి మనసుబాబూ! నాకో అక్షరం ముక్క అబ్బిందంటే—నాలో కాస్త సంస్కారం ఏడ్చిందంటే—నాకీ ఊళ్ళో ఉద్యోగం వచ్చిందంటే—అంతా ఆ బాబు చలవే! నేను చదివిన మంచి కథలన్నీ ఆయనకిచ్చి చదివించి—నాకు తిన్నగా అర్థమయిందో లేదో తెలుసుకుంటూంటాను—" అన్నా డేడుకొండలు.

"అయితే ఆ బాబేం చేశాడో తెలుసా? ఆ కథల్ని తన కథలుగా అచ్చేయించుకుంటున్నాడు ..." అన్నాను.

"మీరీ విషయంముందే చెప్పారు. కానీ మా పేర్రాజు బాబలాంటి వాడుకాదు. ఎందుకలా చేశాడో ఏమో—" అని— "బాబూ—ఒక పత్రికనుంచి తిరిగొచ్చిన కథను మరో పత్రికలో అచ్చేయిస్తే తప్పా?" అన్నాడు ఏడుకొండలు.

"అది తప్పుకాదు. కానీ వేరే రచయిత కథకు తన స్వంతం చేసుకోవడం తప్పు. పేర్రాజు తన తప్పు తెలుసుకోవాలి. ఆ కథకు ఒరిజినల్ రచయిత ఎవరో నీకు గుర్తున్నాడా? అతడి చిరునామా నీ దగ్గరుందా?"

"లేదుసార్ ...."

"అయితే నేను పేౖరాజును కలుస్తాను...."

"ఆయన్ను కలిసీ లాభంలేదుసార్...."

"ఎందుకని?"

"ఆ కథల్లో ఎక్కడా చిరునామాలేదు. రచయిత పేరు కూడా లేదు. కథపేరుంది. కథవుంది. కథ మొదటిపేజీ మీద ఇంటూ మార్కుంది. R అన్న ఇంగ్లీషుపదం సున్నా లోపల ఉంది. పైన ఒకటి రెండు కాగితాలు చిరిగిన గుర్తుంది. బహుశా అడ్రసు కాగితాలై ఉండవచ్చు...."

నే నాలోచనలో పడ్డాను.

"ఆ పది కథలూ కూడా ఒకే రచయితవి సార్. కథ లన్నీ ఆణిముత్యాలు. దస్తూరీ ఒక్కటే. శైలిఒక్కటే.... అంతే నేను మీకు చెప్పగలను...."

"పాపం—ఆ రచయిత ఎవరోగానీ—ప్రస్తుతానికి పాఠక లోకంలో అతడిపేరు పేౖరాజు—" అని ఏడు కొండల దగ్గర సెలవు తీసుకున్నాను.

ఆ రాత్రంతా ఆలోచనలతో నాకు నిద్రపట్టలేదు.

ప్రస్తుతం ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నానేమో — ఈ విషయమై ఏదో ఒకటి సాధించాలని పట్టుదలగా ఉంది.

మర్నాడుదయం ఏడుకొండలు చెప్పిన పత్రిక కార్యా లయానికి వెళ్ళాను.

సంపాదకుడు చాలా బిజీగా ఉన్నాడు.

ఏదో పేజీలో చిన్న కాళీ ఉండిపోయిందని ఒకరు, ముఖచిత్రం లేఔట్ గురించింకొకరు, ఘాటయిన విమ ర్శల ఉత్తరాలతో కొందరు ఆయన చుట్టూ తిరుగుతు న్నారు. అలాంటి పరిస్థితిలో ఆయన్ను డిస్టర్బ్ చేయ డానికే నేను వెళ్ళానా అనిపించింది.

ఏమైనప్పటికీ ఆయన నాతో విసుగును ప్రదర్శించ

లేదు.

నేను అపరాధపరిశోధన ఆయన ముందు పెట్టి - "ఇది మీరు చదువుతారా?" అనడిగాను.

ఆయన నవ్వి - "పత్రికా సంపాదకులవంటివారి మెదడుకు రిలీఫ్ నిచ్చే పుస్తకాలు అపరాధ పరిశోధన, చందమామ...." అన్నాడు.

"ఇందులో పడ్డ ఈ కథను చదివారా?" అనడిగాను.

ఆయన ఓపిగ్గా ఆ కథ మొదటి పేజీ చదివి-"నిన్ననే చదివానీ కథ....అద్భుతంగా ఉంది. ఇలాంటి కథను మా పత్రికలో అయితే ప్రత్యేకంగా సంపాదకీయం రాసివేసే వాణ్ణి" అన్నాడు.

"కానీ-ఇది మీ పత్రిక నుంచి రిజెక్టయింది...." అన్నాను.

"ఎలా తెలుసు మీకు?"

"మీ దగ్గర చిత్తుకాగితాలు కొన్న ఆసామీద్వారా నేనీ విషయం తెలుసుకున్నాను."

సంపాదకుడి ముఖం ఎర్రబడింది - "మీరు నన్నీ విషయమై నిలదీయాలని వచ్చారా?"

"లేదు సార్! నేను వచ్చిన పని ఇప్పుడే చెబుతాను. కానీ ఇంత మంచి కథను రిజెక్టు చేసినందుకు మీకు బాధగా లేదా?" అన్నాను.

"బాధగానే ఉంది. కానీ ఏం చేయగలను! మా కొచ్చే కథ లెక్కువ. చదవడానికి స్టాఫ్ తక్కువ. చదివే వాళ్ళందరూ అభిరుచి వున్నవాళ్ళని చెప్పలేం. అందువల్ల ఎన్నో కథలు రిజెక్టవుతూండవచ్చు...."

"అలాగే ఎన్నో చెత్తకథలు కూడా సెలక్టవుతున్నాయి...."

"కావచ్చు. కథల ఎన్నిక విషయంలో మాకున్న షరతులు, పద్ధతులు నీ కర్థం కావు. అర్థమయేలా చెప్పే అవసరమూ నాకు లేదు. నన్నేమడిగి తెలుసుకోవాలనుకుంటున్నావో చెప్పు" అన్నాడాయన.

ఈ కథా రచయిత చిరునామా మీ నుంచి సంపాదించా లనుకుంటున్నాను."

"ఎందుకు?"

జరిగింది క్లుప్తంగా ఆయనకు చెప్పాను.

"నీలోని పాఠకుడ్ని నే నభినందిస్తున్నాను. కానీ ఈ కథకు ఒరిజినల్ రచయిత చిరునామాను నేను నీ కివ్వలేను. అది సాధ్యం కాదు" అన్నాడు సంపాదకుడు.

అంతటితో కథ ముగిసినట్లే భావించాను నేను.

కానీ మరుసటి మాసం అపనలో ఒక ఉత్తరం పడింది. ఆ ఉత్తరంతోపాటే సంపాదకుని వ్యాఖ్య కూడా పడింది.

ఉత్తరం - ప్రకాష్ అనే రచయిత నుంచి.

ఆ కథ తనదనీ - తను చాలా పత్రికలకు పంపితే ప్రచురణకు స్వీకరించబడలేదనీ - అది అపరాధపరిశోధన పత్రికలోని కెలా వచ్చి చేరిందో తెలియబరచమనీ - ఒరిజినల్ రచయిత సంపాదకుణ్ని ప్రశ్నిస్తూ రాశాడు.

దీనికి బదులిచ్చేవరకూ పేర్రాజు - ఇతర రచనల ప్రచురణ నిలుపుదల చేయబడిందని సంపాదకుడు రాస్తూ- ఏ కారణంచేతనయినప్పటికీ యితర రచయితల కథలు తిరస్కరించి రచయితగా చెలామణీ అవాలని ఎవరయినా అనుకుంటే అది గర్హించదగ్గ విషయమని వ్యాఖ్యానించాడు.

నాకు నచ్చిన కథకు - ఒరిజినల్ రచయిత బయటపడి

నందు కెంతో సంతోషించాను. అయితే వ్యవహారం ఓ కొలిక్కి రావడానికి - నేను మరో నెల ఎదురు చూడాల్సి ఉంది. కానీ అది నాకు సాధ్యం కాదు.

పేర్రాజును స్వయంగా కలుసుకుని సంజాయిషీ అడగాలనుకున్నాను.

మర్నాడే విశాఖపట్నం బయల్దేరి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి పేర్రాజింట్లో లేడు.

"ఆయన కోసం - ఎవరో ప్రకాష్ అనే ఆయనొచ్చాడు ఇద్దరూ కలిసి బయటకువెళ్ళారు" అని చెప్పాడు పనివాడు.

అంటే ప్రకాష్ స్వయంగా పేర్రాజును కలుసుకున్నాడన్న మాట!

ఇద్దరి మధ్యా యుద్ధం తప్పదు.

నాకు చాలా కుతూహలంగా ఉంది ఏం జరిగిందో తెలుసుకోవాలని.

అందుకే పేర్రాజు కోసం నాలుగుసార్లు తిరిగాను.

నాలుగోసారి పేర్రాజు నాకు దొరికాడు.

మనిషి నా వయసువాడే!

ముఖంలో డబ్బుకళ ఉంది. కళ్ళలో చురుకుతనముంది.

అతడికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

అతడు వెంటనే నాతో కరచాలనం చేసి - "చాలా సంతోషం మిమ్మల్ని కలుసుకుందుకు" అన్నాడు.

"మిమ్మల్నిలా కలుసుకోవలసి రావడం నాకు సంతోషంగా లేదు" అన్నాను.

"నా మీద వచ్చిన అభియోగం గురించా?"

"అవును...."

"అందులో నా తప్పేమీ లేదు."

"హత్యచేసినవాడు కూడా తను తప్పు చేయటంలేదను కుంటాడు."

పేరాజు నవ్వి "నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు.

"అంటే?"

"కోర్టులో న్యాయవిచారణ జరిగేక - ఉరి తీసేవాడు ముద్దాయి నురితీస్తే - అది కర్తవ్య నిర్వహణ అనిపించు కుంటుంది తప్ప నేరమనిపించుకోదు. కోర్టులో న్యాయ విచారణ జరక్కుండానే ముద్దాయి నురితీసేవాడు ఉరితీస్తే అది హత్య అనిపించుకుంటుంది" అన్నాడు పేరాజు.

"అనిపించుకోవచ్చు. కానీ అలా ఎన్నడూ జరుగదు."

"కొన్నిచోట్ల అలాగే జరుగుతోంది."

"ఎక్కడ అలాజరుగుతోందో నేను తెలుసుకోవచ్చా?"

"పత్రికా లోకంలో! ఒక రచయిత తన మేధాశక్తి నంతా వినియోగించి రచన చేస్తే ఆ రచనలోని మంచి చెడ్డలను శ్రద్ధగా పరిశీలించి యోగ్యమైనదైతే పాఠకుల ముందుంచవలసిన బాధ్యత పత్రికలది. ఆ పత్రికా నిర్వాహ కులది. ముఖ్యంగా పత్రికా సంపాదకులది. కానీ ఎంత మంది పత్రికానిర్వాహకులు, సంపాదకులు తమ బాధ్యత లను సక్రమంగా నిర్వహిస్తున్నారు? రచయిత పడ్డ శ్రమకు రచయిత కృషికి వారెంతవరకూ న్యాయం చేకూరుస్తు న్నారు! ఆలోచించి చూస్తే - పరిశీలించి చూస్తే - న్యాయ విచారణ జరక్కుండానే ముద్దాయి నురి తీయడానికి సిద్ధం చేసినట్లు ఎన్నో మంచి రచనలు నిరాకరించబడుతున్నాయి. ఇందుకుదాహరణ అపరాధ పరిశోధనలో ప్రచురించబడిన పేరాజు రచన!"

విషయాన్ని నేనీ కోణం నుంచి ఆలోచించలేదు.

పేర్రాజు చెప్పిందాని కాశ్చర్యపడుతూ "మీరు చేసిన తప్పుకు సంజాయిషీ ఈ సమాధానంలో ఉందంటారా?"

"ఏడుకొండలు తెచ్చిన కథలు చదివి - అవి ఏ పత్రిక నిరాకరించినా ఆ పత్రికను క్షమించలేననుకున్నాను. అంతటి గొప్ప కథ లవి. ఆ కథా రచయితెవరో నాకు తెలియదు. తెలుసుకునే మార్గం కూడా లేదు. ఆ రచనలను పాఠకుల ముందుంచడానికి అపరాధపరిశోధన పత్రిక నెన్నుకున్నాను. ముందుగానే రచయిత పేరు విషయంలో కాంట్రోవర్సీ తెస్తే ఏ సంపాదకుడూ ప్రచురించడు. అందుకే రచనలను నా పేరుతోనే పంపాను...."

"మీరు చెప్పేది నమ్మశక్యంగా లేదు. అపరాధ పరిశోధనలో మాత్రం ఆ కథలకు సరైన న్యాయం చేకూరుతుందని ఎలాగనుకున్నారు?" అన్నాను.

"అందుకు కారణం చాలా సింపుల్. అపరాధపరిశోధనలో రచనలు ప్రారంభించిన వారిలో చాలా మంది నేడు ఆంధ్రదేశంలో అగ్రరచయితలుగా చెలామణీ అవుతున్నారు. చాలాకాలంగా అపనను చదువుతున్న నా అభిప్రాయంలో - ఏ కథనయినా శ్రద్ధగా చదివి దానికి న్యాయం చేకూర్చే అతి కొద్ది పత్రికలలో-అపన ఒకటి. అందుకే ఆ పత్రిక నెన్నుకున్నాను.

ప్రకాష్ నా నిజాయితీని హర్షించి నా తప్పును క్షమించాడు. తనలోని మేధాశక్తితో సమాజంలోని కుళ్ళును బయటపెడుతూ పాఠకులకు చక్కని సందేశాన్నిచ్చేందుకు తనకొక పత్రికను చూపించినందుకు నాకు ఋణపడి ఉంటానని కూడా అన్నాడు. రవంత తప్పు చేసినా నా ఆశయం నెరవేరింది. అయితే ఒకే ఒక్క ప్రశ్న నాలో ఇంకా మిగిలిపోయింది...." అన్నాడు పేర్రాజు.

"ఏమిటది?"

"సాహిత్యంలోని ఈ ప్రస్తుతసమస్యలో-తప్పెవరిది?"

"పేర్రాజుగారూ! ప్రస్తుతం మన వ్యవస్థలో ఎన్నో సమస్యలున్నాయి. అన్నింటికి పరిష్కార మార్గాలున్నాయి. వాటిని తమ రచనలద్వారా ప్రజల ముందుంచి వారిని ప్రభావితుల్ని చేయవలసినవారు రచయితలు. ఆ రచయితలకు సంబంధించిన పరిస్థితులేమిటో మీ కథ తెలియజేస్తూనే ఉంది - అందుకే ఎన్నో విషయాల్లో తప్పెవరిది అన్న ప్రశ్నకు మనం సమాధానం చెప్ప లేకుండా ఉన్నాం" అన్నాను.

"ఈ మీ అనుభవాన్నే ఒక కథగా పాఠకుల ముందు ఉంచుదాం. తప్పెవరిదో పాఠకులే తెలుసుకుంటారు" అన్నాడు పేర్రాజు.

ఈ కథ రాసే బాధ్యత నేను పేర్రాజుకు వదిలిపెడితే అతడింకెవరికో విడిచి పెట్టాడు. □

టోపీ?



కోడెత్రాచు పడగ

తిరుమలశ్రీ



అమావాస్య రాత్రి.

అందకారానికి భయపడి కాబోలు చంద్రుడు డ్యూటీలోకి రాలేదు.

ఫలితంగా అంతటా కారు చీకటి క్రమ్ముకుంది.

గాంగ్‌టాక్ పరిసరాలలోని ఓ భయంకర కీకారణ్యం అది.

కాకులు దూరని కారడవి అయినా—ఓ టార్చిలైట్

ప్రాణం పోసుకున్న పుత్తడి బొమ్మలా దట్టమైన ఆ అడవిగుండా అతికష్టంమీద ముందుకు సాగుతోంది.

కన్ను పొడుచుకున్నా కానరాని ఆ కారు చీకటిలో

ఎక్కడ, ఏ విషపు పురుగు వుంటుందో....

ఎక్కడ, ఏ జంతువు వుంటుందో....

తెలీని ఆ భయంకర అరణ్యంలో—

ప్రాణాలకు తెగించి....

'దురాశ అనే అంశాన్ని మార్గదర్శిగా చేసుకుని....

అత్యంత కాంతివంతమైన టార్చ్‌లైట్ సహాయంతో....

అడుగడుగుకూ పుడిగిపోతూన్న ధైర్యాన్ని కూడ దీసుకుంటూ....

క్షణ-క్షణమూ పెరిగిపోతూన్న పిరికితనాన్ని పార ద్రోలడానికి విశ్వప్రయత్నం చేస్తూ....

ఒక చేతిలో పిస్టలూ....మరో చేతిలో టార్చిలైటూ పట్టుకుని....

వెర్రి ధైర్యంతో....దుస్సాహసంతో.... ముందడుగు వేస్తున్నాడు బరూవా.

బరూవాకు నలభయేళ్ళుంటాయి. పొట్టిగా, దృఢంగా వుంటాడు. చీకట్లో కలిసిపోయే వొంటిరంగు అతనిది.

అతికష్టంమీద అడుగులు ముందుకు వేస్తూన్నా.... అతని మస్తిష్కం మాత్రం....వెనుకకు పోతోంది— గతాన్ని నెమరు వేసుకునేందుకు.

ఆ డేంజరస్ 'ఎక్స్‌పెడిషన్' వెనుకనున్న పుదంతం అతని మెదడు పుటల్లోంచి మనోనేత్రంలోకి జారసాగింది.

2

నెల రోజులక్రితం సిక్కిం రాజధానీ నగరమైన గాంగ్‌టాక్‌లోని 'పీపుల్స్ బ్యాంక్'లో దోపిడి జరిగింది.

ఇద్దరు వ్యక్తులు కలిసి చేసిన ఆ దోపిడిలో సుమారు కోటి రూపాయలు దోచుకోబడ్డాయి.

పట్టపగలు....పకడ్బందీగా జరిగిన దోపిడీ కేవలం అర గంట వ్యవధిలో కోటి రూపాయలను దోచుకుపోయారు దొంగలు.

సిక్కిం చరిత్రలో అంత పెద్ద బ్యాంక్ దోపిడీ అదే కావడంతో రాష్ట్రమంతటా గొప్ప సంచలనం, ఆలజడీ రేగాయి. దేశం దిగ్భ్రాంతపోయింది.

రాష్ట్రానికి చెందిన డిటెక్టివ్ శాఖ అంతా బ్యాంక్ దొంగలను పట్టుకునేందుకు రంగంలోకి వురికింది. ఫలితం లేకపోవడంతో న్యూఢిల్లీనుంచి సి. ఐ. డి. లు రప్పించబడ్డారు.

బ్యాంకి దోపిడీలను పరిశోధించడంలో ప్రత్యేక శిక్షణ, అనుభవమూ గల భారత సి. ఐ. డి. లు నెల్లాళ్ళ అవిరళ కృషి అనంతరం దొంగలలో ఒకణ్ణి బంధించడం జరిగింది.

ఆ దొంగకు ముప్ఫయ్యేళ్ళుంటాయి.

సన్నగా వున్నా ధృఢమైన శరీరంతో బలంగా వున్నాడు. నల్లగా, పొట్టిగా వున్నాడు.

టాప్ అఫీషియల్సు అతని ఇంటరాగేషన్‌కి పూనుకున్నారు.

అయితే—అప్పుడుగాని తెలిసిరాలేదు వాళ్ళకు అసలు సమస్య ఏమిటో!

ఆ దొంగ అస్సామ్ రాష్ట్రానికి చెందిన ఉగ్రవాద దళానికి చెందినవాడు. అతనికి అస్సామీస్ తప్ప మరే ఇతర భాషా రాదు.

అతన్ని ఇంటరాగేట్ చేయడానికి పూనుకున్న పోలీసు

ఆఫీసర్సులో ఎవరికీ అస్సామీస్ అర్థంకాదు.

ఏం చేయాలో అని ఆలోచిస్తూండగా సిక్కిం ప్రభు త్వపు సెక్రటేరియట్‌లో సెక్షనాఫీసరుగా వున్న బరూవా గుర్తుకు వచ్చాడు వారికి.

బరూవా అస్సామీస్. ఉద్యోగరీత్యా పదేళ్ళుగా సిక్కింలో వుంటున్నాడు. అందుకే అతనికి సిక్కింలో మాట్లాడే భాషలు కూడా వచ్చును.

వెంటనే బరూవా పోలీస్ హెడ్‌క్వార్టర్సుకి రప్పించ బడ్డాడు.

బరూవా సమక్షంలో దొంగయొక్క ఇంటరాగేషన్ ఆరంభమయింది.

పోలీస్ ఆఫీసర్సు ఆంగ్లంలోనూ, సిక్కిమీస్ భాష లోనూ ప్రశ్నిస్తూంటే—బరూవా దొంగను అస్సామీస్‌లో అడుగుతున్నాడు. అతను చెప్పిన జవాబులను తర్జుమా చేసి అధికారులకు చెబుతున్నాడు.

"నీపేరేమిటి?" మొదటి ప్రశ్న.

"కవీటా" చెప్పాడు దొంగ.

"ఫలానా రోజున....ఫలానా సమయంలో....గాంగ్ టాక్‌లోని పీపుల్స్ బ్యాంకిని దోచుకున్న ఇద్దరిలో నువ్వూ ఒకడివి కదూ?"

కాదన్నాడు వాడు.

మరుక్షణంలో పోలీస్ తన్నిన బూటు దెబ్బకు దొంగ కడుపులోని ప్రేగులన్నీ తెగిపోయాయి.

"ఔను బాబోయ్" అంటూ వాప్పేసుకున్నాడు కవీటా. రెండు చేతులతోటీ కడుపు పట్టుకుని ముందుకు వొరిగిపోయాడు గిలగిల లాడిపోదూ.

"రెండవ వాడు ఎక్కడ?"

"నాకు తెలీదు."

ఈసారి కంట్లో పచ్చికారం చల్లబడింది.

విలవిల లాడిపోయాడు కళ్ళుమూసుకుని.

"చెప్పు! రెండోవాడెక్కడ?" గర్జించాడు పోలీస్ ఆఫీసర్.

"నిజంగానే నాకు తెలీదు దోపిడి జరిగిన రోజునే విడిపోయాము. ఈ గొడవ అణిగేంతవరకు ఇద్దరమూ కలిసి తిరగకూడదనుకున్నాము. అందుకే వాడు ఎక్కడ వున్నాడో నాకు తెలీదు" మొత్తుకున్నాడు దొంగ.

"వాడి పేరేమిటి?"

"సైకియా"

"వాడి వయసెంత!"

చెప్పాడు. వాడి ఆనవాళ్ళు కూడా చెప్పించి నోట్ చేసుకున్నారు. వాడూ అస్సామీసే అనీ, ఉగ్రవాద దళానికి చెందిన వాడేననీ చెప్పాడు.

అయితే కవీటా ఏం చెప్పినా చిత్రహింసలకు గురయి తప్ప సులువుగా నిజం చెప్పకపోవడంతో, వొళ్ళు మండిన అధికారులు అతన్ని చిత్ర విచిత్ర పద్ధతులలో హింసలకు గురిచేసారు.

పోలీసుల తర్డ్ డిగ్రీ మెథడ్స్ని చూస్తూంటే దొంగ మాట ఎలా వున్నా, బరూవాకు కాళ్ళు వొణకసాగాయి. భయంతో వొళ్ళు చల్లబడసాగింది.

ఇక ముఖ్యమైన ప్రశ్నకు వచ్చారు.

"దొంగసొమ్మును ఎక్కడ దాచారు?"

కవీటా వెంటనే జవాబివ్వలేదు.

అసలు నోరు మెదిపి సమాధానం ఇవ్వగల స్థితిలో లేడతను. పూర్తిగా షేప్ మారిపోయాడు.

అలాంటి పద్ధతులు వుపయోగిస్తే తప్ప అతను నిజం చెప్పడం లేదాయె!

అతను చచ్చిపోతాడేమోనని బరూవాకు భయంగా వున్నది. తన రాష్ట్రం వాడన్న అభిమానము, జాలి అంత రాళ్లో ఎక్కడోవున్నా, దానిని ముఖంలో చూపించ డానికి ధైర్యం చాలలేదు అతనికి.

"దొంగసొమ్ము ఎక్కడ?"

ఎంత ప్రశ్నించినా, ఎంత చావగొట్టినా నోరు మెదపడం లేదు కవీటా.

చివరకు శరీరంలోని సున్నిత ప్రాంతాలలో ఎలెక్ట్రిక్ షాక్ ఇవ్వడంతో నోరు మెదిపాడు.

"గాంగ్‌టాక్ పరిసరాలలో....ఫలానా చోట....అడవి నడుమనున్న....పెద్ద కొండపైనున్న గుహలో....దొంగ సొమ్ము దాచాము....పోలీసుల బెడద తగ్గాక ఇద్దరమూ అక్కడికి వెళ్ళి దానిని పంచుకోవాలనుకున్నాము...." ఆయాసంతో ఆగి, ఆగి చెప్పాడు కవీటా,

అతను చెప్పింది ఆంగ్లంలోకి తర్జుమా చేయబోయి హఠాత్తుగా ఆగిపోయాడు బరూవా.

అతని బుర్రలో కలర్ ఫ్లాష్ వెలిగింది.

అతగాడు చెబుతున్నది—దొంగసొమ్మును దాచిన చోటు!

దొంగసొమ్మంటే—లక్ష, రెండు లక్షలూ కాదు!

కోటి రూపాయలు!!

హఠాత్తుగా దురాశ దూరింది బరూవాలో.

స్వతహాగా మంచివాడే అయినా, డబ్బు — అందునా అంత పెద్దమొత్తం—అనేసరికి ఎక్కడలేని పేరాశా పుట్టింది అతనిలో.

పోలీసులకు నిజం చెప్పేస్తే—ఆ సొమ్ము ప్రభుత్వం పరమయిపోతుంది.

అందుకే —

పోలీసులకు కవీటా చెప్పింది చెప్పలేదు.

ఇలా మార్చి చెప్పాడు— "ఆ సొమ్ము అప్పుడే అస్సాంలోని వుగ్రవాద దళానికి వెళ్ళిపోయిందట. సైకియా ద్వారా అది అందజేయబడిందట."

దానిని ఎంతవరకు నమ్మాలో తెలీలేదు పోలీసులకు. అయితే, తాను వుపయోగించిన ఇంటరాగేషన్ మెథడ్స్ తరువాత ఎవరయినా అబద్ధం చెప్పడం అసంభవం!

ఎన్ని విధాలుగా క్రాస్ చేసినా, అదే కథనాన్ని చెప్పాడు బరూవా.

గాంగ్‌టాక్ పరిసరాలలోని కొండగుహలో వున్న కోటి రూపాయలమీదే వున్నది అతని మనసంతా. ఆ సొమ్ము కోసం నమ్మకద్రోహానికి వెనుకాడలేదు అతను.

3

ఏదో చెట్టుకొమ్మ గ్రుద్దుకుని క్రింద పడిపోయాడు బరూవా.

జ్ఞాపకాలు చెదిరిపోయాయి.

మూతి, ముక్కూ పగిలి రక్తం కారింది.

పిస్టల్ ఎగిరి ఎక్కడో పడిపోయింది.

టార్చ్‌లైట్ మాత్రం చేతిలోనే వుంది.

ఒక క్షణం గుండె గతుక్కుమంది. అంతలోనే తమాయించుకుని నెమ్మదిగా లేచి నిలుచున్నాడు.

చేతిలో టార్చ్ వున్నంతవరకు భయంలేదనిపించింది. ఎందుకైనా మంచిదని దానిని మరింత గట్టిగా పట్టుకున్నాడు.

టార్చ్ సహాయంతో వెదికాడు. దూరంగా ముళ్ళ పొదలలో పడిపోయిన పిస్టల్ కనిపించింది.

ఆ పొదలలో ఏ విషపు పురుగైనా వుంటుందేమోనని భయపడుతూనే వొంగి, గ్లవ్స్ తొడుక్కున్న చేతిని ఆ పొదలోకి జొప్పించాడు. పిస్టల్ని అందుకుని జాగ్రత్తగా బయటకు తీశాడు. కాళ్ళకు వున్న గమ్ బూట్సు, చేతులకు వున్న గ్లవ్సు చాలవరకు రక్షణనిస్తున్నాయి.

ఒంటికి గాయాలయినా, శరీరమంతా చీరుకుపోతున్నా, 'కోటి రూపాయలు' కళ్ళముందు మెదులుతూ అతన్ని ముందుకు నడిపిస్తున్నాయి.

దారి దుర్గమంగా వున్నా మార్గం సరిగా తెలియక పోయినా మొండి ధైర్యంతో ముందుకు సాగిపోతున్నాడు.

కొంత దూరం వెళ్ళేసరికి దగ్గరలో ఏదో చప్పుడు వినిపించింది అతనికి.

అటువైపు టార్చ్ ఫోకస్ చేశాడు.

మరుక్షణంలో భయంతో వెన్ను ఝల్లుమంది.

భయంకరమైన పెద్ద కొండ చిలువ ఒకటి చేరువలో నున్న ఓ వృక్షం నుంచి వ్రేలాడుతోంది. నాల్కలు చాపుకుంటూ, నోరు తెరుచుకుని అతని వైపే వస్తోంది అది.

అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసిన బరూవా చటుక్కున నేలమీద చతికిలపడిపోయాడు.

తరువాత టార్చిని కొండచిలువ వైపు ఫోకస్‌చేసి పిస్టల్‌తో షూట్ చేశాడు.

మొదటి బులెట్ గురి తప్పినా, రెండవ షాట్‌కి దాని తల ఛిన్నాభిన్న మయింది. దాని దేహం నిర్జీవంగా నేలకు జారిపోయింది.

'ఎంతలో ఎంత ప్రమాదం తప్పిపోయింది!' అను

కున్నాడు బరూవా గుండె పట్టుకుని.

మృత్యుభీతితో అతని శరీరం ఇంకా కంపిస్తూనే వుంది.

గబగబా అక్కడినుంచి ముందుకు కదిలాడు.

దారి పొడవునా ఏవేవో పురుగులు కుట్టడంతో ముఖమంతా దద్దుర్లు వచ్చి బాధపెడుతోంది. ముఖం ఉబ్బింది కూడాను. అయినా కోటి రూపాయల తలంపులో అటువంటి చిన్నచిన్న కష్టాలను పట్టించుకోవటం లేదతను.

అలా అష్టకష్టాలకూ వోర్చి, ఆరు గంటలసేపు ఆ అడవిలో అతి ప్రయాసతో ప్రయాణించిన పిదప, ఎలాగైతేనేమి అడవి మధ్యనున్న పెద్ద కొండకు చేరుకోగలిగాడు బరూవా.

అప్పటికే అతని దుస్తులు చిరిగి, పేలికలయి, ఒళ్ళంతా గాయాలతో రక్తం కారుతూ వున్నా, దప్పికతో నాలుక పిడచగడుతున్నా, అలసిపోయిన శరీరం తూలుతూవున్నా- కొండను చేరుకోవడంతో అంతవరకూ పడిన శ్రమా, బాధ అంతా మరిచిపోయాడు అతను.

కొండంతా గాలించి కవీటా చెప్పిన గుహను కనిపెట్టగలిగాడు.

ఆ గుహను చూడటంతో అతని ఆనందానికి మేరలేకపోయింది.

ఏదో వెర్రి ఆనందం కలిగింది.

అందుబాటులో కోటి రూపాయలు!!

సునాయాసంగా తనవి కాబోతున్నాయవి.

ఆ గుహముందు పట్టరాని సంతోషంతో డాన్సు చేయాలనిపించింది.

వెంటనే తోచిన నృత్యమేదో చేసాడు.

ఆ రహస్యం తనకు తప్ప ఎవరికీ తెలీదు:

పోలీసులకు నిజం తెలిసే పునే ఆ సొమ్ముతో ఏ విదేశాలకో పారిపోయి హాయిగా జీవించాలి అనుకున్నాడు.

గుహలో గాఢాంధకారంగా వుంది.

టార్చ్‌ని ఫోకస్ చేసినా ఏమీ సరిగా కనిపించడం లేదు.

మెల్లగా గుహలో అడుగుపెట్టాడు.

అడవి మార్గంలో ప్రయాణించడం ఒక ఎత్తు—ఆ గుహలో అడుగు తీసి అడుగు వేయడం మరో ఎత్తులా అనిపించింది.

అయినా జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు నడిచాడు—కోటి రూపాయలున్న సూట్ కేస్(ల) కోసం వేయికళ్ళతో వెదుకుతూ.

లోపల ఏముందో ...అ గుహ పొడవెంతో....మార్గం ఎలా వున్నదో తెలియడంలేదు.

అంతా అగమ్యగోచరంగా వుంది. అంతుపట్టకుండా వుంది.

టార్చ్ ఫోకస్ సరిపోవడంలేదు.

దానికితోడు గబ్బిలాల దాడి ఒకటి. ఎడా పెడా తన్నేస్తున్నాయి అతన్ని. ముఖమంతా చీరేస్తున్నాయి.

గుహలోంచి వస్తూన్న దుర్గంధం భరింప శక్యం కాకుండా వున్నది.

అధైర్యం చెందలేదు బహూవా.

ఏదో తెగింపు, అసాధారణ సాహసం ముందుకు

చొచ్చుకుపోయేలా చేస్తున్నాయి.

అంతకంటె 'కోటిరూపాయలు' అతన్ని నడిపిస్తున్నా యంటే బావుంటుందేమో!

కొన్ని అడుగులు వెళ్ళేసరికి – కోరస్‌గా వినిపించిన బుసలు విని హఠాత్తుగా నిలుచున్నచోటనే ఆగిపోయాడు. అడుగు ముందుకు పడలేదు.

ఆ శబ్దం వస్తూన్నవైపుకు జాగ్రత్తగా టార్చ్‌ని ఫోకస్ చేసాడు.

కట్టెదుటి దృశ్యాన్ని చూసేసరికి ప్రక్కలో బాంబు ప్రేలినట్లు అదిరిపడ్డాడు.

కట్టెదుట—

గుట్టలకొలదీ పాములు....

పెద్దా, చిన్నా....రక రకాల....రంగు రంగుల....విష సర్పాలు.

అవన్నీ విషపుజాతి భయంకర సర్పాలే.

అప్రయత్నంగా అతని చేతిలోని పిస్టల్ ప్రేలింది.... అందులో గుళ్ళన్నీ అయిపోయేసరకు పిచ్చిగా ప్రేలు తూనే వున్నదది.

పరిస్థితిని ఆకళింపు చేసుకునే సరికే ఆలస్యమయి పోయింది.

పిస్టల్ శబ్దాలకు పాములు ప్రేరేగిపోయాయి.

ఆ భయంకర విషసర్పాలన్నీ బిరూవాను ఆక్రమించు కున్నాయి. అతని వొళ్ళంతా ప్రాకుతూ కాటు వేసాయి.

శరీరమంతా విషపు కోరలతో తూట్లు పొడిచాయి.

క్రమంగా అతని చేతిలోని టార్చ్‌లైటు....పిస్టలూ.... నేలకు జారిపోయాయి. □

రాత్రి పదికావస్తూంది.

మెల్లిగా కదుల్తున్న వ్యాన్ రోడ్డు వారగా ఆగింది.

స్టీరింగ్ వెనకనుంచీ జానీ ఒక్క ఉరుకులో కిందికి దిగాడు. అతని ఎడమచెయ్యి నిర్లక్ష్యంగా, విసురుగా డోర్ని తోసింది. పెద్ద చప్పుడుతో డోర్ మూసుకుంది. వ్యాన్ ముందునుంచీ నడుస్తూ అతను పేవ్‌మెంట్ మీదికి ఎక్కాడు.

కిందికి దిగి, రెండో డోర్ని మూసిన మోతీ నవ్వుతూ

తన మిత్రుణ్ణి చూశాడు.

"నీ విసురుకి పనయ్యేదాకా వ్యాన్ కీళ్ళు భద్రంగా వుంటాయన్న నమ్మకం లేదు నాకు!"

జానీ మాట్లాడకుండా పాంటు జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు. పెదాలమధ్య సిగరెట్‌ని దూర్చాడు.

జానీ పళ్ళమధ్య సిగరెట్ ఎర్రగా వెలిగింది. కళ్ళల్లో ఆ మంట ఎర్రగా ప్రతిఫలించింది.

"కమాన్! ముసలి పీనుగ కొట్టుకట్టేసేలా వున్నాడు!" అంటూ జానీ కదిలాడు. పొడుగాటి అతని ఆకారాన్ని మోతీ వెంబడించాడు.

తలుపుల్ని మూయబోతున్న 'హెవెన్‌కాఫిన్ ఎంటర్ ప్రైజ్' సోల్ ప్రొప్రయిటర్ అబ్రహాం ఆగి, వాళ్ళవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"పనిమీద వచ్చారా?" ఆశగా ప్రశ్నించాడతను బ్లాక్ సూట్‌లో వున్న అతన్ని జానీ ఎర్రటి కళ్ళతో చూశాడు.

"స్మశానానికీ, నీ షాపుకీ మనుషులు ఊరికేరారు, బాబాయ్!" జానీ నవ్వుతూ అన్నాడు. మోతీ గొల్లున నవ్వాడు ఇంకా రాలిపోకుండావున్న నాలుగు పళ్ళని చూపిస్తూ అబ్రహాం నవ్వాడు.

"కమిన్ సన్!" అంటూ లోపలికి జరిగి తలుపుల్ని బార్లా తెరిచాడు అబ్రహాం.

జానీ, మోతీ షాపులోకి జొరబడ్డారు. చేతిలోని తాళాన్ని కౌంటర్‌మీద పెట్టి, అబ్రహాం వాళ్ళవైపు తిరిగాడు.

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ సన్?"

జానీ అతనివైపు తిరగలేదు. అరంగుళం పెరిగిన

గెడ్డాన్ని వేళ్ళతో సంతృప్తికరంగా తడువుకుంటూ రెండు వేపులా గోడలకి ఆన్చి పేర్చబడిన శవపేటికల్ని పరిశీలిస్తున్నాడు. పళ్ళమధ్యనుంచీ సిగరెట్‌ని ఇవతలికి లాగి, ఎడం వైపున్న కాఫిన్ల దగ్గరగా కదిలాడు.

"ఏ రేంజిలో ఎన్ని కావాలి?" అబ్రహాం ఆదరా బాదరా అతని దగ్గరగా జరిగాడు.

ఒక కాఫిన్‌మీద ఆర్టిస్టిగ్గా డిజైన్ చేయబడిన సిలువని వేళ్ళతో తడువుతూ జానీ అబ్రహాంవైపు తిరిగాడు.

"ఇవన్నీ డీల్‌వుడ్ బాక్సుల్లా వున్నాయ్, బాబాయ్!" జానీ కంఠంలో ఎగతాళి ధ్వనించింది.

అబ్రహాం దెబ్బతిన్నట్టు చూశాడు "బెస్ట్ క్వాలిటీ ఉడ్....బహుశా కొయ్యరకాలతో నీకు పరిచయం వుండి వుండదు!"

"మనుషుల్నీ, మానునీ అంచనా వేయడానికి అంత పరిచయం అక్కర్లేదు బాబాయ్! డ్రెస్సుతో, మేకప్‌తో మనుషులు తమ అసలు జాతుల్నీ వ్యక్తిత్వాల్నీ కప్పెట్టేసు కున్నట్టే. నువ్వు రకరకాల పాలిష్‌లతో నీ కాఫిన్ల జాతుల్నీ; క్వాలిటీని కప్పెట్టేశావ్!" జానీ నవ్వుతూ అన్నాడు.

అబ్రహాం గుటకలు మింగుతూ చూశాడు. "ఇంతకీ మీ రేంజి...."

"చూస్తూంటే ఈ షాపులో మా రేంజి కాఫిన్ వున్నట్టు లేదు!" జానీ అద్దొస్తూ అన్నాడు. "హైక్లాస్ బాక్స్ కావాలి మాకు. ఇంక రేటుకి హద్దు ఆకాశమే!"

అబ్రహాం ఉక్కిరి బిక్కిరవుతూ చూశాడు. "ఆల్ రైట్! లోపలికి రా. రెండే రెండు రోజ్‌ఉడ్ కాఫిన్సు న్నాయి. దాదాపు ఒక్కొక్కటి పదివే లవుతుంది!"

అన్నాడు సవాలు విసురుతున్నట్టు.

"అలాంటి సరుకు చూపించు, బాబాయ్‌! లెట్స్‌గో!" జానీ నవ్వుతూ సిగరెట్‌ని పళ్ళమధ్య ఇరికించాడు.

అబ్రహాం ఉత్సాహంగా కదిలాడు. కాస్సేపట్లో సన్నటి నడవలో రెండు కాఫిన్‌వరసల మధ్య ఇద్దరూ నడవ సాగేరు. నడవ కొంచెం దూరంసాగి, చిన్న గదిగా ఎదిగింది. గదిలో వున్న నాలుగు శవపేటికల ముందు ఆగి, అబ్రహాం సగర్వంగా జానీవైపు చూశాడు.

కిందికి వొంగి కాఫిన్ లిడ్‌మీద చేత్తో తట్టాడు. అర్థమైందా అన్నట్టు జానీవైపు చూశాడు.

"నువ్వు తట్టితే శవపేటిక ప్రాణంవచ్చి, 'రోజ్‌ఉడ్' 'రోజ్‌ఉడ్' అని అరుస్తూంది బాబాయ్‌!" జానీ నవ్వుతూ అన్నాడు. "మూత తెరచి చూద్దాం!"

అబ్రహాం మూత తెరిచాడు సిగరెట్‌ని ఇవతలకి లాగి జానీ వొంగి కాఫిన్ని పరీక్షిస్తూ వుండిపోయాడు. "ఫరవా లేదు....ఎంత?"

"చెప్పానుగా? పదివేలు...." అబ్రహాం అతని మొహంలోకి చూస్తూ ఆశగా అన్నాడు.

"కమాన్ బాబాయ్, గుర్రం దిగు!" జానీ నవ్వుతూ అన్నాడు.

"ప్యూర్ రోజు ఉడ్! మరో పాతికేళ్ళ తరవాత ఈ కాఫిన్స్‌ని గవర్నమెంటువారు కొనేసి, ప్రాచీన కళాఖండాల కింద, మ్యూజియంలో పెట్టేస్తారు! వీటి విలువ ఈ కాలంవాళ్ళకి తెలీదు!" అబ్రహాం సగర్వంగా అన్నాడు.

"మ్యూజియంలో పెట్టే ముందు, ఒకదాంట్లో నిన్ను పడుకోబెట్టి తీసుకెళతారు!" జానీ ఎగతాళిగా నవ్వాడు.

"వెళ్ళాలి, రేటు తేల్చెయ్!"

"తొమ్మిదిన్నరకి తగ్గదు."

జానీ చెయ్యి తటాలున కదిలింది. పెద్ద చప్పుడుతో కాఫిన్ మూత పడింది. అబ్రహాం ఉలిక్కిపడి కంగారుగా కాఫిన్ని చూశాడు కొంచెం కోపం, విసుగూ కలిసిన చూపుల్ని జానీవైపు తిప్పాడు. జానీ నిర్లక్ష్యంగా నవ్వాడు.

"శవపేటిక ఎంత స్ట్రాంగ్‌గా వుందో పరీక్షించాను. ఓకే. అయామ్ శాటిస్‌ఫైడ్; అయితే ధర విషయంలో కాదు!"

అబ్రహాం మొహంలో ప్రత్యక్షమైన చిరునవ్వు ఇందాకటి కోపాన్ని వూడ్చేసింది.

"చిట్టచివరి, కట్టకడపటి రేటు....తొమ్మిది వేలు!" అన్నాడతను.

*　　　　*　　　　*

చప్పుడు విని షాపు ముందుభాగంలో గోళ్ళు కొరుక్కుంటూ నించున్న మోతీ ఉలిక్కిపడి తెల్పారిల్లాడు. చెప్పినట్లే జానీ సిగ్నల్ ఇచ్చాడు.

మోతీ మెరుపులా కౌంటర్ని సమీపించాడు. కుడి చేత్తో తాళంలోకి దూర్చబడిన తాళంచెవిని లాగాడు. నాలుగు తాళంచెవులున్న గుత్తి అతని వేళ్ళలో ఇరుక్కుంది. ఎడం చేతితో జేబులోంచి బార్ సోపు తీశాడతను. చకచకా ఒక తాళంచెవిని సోపు మీద బలంగా నొక్కాడు. తరవాత రెండో తాళంచెవినీ అలాగే నొక్కాడు. మూడు నాలుగు....సోపు మీద స్పష్టంగా ముద్రించబడిన తాళం చెవుల ఇంప్రెషన్స్‌ని తృప్తికరంగా చూసి బార్‌ని వెనక్కి తిప్పాడు.

అతను కంగారు పడటంలేదు. షాపు లోపలివైపుకి చూడ్డం లేదు అక్కడ జానీ వున్నంతసేపూ, ఇక్కడ తను కంగారు పడాల్సిన అవసరం లేదు। జాగ్రత్తగా, వేగంగా రెండోవైపునా నాలుగు తాళాల ముద్రలూ తీసుకుని మోతీ బార్‌సోపుని పాంటు జేబులోకి జాగ్రత్తగా వదిలాడు. నాలుగుతాళం చెవుల్నీ చొక్కాతో చకచకా తుడిచాడు. సోపు వాసన రాకూడదు.

యథాప్రకారం తాళం చిల్లులోకి తాళంచెవిని దోపేసి, సిగరెట్ ముట్టించి, ఏమీ ఎరగని వాడిలా గోడవారగా వున్న ఒక శవపేటిక మీద కూచున్నాడు మోతీ....

* * *

"ఓకే బాబాయ్, తొమ్మిది వేలు....అయితే ఈ కాఫిన్ని కొంచెం రీ మోడల్ చేయాలి...." జానీ మెల్లిగా అన్నాడు.

అబ్రహాం మొహం చాటపై జుకి సాగింది. "సన్, అతను....నీ ఫ్రెండ్ చూడక్కర్లేదా?"

"ఎవరు? ఓహ్....అలెగ్జాండరా? వాడికి శవాలన్నా, శవపేటికలన్నా చచ్చేంత భయం! ఈ నెపోలియన్ ఉన్నంత కాలం వాడికీ కంటికీ. వొంటికీ పని చెప్పదు. లేజీబాస్టర్డ్!" సిగరెట్‌తో తనని గర్వంగా చూపించుకుంటూ అన్నాడు జానీ.

అబ్రహాం బట్టతల రుబ్బురోలులా ఆవేశంగా ఊగింది. "ఏమిటో రీమోడలింగన్నావు...."

"ఈ కాఫిన్ ఎయిర్‌టైట్, వాటర్‌టైట్ అవ్వాలి బాబాయ్. గాలి దూరడానికి ఏర్పాటు చేసిన చిల్లుల్ని పర్ఫెక్టుగా మూసేయాలి. లిడ్ చుట్టూ రబ్బర్ లైనింగు ఏర్పాటు చేయాలి...." జానీ ఆగి, మరో సిగరెట్ వెలి

గించాడు.

అబ్రహాం పిచ్చివాడిని చూస్తున్నట్టు జానీని చూశాడు. "కాఫిన్లు ఇలాగే వుండాలి.... నువ్వడిగేవి...."

"నేనడిగేవి ఏర్పాటు చేయకపోతే నీ కాఫిన్ ఇక్కడే తప్పుపట్టిపోతుంది బాబాయ్"

"బట్.... కాఫిన్ని వాటర్ప్రూఫ్ చేయటం దేనికి? గాలి...."

"బాబాయ్, మా బాస్కి అలాగే కావాలి.... అన్నట్టు నువ్వు 'హోలీకింగ్ షిప్పింగ్ కార్పొరేషన్' అధినేత మిష్టర్ డేవిడ్ జన్కిన్సన్ పేరు విన్నావా?"

అబ్రహాం కళ్ళు చిట్లించాడు. ...."లేదు.... అయినా, అంత పెద్ద బిజినెస్ మాగ్నెట్ చచ్చిపోతే పేపర్లో రావాలిగా!"

జానీ పక పక నవ్వాడు. "ఎందుకు రాదు? వస్తుంది. హెడ్లైన్స్లో. అయితే ఆయనింకా చనిపోలేదు."

అబ్రహాం కళ్ళు గోలీల్లా పైకి ఉబికాయి. "అయితే అయితే.... ఆయనకి కాఫిన్ దేనికి? ఓహ్... అయామ్ సారీ.... మరెవరేనా...."

"నో, బాబాయ్. ఇంకా బతికే వున్న డేవిడ్ జన్కిన్సన్ గారికే కాఫిన్ కావాలి! ఆయనకి పర్సనల్గా కావాలి కాబట్టే వాటర్ప్రూఫ్, ఎయిర్టైట్ ఏర్పాట్లు అవసరం" జానీ చిన్నగా నవ్వాడు.

అబ్రహాం అయోమయంగా చూశాడు. "సన్, బతికే వున్న వ్యక్తికి...."

జానీ విసుగ్గా చూశాడు. మెల్లిగా విసుగుని కంట్రోల్ చేసుకుని చిరునవ్వు నవ్వాడు. "బాబాయ్, 'అక్బర్ ది గ్రేట్' నీకు తెలుసా? మొగల్ చక్రవర్తి...."

అబ్రహాం బుర్ర ఆడించి, ప్రశ్నార్థకంగా చూశాడు.

"అక్బర్ బతికున్నప్పుడే, స్వయంగా తన సమాధిని డిజైన్ చేసి కట్టించుకున్నాడు. సికింద్రా అనే ఊళ్ళో అది ఇంకా వుంది. లక్షలాదిమంది దాన్ని దర్శిస్తూనే వున్నారు. ఆయనలాగే మా బాస్ కూడా బతికుండగానే తన కోసం శవపేటికను కొని రెడీగా వుంచుకోవాలనుకుంటున్నారు. ఓడలో ప్రయాణం చేస్తూ వాళ్ళమ్మ ఆయన్ని కంది. అంటే సముద్రం మీద ఆయన జన్మించారు.

చనిపోయాక సముద్రంలోనే కలిసిపోవాలనుకున్నారు. తనకి 'సీబరియల్ జలసమాధి జరగాలని ఆయన కోరుకుంటున్నారు. అయితే తన బాడీ వుంచబడిన కాఫిన్‌లోకి నీళ్ళు ప్రవేశించకూడదన్నారాయన. ఈ మధ్య సెయింట్ పాల్ ఆయనకి డ్రీమ్‌లో కనిపించి, అర్నెల్లలోగా హెవెన్‌కి వెళ్ళిపోతారని చెప్పాడుట. అంచేత ఎల్లుండి నుంచీ ఆయన స్టీమర్లో జీవితాన్ని గడుపుతాడు. వాటర్ ప్రూఫ్ కాఫిన్ ఆయనతోబాటు రెడీగా వుండాలి! అర్థమైందా?" జానీ వోపిగ్గా వివరించి నవ్వాడు.

అబ్రహాం నివ్వెరపోతూ విని, భయభక్తులతో బట్టతలని ఆడించాడు

"రిమార్కబుల్! ఇన్‌క్రెడిబుల్! ఎంతైనా గొప్పవాళ్ళు గొప్పవాళ్ళే! మిస్టర్ డేవిడ్ జన్‌కిన్‌సిన్‌గారికి కాఫిన్ ఏర్పాటు చేస్తున్నందుకు హెవెన్ కాఫిన్ ఎంటర్‌ప్రైజ్ తరఫున గర్విస్తున్నా?" ఉద్రేకంతో అని అబ్రహాం నిదానించి జానీని చూశాడు.

"సన్, నెపోలియన్ ....అయితే ...రబ్బర్ లైనింగు వగయిరా ఏర్పాటు చేయడానికి వెయ్యికి పయిగా అవుతుంది. కనీసం నాలుగు రోజులు...."

"లాభం లేదు బాబాయ్! ఎల్లుండి రాత్రి పదకొండింటికి మా బాస్ షిప్ ప్రవేశం చేస్తారు. అంటే ఎల్లుండి సాయంత్రానికల్లా నువ్వు కాఫిన్ని డెలివరీ ఇవ్వాలి! అయిదువందలు ఎక్స్ట్రా ఇస్తాం. ఓకే?" జానీ గబగబా అడిగాడు.

అబ్రహాం తటపటాయించాడు. జానీ పాంటు జేబులోంచి వంద రూపాయల కట్ట తీశాడు. బిస్కెట్ని చూస్తున్న అల్సేషియన్లా అబ్రహాం నోట్లకట్టని ఆశగా చూశాడు. జానీ అయిదు నోట్లు లాగి కాఫిన్ మీద పడేశాడు. తతిమ్మా నోట్లని నిర్లక్ష్యంగా బాక్ పాకెట్లోకి తోశాడు.

కోడిపిల్లని తన్నుకునే గద్దలా అబ్రహాం నోట్లని అందుకుని కోటు జేబులో దోపుకున్నాడు. ధారాళంగా నవ్వుతూ జానీని చూశాడు.

"ఓకే సన్! ఎందుకేనా మంచిది రేపు సాయంత్రానికే కాఫిన్ని రెడీగా వుంచుతాను. రేపు రాత్రికే తీసుకెళ్ళొచ్చు!" అన్నాడు హుషారుగా.

"మరీ మంచిది! తతిమ్మా తొమ్మిదివేలూ అప్పుడు పే చేస్తాను. థాంక్యూ బాబాయ్!" అంటూ జానీ కిందికివొంగి సిగరెట్ పీకని కాఫిన్ పక్కన నొక్కి ఆర్పేశాడు. "గుర్తుకి. కాఫిన్ మార్చకుండా వుండేందుకు!"

అబ్రహాం నవ్వాడు. జానీ వెనక్కి తిరిగి షాపు ముందు భాగంలోకి నడిచాడు. అబ్రహాం గెంతులేస్తున్నట్టు నడుస్తూ అతన్ని వెంబడించాడు. ఇద్దర్నీ చూసి, మోతీ కాఫిన్ మీంచి లేచాడు. అనుమానంగా కుడిచెంపకి క్రాస్ ఆకారంతో వున్న ప్లాస్టర్ని తడువుకున్నాడు.

"బాబాయ్...." జానీ మెల్లిగా పిల్చాడు. అబ్రహాం

తలెత్తి చూశాడు.

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని కాఫిన్ని వాటర్‌ప్రూఫ్ చెయ్. తరువాత మేం చెక్ చేస్తాం. ఏమాత్రం లోపం వున్నా నేను తిరిగొస్తాను. ఆ కాఫిన్‌లో నిన్ను పడుకోబెడతాను" జానీ నవ్వుతూ అన్నాడు.

అబ్రహాం గుడ్లు మిటకరిస్తూ చూశాడు.

2

సాయంత్రం అయిదు దాటింది.

వనిత ఆదరాబాదరా గ్యారేజివైపు పరుగెత్తింది.

నాలుగున్నరకి నాన్నని పికప్ చేసుకుంటానని చెప్పింది తను. అనుకోకుండా నిద్ర పట్టేసింది. మంచంమీద పడుకుని ఆ నవల చదవకుండా వుండాల్సింది. ఇవాళా రేపూ వచ్చే నవలలు హైక్లాస్ నిద్రమాత్రలుగా పనిచేస్తున్నాయి!

గారేజీ తలుపుల్ని బార్లాతెరిచి, వనిత లోపల దూరింది. కాస్సేపట్లో కార్ని రివర్స్ చేస్తూ, గేటువేపు తిప్పింది.

కిటికీలోంచి తలదూర్చి, బాల్కనీ మీద నుంచున్న తల్లిని నవ్వుతూ చూసింది. చెయ్యి ఊపుతూ అమ్మ ఏమిటో చెప్తోంది. ఇంజన్ చప్పుడులో ఆమె మాటలు వినపడకపోయినా వనిత అలాగే అన్నట్టు తలవూపింది. కారెక్కితే అమ్మ చెప్పేది ఒక్కటే: నెమ్మదిగా, జాగ్రత్తగా వెళ్ళు!

నవ్వుకుంటూ వనిత కార్ని పోనిచ్చింది. రోడ్డెక్కాక అమ్మ చెప్పినట్టు జాగర్తగా అమ్మ చెప్పనట్టు స్పీడుగా డ్రైవ్ చేయసాగింది. నాన్న తనకోసం ఎంత ఆలస్యమైనా వెయిట్ చేస్తూనే వుంటాడు. తను డ్రైవ్ చేస్తూంటే తన పక్కన కూచుని గర్వంగా లోకాన్ని

చూడ్డం ఆయనకి ఇష్టం.

పది నిమిషాల్లో సిటీలిమిట్స్ దాటి మూడు కిలోమీటర్ల దూరంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో వున్న 'వనితా ఇంటర్నేషనల్స్' వైపు వనిత డ్రైవ్ చేస్తున్న కారు దూసుకెళ్ళసాగింది.

చల్లటిగాలి వేగంగా కిటికీలోంచీ దూరుతూ వనిత బాబ్డ్ హెయిర్ తో ఉల్లాసంగా ఆడుకుంటోంది. 'కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిదానా!' పొద్దుట రేడియోలో విన్న పాత సినిమా పాటని అప్రయత్నంగా గొణుక్కుంటూ స్టీరింగ్ ని వేళ్ళతో కంట్రోల్ చేస్తోంది వనిత.

ఉన్నట్టుండి వనిత ఉలిక్కిపడింది. మెడమీద చెవి కింద ఎదో చల్లగా తగిలింది. హఠాత్తుగా కూనిరాగం ఆగి పోయింది.

"బాగా పాడుతున్నావ్! టర్నింగ్ ముందు ఎడంవైపు తిరిగే రోడ్డమ్మట పోనీ!" వెనక సీట్లోంచీ అపరిచితమైన పురుషకంఠం హెచ్చరించింది. వనిత చేతులూ కాళ్ళూ అసంకల్పితంగా కదిలాయి. కారు రోడ్డువారగా ఎడం వైపుకి తిరిగి స్లో అయ్యింది.

"డోంట్ స్టాప్! చెప్పినట్టు చేయకపోతే చెవికింద చర్మాన్ని కత్తి చీలిచేస్తుంది!" వెనకనుంచీ అతను కర్కశంగా అన్నాడు.

తన చెవికింద ఆనిన కత్తి అతని మాటని అండర్ లైన్ చేస్తున్నట్టు కదిలింది. సన్నగా వెచ్చగా కిందికి ఏదో గీతలా సాగింది. రక్తం! అతని మాటల్ని అండర్ లైన్ చేస్తున్న ఎర్రసిరా!

వనిత గుండె దడదడ కొట్టుకుంది. కొద్దిగా వణకడం ప్రారంభించిన చేతులూ, కాళ్ళూ దాదాపు పనిచేయడం

మానేశాయి. అప్రయత్నంగా తన ముందున్న అద్దంలోకి చూసిందామె.

నల్లరంగు ఊలెన్ టోపీ కింద నుంచీ చిన్నచిన్న ఎర్రటి కళ్ళు ఆమెవేపు నవ్వుతున్నాయి. అతని తల కొద్దిగా పక్కకి జరిగింది.

"తరవాత ఎలాగా నన్ను పూర్తిగా చూస్తావ్! కమాన్, కార్ని పోనీ!" చిన్నగా నవ్వుతూ హెచ్చరించా డతను.

దడదడమంటున్న గుండెని కంట్రోల్ చేసుకుంటూ వనిత అద్దంలోకి కోపంగా చూసింది.

"ఎవర్నువ్వు? కార్లోకి ఎలా వచ్చావ్?"

"నోరు మూసుకుని కార్ని పోనీ!" అతని కంఠం హుంకరించింది. మెల్లిగా అతని చెయ్యి ఆమె మెడమీద వాలింది. అతని వేళ్ళు మెడమీద పాకుతున్నట్టు వనిత గుర్తించింది. క్షణంలో అతని చెయ్యి ఆమె ముందుకి జరిగింది. రక్తంతో ఎరుపెక్కిన అతని వేళ్ళని వనిత కంగారుగా చూసింది.

"చిన్న గాయం. రక్తం కొద్దిగానే వచ్చింది! నీ గుడ్డలు పాడవకుండా తుడిచేశాను! తిక్క వేషాలేస్తే చొక్కా నీ రక్తంతో పూర్తిగా తడిసిపోతుంది! కార్ని పోనీ!"

అప్రయత్నంగా కార్ని ముందుకి పోనిచ్చింది వనిత. ఆమెలో భయాందోళనలతో నిండిన ఆలోచనలు సాగుతున్నాయి ఎవరతను? తనని ఏం చేస్తాడు? ఎక్కడికి తీసికెళ్తాడు? తనేం చేయాలి?

"లెఫ్టుకి తిరుగు!" వెనక నుంచీ అతని కంఠం గర్జించింది. మెడమీద తడిగా గీత సాగుతోంది.

వణుకుతున్న వనిత చేతులు స్టీరింగ్‌ని తిప్పాయి. కారు

ఎడంవైపు రోడ్డమ్మట కొంచెం దూరం వెళ్ళింది. రోడ్డు మలుపులు తిరుగుతోంది. సన్నగా ఉన్నరోడ్డు రెండు వైపులా చెట్లూ, పొదలూ వున్నాయి.

"ఎ....ఎక్కడికి?" వనిత వణికే కంఠంతో ప్రశ్నించింది.

"ఇందాక ఒక ప్రశ్న అడిగావ్. దానికి మాత్రం సమాధానం చెప్తాను. కారు గారేజీ తాళం వేయకుండా వెళ్ళావు నువ్వు—వేసివున్నా తీసేవాణ్ననుకో—గారేజీలో కెళ్ళి వెనక సీటుకింద ఇరుక్కున్నాను. నేను అనుకున్నట్టే నువ్వు మామూలుగా కార్ని తోలుకు వచ్చేశావ్;" అతని నవ్వులో గర్వం ధ్వనించింది.

"చూడు మిస్టర్....నేనెవరో నీకు తెలిసినట్టు లేదు. డబ్బుకోసం ఈ దుర్మార్గం చేస్తున్నావనుకుంటాను. నా నగలు పాతికవేలు చేస్తాయ్. ఇచ్చేస్తాను. కారు దిగి నీ దారిన పో...." సహజమైన తన ధైర్యాన్ని తిరిగి తెచ్చుకున్న వనిత అంది.

అతను వెటకారంగా నవ్వాడు. "కార్ని పోనీ;"

"మిస్టర్ ....నీకేం కావాలి?"

"త్వరలో తెలుస్తుంది."

"ఇలా ఎక్కడికి?"

"అదికూడా తెలుస్తుంది."

"నువ్వు పెద్ద పొరపాటు ....నేరం ...."

తటాలున వనిత ఎడమ చెంప పగిలినట్టనిపించింది, కారు పక్కకి జరిగి మళ్ళీ రోడ్డుమీదికి సర్దుకుంది. చెంప మండుతోంది. ఎడమ కంటిలోంచి నీళ్ళు జారాయి.

"నోరు తెరిస్తే చర్మం వొలిచేస్తాను! స్పీడు ఎక్కించు!" కర్కశంగా వినిపించింది అతని కంఠం....

వణుకుతున్న చేతుల్తో అతి కష్టం మీద స్టీరింగ్‌ని కంట్రోల్ చేస్తూ వనిత మరో పది నిమిషాలు కార్ని పోనిచ్చింది. అంతసేపూ కత్తి ఆమె మెడమీద తగిలీ తగలకుండా నాట్యం చేస్తోంది.

"కుడివయిపు తిరుగు!"

అతని కంఠం ఆమెలో సాగుతున్న ఆలోచనల యుద్ధాన్ని తటాలున ఆపింది. సన్నటి తారురోడ్డుమీంచి కారు కంకర రోడ్డు మీదికి తిరిగింది. వనిత స్పీడు తగ్గించింది.

"స్పీడప్!" అరిచాడతను.

"గతుకులు. నీ కత్తి గుచ్చుకుంటుంది...." వనిత ధైర్యంగా అంది.

అతను చిన్నగా నవ్వాడు. ఆమె మెడమీంచి కత్తి దూరంగా జరగలేదు. "లైట్లు వేయొద్దు. ఇదే స్పీడుతో పోనీ!"

చుట్టూ ముసురుకుంటున్న చీకట్లని వనిత కంగారుగా చూస్తూ కార్ని పోనిచ్చింది. ఏ వాహనమూ తన కారుకి ఎదురుగా రానందుకు ఆమె లోపల్లోపల విచారించింది. హృదయాన్ని కలవరపెడుతూ సాగుతున్న ఆలోచనలకి తనని అప్పజెప్పేసి, యాంత్రికంగా కార్ని పోనివ్వసాగిందామె....

"స్టాప్!" ఉన్నట్టుండి అతను ఉత్తరు విచ్చాడు. ఉలిక్కిపడి వనిత కార్ని ఆపింది. ఇంకా వణుకుతున్న వేళ్ళు స్టీరింగ్‌ని గట్టిగా చుట్టుకున్నాయి.

ఇంతసేపూ మెడమీద చిన్న గాయం. ఒక చెంపదెబ్బ తప్ప తనకి పెద్ద అపాయం ఏమీ జరగలేదు. ఇప్పుడు....ఇప్పుడు ఏం జరుగుతుంది? అతను కారు దిగు

తాడా? ముందుగా అతను డోర్ తెరిచి, కిందికి దిగే ప్రయత్నం చేస్తే చాలు....తను కార్ని పరిగెత్తిస్తుంది. కిందికి పడతాడు స్కౌండ్రల్....

"ఇంజన్ని ఆఫ్ చెయ్!" హెచ్చరించాడతను. వనిత అతని ఆజ్ఞను పాటించింది కత్తి ఆమె మెడమీంచి జరగ లేదు. చుట్టూ చీకటి ముదురుతోంది....

వనిత ఉలిక్కిపడింది. ఆమె వైపున్న తలుపు తటాలున లాగబడింది. వారగా చూచిందామె.

రోడ్డుమీద నీడలా నిలబడ్డ మరో వ్యక్తి నవ్వుతున్నాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది. ఆ రివాల్వర్ తన ఛాతీని చూస్తోంది.

"కిందికి దిగు!" అన్నాడతను ఎడం చేత్తో స్టీరింగ్ మీదున్న వనిత కుడిచేతిని పట్టుకుంటూ.

తన చేతిమీద గొంగళిపురుగు పాకినట్టు అదిరిపడింది వనిత.

"దిగుతాను....చెయ్యి తీసెయ్!" అప్రయత్నంగా అరిచిం దామె.

అతను పక పక నవ్వాడు. వెనుక నుంచీ మరో కంఠం అతనితో శృతి కలిపింది. తన మెడమీంచి కత్తి దూరంగా జరిగినట్టు వనిత గ్రహించింది. మరుక్షణంలో ఆమె బలంగా కిందికి లాగబడింది. విసురుగా కింద పడబోతూ నిలదొక్కుకుని, కాళ్ళని రోడ్డుమీదికి ఆన్చింది వనిత.

వెనక డోర్ మూసి, అతను దిగి తన అనుచరుడి పక్కనే నుంచుని ఆమెని తమాషాగా చూశాడు.

"మీకేం కావాలి? నన్ను....నొదిలేయండి...." వనిత వణుకుతూ అంది. కన్నీళ్ళతో ఎరుపెక్కుతున్న ఆమె

కళ్ళల్లోకి నాలుగు కళ్ళు తృప్తికరంగా చూశాయి.

"తప్పకుండా వదిలేస్తాం: మాకు కావాల్సింది తీసుకుని" చేతిలో వున్న కత్తిని వేళ్ళమధ్య గిర్రున తిప్పుతూ కులాసాగా నవ్వాడు జానీ. పొడుగ్గా, బలంగా స్వెట్టర్లో వున్న అతని ఆకారాన్ని వనిత ఆందోళనతో చూసింది. కొంచెం పొట్టిగా సన్నగా వున్న రెండో వ్యక్తిమీద ఆమె చూపులు ఆగాయి.

కొంచెం చిక్కబడిన చీకట్లో నీడలుగా మారిపోయిన దయ్యాల్లా అవుపిస్తున్నారు వాళ్ళామెకి. పొట్టిగా వున్నతని కళ్ళు ఆమె వయిపు గోలీల్లా చూస్తున్నాయి. వాళ్ళకి కావాల్సిందేమిటో అతని కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది వనితకి. ఆరిపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకుంది.

"ప్లీజ్....అన్యాయం చేయకండి....ఎల్లుండి నాకు.... పెళ్ళి చూపులు...." అప్రయత్నంగా దీనంగా అందామె.

రివాల్వర్ని తన ఛాతీ మీదికే చూపుతున్న రెండో వ్యక్తి, విలాసంగా నవ్వాడు. "పెళ్ళి చూపులు.... ఎల్లుండి. ఇవాళ....శోభనం చూపులు!"

"షటప్!" అంటూ జానీ అతని చేతిలోంచి రివాల్వర్ని అందుకున్నాడు. "మోతీ, కార్ని పొదలచాటులో వదిలేసి, అక్కడికి రా!"

వనిత గుండె డప్పులా మోగటం ప్రారంభించింది. పాము పిల్లల్లా వంకీలు తిరుగుతున్న ఆమె బుష్షర్టుమీది చారల్ని మోతీ ఆత్రంగా చూశాడు. ఇంకా ఆమె చేతిని పట్టుకునే వున్న తన ఎడం చేతిని తీసి మెల్లిగా ఆమె భుజం మీద వేశాడతను. ఆమె గుండ్రటి భుజం చుట్టూ అతని వేళ్ళు బిగుసుకున్నాయి.

"దూరం నుంచీ చూశాను. పిట్ట ఇంత అందంగా

వుంటుందనుకోలేదు!" మోతీ నవ్వుతూ ఆమె దగ్గరగా జరిగాడు.

వనిత చెయ్యి తటాలున కదిలింది. మోతీ చెంప ఫెడేల్ మంది. మోతీ చెయ్యి ఆమె భుజమ్మీంచి అతని చెంపమీద ఆనింది. ఆశ్చర్యంతో, ఆగ్రహంతో వనితని చూశాడతను. వనిత గుండె రేస్‌హార్స్‌లా పరుగెడుతుంది. ఆవేశంతో తను తొందరపడింది.

జానీ నవ్వు ఆమె ఆలోచనల్ని చెల్లాచెదరు చేసింది. నవ్వుతూ అతను మోతీని దూరంగా తోశాడు. "మోతీ! కష్టపడి చెంపదెబ్బ సంపాయించుకున్నావ్, కమాన్! వెళ్ళు. కార్ని దాచేసి రా!"

మోతీ చెంప తడుముకుంటూ తోక ముడుచుకుని కార్లోకి ఎక్కాడు. జానీ నవ్వుతూ వనిత చెయ్యి పట్టుకున్నాడు. "కమాన్!"

"ఎక్కడికి?" వనిత ధైర్యంగా అడిగింది.

"దిగబోతున్నావ్! లోతు అడక్కు!" అంటూ మోతీ కత్తిని మెడమీద ఆన్చి, వెనక్కి జరిగి, ఆమెను తోసుకుంటూ కదిలాడు.

రోడ్డుకు వంద అడుగుల దూరంలో పొదల చాటున ఆగివున్న గ్రీన్ కలర్ వాన్‌ని వనిత ఆశ్చర్యంగా చూసింది. కారు చప్పుడు ఆమెకి వినిపించింది. కాస్సేపటిలో నిశ్శబ్దం. వ్యాన్ వెనక ఆమెని ఆపి జానీ జేబులోంచి తాళంచెవి తీశాడు. తాళంచెవిని ఆమె వయిపు చాచాడు. ఇందాకటి గాయానికి దగ్గరగా కత్తి తన మెడని నొక్కుతోంది. అప్రయత్నంగా వనిత అతనిచ్చిన తాళం చెవిని అందుకుంది.

"తాళం తీసి, డోర్‌ని తెరు!" ఆజ్ఞాపించాడు జానీ.

అతని ఎడమ చేతివేళ్ళు వెనకనుంచీ ఆమె యెడమ భుజాన్ని మెడ దగ్గరగా గట్టిగా నొక్కి పట్టుకున్నాయి. వణుకుతున్న చేత్తో తాళం తెరిచింది వనిత.

అప్పుడే తిరిగొచ్చిన మోతీ డోర్ని తెరిచాడు.

"మోతీ, తాడు తీసుకురా" జానీ ఆజ్ఞాపించాడు. మోతీ వ్యాన్ లోపలికి ఎక్కి నిమిషంలో కిందికి దిగాడు. అతని చేతిలో లీలగా అవుపిస్తున్న ప్లాస్టిక్ తాడుని వనిత కంగారుగా చూసింది.

"ప్లీస్....నన్ను...."తటాలున మోతీ అరచెయ్యి ఆమె నోటిమీద వాలి, బలంగా నొక్కింది. రెండు పెదవుల్నీ ఏదో టేప్ గట్టిగా కప్పేస్తూ అతుక్కుపోయినట్టు వనిత గ్రహించింది చీకటికి ఆమె కన్నీళ్ళు సహాయంచేస్తూ ఆమెకి ఏమీ కనిపించకుండా చేశాయి. వెనక్కి విరిచిన తన చేతుల చుట్టూ సన్నటి పగ్గం కసిగా బిగుసుకుంటు న్నట్టు ఆమె గ్రహించింది.

తన చేతుల్ని వెనక్కి విరిచికట్టి, తనని ఏంచేస్తారు వీళ్ళు?

ఆమె ప్రశ్నకి సమాధానం చెప్తున్నట్టు జానీ ఆమెని రెండు చేతుల్లో బొమ్మని ఎత్తినట్టు పైకెత్తాడు. అసం కల్పితంగా వనిత పెట్టబోయిన కేక ఆమె పెదవుల వెన కనే ఆగిపోయింది. ఏం జరుగుతోందో ఊహించేలోపలే ఆమె వ్యాన్ సీటుమీద మొరటుగా కూచోబెట్టబడింది.

"మోతీ, స్టార్ట్!" జానీ ఆమె పక్కనే కూచుంటూ ఆజ్ఞాపించాడు.

మోతీ క్షణకాలం తటపటాయించి వ్యాన్ డోర్ని దభాలున మూసేశాడు. కాస్సేపటిలో వ్యాన్ స్టార్టయి కది

లింది. బలహీనంగా కళ్ళు మూసుకుని వనిత తలని వెన కున్న బోర్డుకి ఆనించింది. ఆలోచనలు ఆమె మెదడులో సంకుల సమరం చేస్తున్నాయి.

3

గంటపాటు వ్యాన్ గతుకుల రోడ్డమ్మట పడుతూ లేస్తూ ప్రయాణం చేస్తూనే వుంది. అంతసేపూ వనిత చలనం లేని విగ్రహంలా కూచుండిపోయింది. నాలు గయిదుసార్లు తూలి పడబోయిన తన శరీరాన్ని పక్కనే కూచున్న అతని చెయ్యి మొరటుగా ఆపింది. రెండుసార్లు అతని చెయ్యి చన ఛాతీకి అడ్డంగా, ఇనప పైప్‌లా ఆని, బోర్లా పడకుండా ఆపింది.

చీకటి గూడులా వున్న వ్యాన్‌లో వనిత కళ్ళకి ఏమీ కనిపించటం లేదు. అప్పుడప్పుడూ అతను గీసిన అగ్గి పుల్లల కాంతిలో క్షణకాలం అతని మొహాన్ని చూడ గలిగిందామె. తన ఉనికినే గుర్తించనట్టు అతను సిగ రెట్లు కాలుస్తూ కూచున్నాడు.

వ్యాన్‌లో నిండిన పొగ ఊపిరితిత్తుల్లోకి కంపుకొడుతూ జొరబడి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. తన్నుకొస్తున్న దగ్గు ఆమె గొంతుకలో సుళ్ళు తిరుగుతూ అర్థం కాని చప్పుళ్ళు చేసింది. తనకేమీ పట్టనట్టు అతను భంగుతాగే బైరాగిలా సిగరెట్ పీలుస్తూ కూచున్నాడు.

ఉన్నట్టుండి తనకింద తిరుగుతున్న వ్యాన్ చక్రాలు గతుకుల రోడ్డుమీంచి నున్నటి రోడ్డుమీద జారుతున్నట్టు వనిత గ్రహించింది. గంటన్నర నుంచీ సాగుతున్న ఈ ప్రయాణం తనని ఎక్కడికి తీసుకుపోతోంది? లెక్క లేనన్ని మలుపులు తిరిగిన వ్యాన్ ఎటువేపు వెళుతుందో ఆమె వూహించలేకుండా వుంది. వనితకి తల్లీ, తండ్రీ

గుర్తొస్తున్నారు.

నాన్న చివరికి ఇంటికి చేరుకుని ఉంటాడు. తను ఎటు వెళ్ళిందో అర్థంకాక అమ్మా నాన్న ఇద్దరూ కాసేపు విసుక్కుంటారు. ఆ తరువాత తను ఫ్రెండ్స్‌కి ఫోన్ చేస్తారు. ఆ తరవాత....ఆందోళనతో....ఏం చేస్తారు? నాన్న పోలీస్ రిపోర్టు యిస్తారా? మెయిన్‌రోడ్డుకి దూరంగా మరో మట్టి రోడ్డు పక్కన ఎక్కడో పొదల్లో వున్న కార్ని వాళ్ళు ఎలా కనుక్కుంటారు?

మళ్ళీ చాలాసేపట్నుంచీ గతుకుల రోడ్డుమీద ఆగకుండా పరుగెట్టిన వ్యాన్ వున్నట్టుండి ఆగి, వనిత ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టింది.

చటుక్కున వ్యాన్ లోపల లైటు వెలిగింది. వెలుతుర్ని చూడలేక వనిత కళ్ళు మూసేసుకుంది.

ఏదో చెయ్యి ఆమె భుజం మీద బరువుగా పడింది.

"గమ్యస్థానం వచ్చేసింది దిగు!" అన్నా డతను నవ్వుతూ. వనిత కళ్ళు తెరిచింది.

ఎదురుగా, సీటు ముందున్న పొడుగాటి బాక్స్‌ని ఆమె ఆశ్చర్యంతో చూసింది. ప్రశ్నార్థకంగా ఆమె కళ్ళు చిట్లించింది. బాక్స్ మీద బంగారం రంగుతో 'క్రాస్' మెరుస్తోంది. ఆ బాక్స్ ఏమిటో వనితకు తెలుసు. శ....వ పే....టి....క....

వ్యాన్‌లోంచి కిందికి దిగినప్పట్నుంచీ వాళ్ళిద్దరూ ఆమెకి ఇరువయిపులా అంగరక్షకుల్లా నడుస్తున్నారు. రెండు చేతులు రెండువయిపుల్నుంచీ ఆమె రెండుచేతుల్నీ పట్టుకున్నాయి.

మాటలు రాని మరబొమ్మల్లా ఇద్దరూ తనని రాళ్ళ మీద, పొదల మధ్య ఎక్కడికో నడిపిస్తున్నారు. తన

ప్రయాణం ఏదో ఎత్తయిన ప్రదేశానికి సాగుతోందని ఆమెకి తెలుసు. రెండు చేతులు తనని గట్టిగా పట్టుకోక పోయి వుంటే, తను ఆ రాళ్ళ రప్పలమీద దజను సార్లేనా పడుండేదని వనిత అనుకుంది.

కీచురాళ్ళు చీకటికి నేపథ్యసంగీతం సమకూరుస్తున్నాయి. ఉన్నట్టుండి ఏదో కొత్త శబ్దం వనిత చెవుల్ని సోకింది. వనిత చెవులు రిక్కించింది. నీళ్ళు క్రిందికి ప్రవహిస్తున్న చప్పుడు....

"ఓకే. ఇక్కడే?" ఆగుతూ అన్నాడు జానీ. మోతీ నిట్టూర్పు పాము బుసలా వినిపించింది వనితకి. ఆత్రుతగా చుట్టూ పరకాయించి చూసిందామె. ఎదురుగా రెండు పెద్ద రాళ్ళు ఒకదాని కొకటి పైభాగాలు ఆన్చి, చీకట్లో రహస్యాలు చెప్పుకుపోతున్న రెండు భూతాల్లా నిలబడ్డాయి.

"మోతీ, ఆ రాళ్ళమధ్య మన క్యాంపు స్టౌ వెలిగించి టీ తయారుచెయ్. ఈలోగా వనితని సర్దేస్తాను?" జానీ నవ్వుతూ అన్నాడు.

వనిత చీకట్లో అతనివయిపు కంగారుగా చూసింది. 'వనితని సర్దేస్తాను' తనని అతను ఏం చేస్తాడు?

ఆమెకి జవాబు చెప్తున్నట్టు జానీ ఆమెని కొంచెం పక్కకి నడిపించాడు.

"ఆ రాతికి ఆనుకుని కూచో?" అన్నాడతను ఆమె భుజాన్ని కిందికి నొక్కుతూ.

అలిసిపోయిన వనిత అప్రయత్నంగా కూచుంది. మెల్లిగా వెనక్కి వాలింది. కొంచెం దూరంలో కింద కూచున్న మోతీ ఏవో చప్పుళ్ళు చేస్తున్నాడు. అగ్గిపుల్ల వెలుతురు అతని చుట్టూ చీకటిని చెదరగొట్టింది. స్టవ్

వెలిగింది.

జానీ తన ముందు కూచున్నట్టు వనిత గమనించింది. స్టవ్ వెలుతురు అతని ముఖం మీద నీడల్ని నాట్యం చేయిస్తోంది. అతని చెయ్యి మెల్లిగా కదిలి ఆమె మూతి దగ్గరగా ఆగింది. అతని వేళ్ళు సాలీడు కాళ్ళలా ఆమె బుగ్గమీద కదిలాయి. తటాలున ఆమె నోటిని కప్పిన ప్లాస్టర్ని నిర్లక్ష్యంగా లాగేశాడతను. మంట పెడుతున్న పెదాల్ని నాలుకతో తడుపుకుంది వనిత.

జానీ భుజానికి వేళ్ళాడుతున్న సంచీలోంచి మరోటి తీశాడు. స్టవ్ వెదజల్లుతున్న కొద్దిపాటి వెలుతురు, అతని చేతిలో ప్రత్యక్షమైన కత్తిమీద తళుక్కుమంది.

వనిత ఉలిక్కి పడింది....

4

"అయితే అమ్మాయి ఎక్కడికి వెళ్ళింది?" మనోహరరావు విసుగ్గా అడిగాడు.

"వచ్చాక దాన్నే అడగండి. అచ్చోసిన ఆబోతులా వదిలేశారు కూతుర్ని!" అమృతం అప్రయత్నంగా గోడ గడియారాన్ని చూసింది.

"సెకండ్ షో వదిలేసి వుంటారు....ఏ ఫ్రెండుతోనో వెళ్ళిందేమో...." ఆమె చూపుల్ని తన చూపులతో ఫాలో చేసిన మనోహరరావు అన్నాడు.

"అదీ చూద్దాం....మరో పావు గంటలో తేలిపోతుంది గా! ఇంటికి రానియ్యండి చెప్తాను. కంజీవరం పట్టు చీర గోచీపోసి కట్టి, గడప దాటకుండా చేస్తాను!" అమృతం కోపంగా అంది. ఆమె కోపం చాటునుంచీ ఆందోళన తొంగిచూస్తున్నట్టు మనోహరరావుకి తెలుసు.

"నీ కంటికి కనబడేది ఎప్పుడూ అమ్మాయి దుస్తులే!

వనిత వ్యక్తిత్వాన్ని చూడాలి నువ్వు?" అన్నా డతను నవ్వుతూ.

"దుస్తులు మనిషిని తయారు చేస్తాయ్ అన్న ఇంగ్లీషు సామెతని వినే వుంటారు. దాని అర్థం ఇదే!" అమృతం ఉక్రోషంతో అంది.

ఏదో చెప్పబోయి మానేసి మనోహర్రావు పైపు వెలిగించాడు అసహనంగా.

పావు గంట గడిచింది.

పైపుని పళ్ళమధ్య యిరికించి, మనోహర్రావు టెలి ఫోన్ రిసీవర్ని పయికెత్తాడు. సాలోచనగా ఏదో నంబర్ని డయల్ చేయబోతూ ఆగాడు. క్షణకాలం ఆలోచించి రిసీవర్ని పడేసి పైపు పీలుస్తూ పచార్లు ప్రారంభించాడు.

కూతురు వేళకి ఇంటికి చేరుకోనందుకు తనలో ఉద్భవించి కంగారుగా రూపాంతరం చెందుతున్న కోపాన్ని నిగ్రహించుకుంటూ అమృతం మెల్లిగా సోఫా లోంచి లేచి వంటగదివేపు నీరసంగా అడుగు వేసింది.

"ఈ హార్లిక్సైనా తాగండి; పొద్దుటనగా భోంచే శారు...."

భార్య కంఠం విని ఆలోచనల్లోంచి కిందికి దిగివ మనోహర్రావు పచార్లు మానేసి ఆమె వయిపు ప్రశ్నార్థ కంగా చూశాడు. అప్రయత్నంగా హార్లిక్స్ లోటాని అందుకుని టెలిఫోన్ పక్కనే బల్లమీద పెట్టాడు. ఆలో చనలతో గీతలుగా మారిపోయిన నుదుర్ని అలసటగా చేత్తో రుద్దుకుని రిసీవరెత్తి ఒక నంబర్ డయల్ చేశాడు.

"రంగరాజుగారా? మనోహర్రావుని. సారీ ఫర్ ది డిస్టర్బెన్స్, మీ అమ్మాయి రజని యింట్లో వుందా!"

"...................."

"ఐసీ....ఏం లేదు....మా అమ్మాయి అక్కడికి వచ్చిందేమో అని...." మనోహర్రావు మెల్లిగా అన్నాడు.

"........................"

"....ఊరికే....ఫ్రెండుతో కలిసి సినిమాకెళతానంది. ఏ ఫ్రెండని మేం అడగలేదు....అందుకని....ఆల్‌రైట్ మరో స్నేహితురాలింటికి వెళ్ళుంటుందిలెండి....నో నో.... వొద్దు... అమ్మాయిని లేపకండి.... థాంక్స్.... గుడ్ నైట్...." మనోహర్రావు రిసీవర్ని పడేసి, తన మొహం లోకి ఆదుర్దాగా, ఆశగా చూస్తున్న భార్యని అయో మయంగా చూశాడు. మొహాన్ని అలుముతున్న స్వేద బిందువుల్ని అరచేతితో రుద్దుకున్నాడు.

"ఏం చేద్దాం....? ఏదేనా యాక్సిడెంట్...." కన్నీళ్ళ రూపంలో తన రాకని తెలియజేస్తున్న దుఃఖాన్ని దిగ మింగుతూ అంది అమృతం.

మనోహర్రావు నిస్సహాయంగా నిట్టూర్చాడు. "అమృతా! ఇంక నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. ఐ.జి. ఆఫ్ పోలీస్ సలహా అడుగుతాను...." అంటూ అతను టెలిఫోను రిసీవర్ని ఎత్తాడు.

5

ఆందోళనతో మూసుకున్న కళ్ళని వనిత ఉలిక్కిపడి తెరిచింది. ఏదో పాము బుసలా వినిపించింది.

తన ముందు ఎవరో కూచున్నట్టు ఆమె భయంతో గ్రహించింది. చీకటికి అలవాటు పడిన ఆమె కళ్ళకి మోతీ అవుపించాడు. అతని చెయ్యి పాములా ఆమె భుజమ్మీదికి పాకింది.

కెవ్వున అరవబోయిన వనిత బలవంతాన ఆపుకుంది. తనకి దూరంగా, స్టవ్‌కి దగ్గరగా వెల్లకిలా పడుకున్న

మొదటి వ్యక్తి ఆపకుండా పెడుతున్న గుర్రు ఆమెకి బాగా వినిపిస్తోంది. రాగానే తనని కూచోపెట్టి, వెనక్కి విరిచి కట్టిన చేతుల్ని ముందుకి తీసి మళ్ళీ కట్టేశాడతను. చాకుతో తాడుని రెండు ముక్కలు చేసి, ఆ రెండో ముక్కతో తన పాదాల్ని కలిపి కట్టేశాడు.

వనిత ఉలిక్కిపడింది. మోతీ రెండో చెయ్యి ఆమె రెండో భుజమ్మీద పడింది. ఆమె మొహం వయిపు వంగుతున్న అతన్నుంచి విస్కీ వాసన లీలగా వస్తోంది. వనిత బుర్ర శరవేగంతో ఆలోచించసాగింది. తన చేత చెంప దెబ్బ తిన్న వ్యక్తి తన కోసం అవురావురంటున్నాడు. తనని తీసుకు వచ్చిన వ్యక్తికి తన అందంతో పని లేనట్టుంది. అతను ఆదమరచి నిద్రపోతున్నాడు. మోతీ బలహీనతని తను ఉపయోగించుకుంటే? మోతీ బలహీనత తనకి బలంగా మారుతుందా?

మోతీ ఊపిరి ఆమె మొహాన్ని వెచ్చగా తాకింది. డోక్కొచ్చబోయిన వనిత బలవంతాన ఆపుకుంది.

"....అతను....నీ ఫ్రెండు....లేస్తాడు...." అందామె గుసగుసగా.

మోతీ తల తటాలున దూరంగా జరిగింది. ఆశ్చర్యంతో అతను ఊపిర్ని లోపలకి లాగాడు. మెల్లిగా తల తిప్పి గుర్రు పెడుతున్న తన అనుచరుడివయిపు చూశాడు.

"అతనికి మెలకువ రాదు...." అప్రయత్నంగా గొణిగాడతను. అతని చేతులు ఆమె గుండ్రటి భుజాల మీద బిగుసుకున్నాయి.

"ఇక్కడొద్దు.... అతని దగ్గర చాకుంది....నాకు భయం....వ్యాన్‌లోకి వెళ్దాం...." వనిత రహస్యం చెపుతున్నట్టు అంది.

తటాలున అతని రెండు చేతులూ కిందికి జారాయి. కొంచెం దూరం ప్రయాణంచేసి. ఆగి దూరంగా జరిగాయి. ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరవుతూ మోతీ ఆమె మొహంలోకి పరిశీలనగా చూస్తూ వుండిపోయాడు.

"కాళ్ళకి వున్న కట్లు విప్పేసి. నన్ను వ్యాన్‌లోకి తీసుకెళ్ళు...." వనిత కంఠం జీరగా ధ్వనించింది. "ఈ పొదల్లో, రాళ్ళల్లో చీకట్లో నాకు భయంగా వుంది."

వణుకుతున్న వనిత కంఠం అతనిలో అనుమానిస్తూ మొలకెత్తుతున్న సందేహాన్ని అడుక్కి తొక్కేసింది. అతని చేతులు ఆమె పాదాల దగ్గరగా కదిలాయి.

"వ్యాన్‌లో కెళ్ళగానే నా చేతులు విప్పేస్తావా?" మోతీని ఆనుకుని నడుస్తున్న వనిత ఆశగా అడిగింది. తూలి పడబోయిన ఆమెని అతని కుడిచెయ్యి బలంగా ఆపింది.

"విప్పను. తరవాత ....కాళ్ళు మళ్ళీ కట్టివేస్తాను ...." మోతీ కంఠం స్పష్టంగా ధ్వనించింది.

"నన్ను ....నన్నేం చేస్తారు?" గద్గద కంఠంతో అడిగిందామె.

"అదంతా నాకు తెలీదు. తెలిసినా చెప్పను. జానీ చెప్తాడు అవసరమైతే."

వనితలో ఆగ్రహం కట్ట తెంచుకుంది. మోతీ ఆరి తేరినవాడిలా వున్నాడు. వ్యాన్‌దాకా రాననీ, బిగ్గరగా అరిచి అతన్ని పిలుస్తాననీ బెదిరించా లనిపించిందామెకి. ఆవేశాన్ని నిగ్రహించుకుని, తనని చీకటిలో ఎగుడు దిగుడు ప్రదేశంలో నడిపిస్తున్న మోతీ చేతులకి తన శరీరాన్ని వదిలేసి అడుగులేయసాగింది.

కాస్సేపట్లో మోతీ చప్పుడు కాకుండా వాన్‌డోర్ని తెరి

చాడు. లోపలకి ఎక్కమని తగ్గుస్వరంతో వనితను హెచ్చరిస్తూ మెల్లిగా ముందుకి తోశాడు.

వనిత క్షణకాలం తటపటాయించి ధైర్యంగా వ్యాన్ లోపలకి దూరింది. రెండు చేతుల్నీ ఆమె నడుం మీద ఆన్చి పట్టుకున్న మోతీ వ్యాన్ లోకి ఆమె వెనకే ఎక్కాడు చిన్న చప్పుడుతో తలుపు మూసుకుంది.

వనిత ఒళ్ళు ఒక్కసారి జలదరించింది. తను తొందర పడిందా? పొరపాటుగా ఆలోచించి, అతనితో మూసిన గదిలాంటి వ్యాన్ లో ఇరుక్కుందా? మెల్లిగా తన చేతుల్ని బంధించిన తాళ్ళని విప్పేయించుకోవాలి....సమయం చూసి సమయం మించిపోకుండా.

మోతీ శరీరం ఆమె దగ్గరగా జరిగింది. ఆమె నడుం చుట్టూ అతని చేతులు గొలుసుల్లా బిగుసుకున్నాయి. వనిత ఆలోచనలు చెల్లాచెదరయ్యాయి.

చటుక్కున వ్యాన్ లో లైటు వెలిగింది. వనిత ఉలిక్కి పడింది. అదిరిపడిన మోతీ దూరంగా జరిగాడు. కళ్ళు చిట్లించి, వనిత ఆశ్చర్యంగా చూసింది. ఏదో నవ్వు ఆమె దృష్టిని ముందు సీటు వయిపు లాగింది.

స్టీరింగ్ దగ్గరగా, డోర్ కి వీపు ఆనించి, వాలుగా పడుకున్న జానీ పకపక నవ్వుతున్నాడు. అతని చేతి లోని కత్తి తళుక్కుమంటూ అతని గెడ్డాన్ని గోకుతోంది.

వనిత ఆశ్చర్యంతో అతన్నే చూస్తూంది. అతను ఆమెవైపు చూడ్డంలేదు. అతని కళ్ళు ఎర్రగా, ఎగతాళిగా మోతీని చూస్తున్నాయి....

వనిత తన చూపుల్ని మోతీవైపు తిప్పింది. మోతీ మొహం చెమటతో నిగనిగలాడుతోంది. ఎందుకో అతని పెదవులు అదురుతున్నాయి. ఒకసారి అతను గుటకలు

మింగాడు.

జానీ చివరికి నవ్వు ఆపేశాడు. "వొంపులు కంటబడే సరికి నువ్వు వొళ్ళు మరిచిపోతావని నాకు తెలుసు! అందుకే నిద్రనటిస్తూ గురకలుపెడుతూ వుండిపోయాను!"

మోతీ తలదించుకుని, చిన్నగా దగ్గాడు.

"కోటీశ్వరుడి కూతురు తెలివిగా నిన్ను బుట్టలో వేసింది!" జానీ ఎగతాళిగా నవ్వాడు.

"అది.... కాదు...." మోతీ గొణిగాడు.

"ఆల్ రైట్! పనిలేకపోతే, నీకు పనికిమాలిన ఆలోచనలొస్తుంటాయ్ సీటు కిందనుంచీ గునపం, పారా తీసుకో! తెల్లవారేదాకా చేతినిండా పనిస్తాను!" జానీ నవ్వుతూ అన్నాడు.

మోతీ కంగారుగా చూశాడు. "సారీ.... జానీ.... సాయంత్రం మీకోసం వెయిట్ చేస్తూ విస్కీ కొంచెం ఎక్కువగా తీసుకున్నట్టున్నాను.... పొరపాటు...."

"షటప్? మట్టి తవ్వుతూవుంటే మత్తు దిగిపోతుంది!" అంటూ జానీ ఎక్కణ్నుంచో తీసిన బేడీల్ని మోతీవైపు నిర్లక్ష్యంగా విసిరాడు. చప్పుడు చేస్తూ కిందపడిన బేడీల్ని అందుకుని మోతీ ప్రశ్నార్థకంగా చూశాడు.

"సీటుపైనవున్న రాడ్‌కీ, నీ 'ప్రేయసి' చేతులకీ కలిపి బేడీలు తగిలించు!" జానీ ఆజ్ఞాపించాడు.

మోతీ మంత్రముగ్ధుళ్ళా కదిలాడు. వనితని మొరటుగా సీటుమీదికి తోశాడు. కాస్సేపట్లో ఆమె చేతుల్నీ, కమ్మీనీ కలుపుతూ బేడీలు బిగుసుకున్నాయి.

"తాళంచెవి ఇలా తే!" జానీ హెచ్చరించాడు.

మోతీ మౌనంగా తాళంచెవి అందించాడు.

"కమాన్! గునపం, పారా!"

"చీకటి....పొద్దుటే...." మోతీ నసుగుతూ అన్నాడు.

"షటప్! విరహంతో నీకెలాగా నిద్రపట్టదు: దొర్లుతూ అవస్థపడ్డం కన్నా, తవ్వుతూ అవస్థ పడ్డం మంచిది: కమాన్!" అంటూ అతను కిందికి దిగాడు.

మోతీ కిక్కురుమనకుండా కిందికి వొంగి, గునపం, పారా తీసుకుని కిందికిదిగి తలుపు మూశాడు. చటుక్కున వ్యాన్లో లైటు ఆరిపోయింది. ముందువైపు డోర్ చప్పుడు చేస్తూ మూసుకుంది.

గుంటనక్కలాంటి జానీమీద కోపంతో వనిత పళ్ళు కొరుక్కుంది ప్లాన్ చేసి. తను ఓడిపోయింది....

వ్యాన్లో, తనకి ఎదురుగా శవపేటిక వుంది. మోతీ పారా గునపం పట్టుకెళ్ళాడు. ఎందుకో తనకి తెలుసు.... తవ్విన గొయ్యిలో శవపేటికను పెడ్తారు....శవపేటికలో తనను....తన శవాన్ని పెట్టేస్తారా? తనని....తనని.... చంపేస్తారా? ఆందోళనతో ఆమె గుండె దడదడ కొట్టుకుంది.

5

మోగుతున్న టెలిఫోన్ రిసీవర్ని ఆత్రంగా అందుకున్నాడు మనోహర్రావు.

"యస్...."

"మిస్టర్ మనోహర్రావ్, ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ స్పీకింగ్. మీ అమ్మాయి గురించి వాకబు చేయమని రాత్రి ఐ. జీ. గారు ఉత్తరువిచ్చారు. మా పరిధిలో ఎక్కడా ఏ కారూ యాక్సిడెంట్ కి గురికాలేదు. మీ కారు కోసం రాత్రి రెండున్నరనుంచీ వేట్ సాగుతోంది. ఇప్పటిదాకా మీ కారూ అవుపళ్ళేదు...."

"ఇన్స్పెక్టర్...." మనోహర్రావు ఆదుర్దాతో అడ్డు

తగిలాడు.

"యస్?"

"జాగ్రత్తగా వెతికారా?" మనోహర్రావు ఆత్రుతగా అడిగాడు.

"నాచురల్లీ! సిటీ జ్యూరిస్‌డిక్షన్‌లోనే కాకుండా, దగ్గర్లో దూరంలోవున్న అన్ని టౌన్స్‌లోని పోలీసుల్ని అలర్ట్ చేశాం. త్వరలో ఏదో తెలుస్తుంది. కారు మాయం అయిపోదుగా?" ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ ధైర్యం చెప్తున్నట్టు అన్నాడు.

"అఫ్‌కోర్స్....మీరు త్వరగా కనిపెట్టాలి. రేపు.... అమ్మాయికి పెళ్ళిచూపులు...." మనోహర్రావు ఆగాడు.

అటువైపున ఇన్స్‌పెక్టర్ క్షణకాలం మౌనంగా ఉండిపోయాడు.

"రావుగారూ, మీ అమ్మాయికి పెళ్ళిచూపులు ఇష్టమేనా?" ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ సాలోచనగా ప్రశ్నించాడు.

"వనితకి ఇప్పుడప్పుడే పెళ్ళి ఇష్టం లేదనుకోండి.... అయినా...."

"రావుగారూ, మద్రాసు, బెంగుళూరు నగరాల్లో అమ్మాయికి బాగా తెలిసిన వాళ్ళెవరేనా వున్నారా?"

"....ఉన్నారు చాలామంది. ఏం? ఎందుకలా అడుగుతున్నారు?" మనోహర్రావు ప్రశ్నించాడు.

"ఇష్టలేని పెళ్ళిచూపుల్నుంచి తప్పించుకోడానికి అమ్మాయి ఏ బెంగళూరో, మద్రాసో...."

"ఇంపాసిబుల్!" మనోహర్రావు ఉద్రేకంతో అడ్డు తగిలాడు. "దానికి ఇష్టంలేంది పెళ్ళి; పెళ్ళిచూపులు కాదు!"

"పెళ్ళి ఇష్టంలేదంటే పెళ్ళిచూపులూ ఇష్టంలేదనే అర్థం మిస్టర్ మనోహర్రావ్!" పృధ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"ఇన్స్పెక్టర్. వనిత గురించి మీకు తెలీదు. నేను ఏర్పాటుచేసిన పెళ్ళిచూపుల్ని ఎదుర్కొని, సంబంధం తనకి నచ్చలేదని కుండబద్దలుకొట్టి చెప్పగలదు! షిఈజ్ డైనమిక్! దానికేదో ప్రమాదం జరిగిందని నాకు అనుమానంగా వుంది...."

"ఆల్రైట్ ....మా అన్వేషణ సాగిస్తాంలెండి. ఐజీగారు ప్రతిగంటకీ మీకు ఫోన్ చేస్తూ వుండమన్నారు. ఓకే? బై!"

రిసీవర్ని పడేసి, మనోహర్రావు అలసటగా నిట్టూర్చాడు. ఫోనులో కి భర్త చెప్పినదాన్నంతా విన్న అమృతం మెల్లిగా పైకి లేచింది.

"ధర్మన్నని తీసుకుని కార్లో ఒకసారి టూటౌన్ వెళ్ళొస్తాను. ఊర్మిళ దాని స్నేహితురాలు. అక్కడేమన్నా దాక్కుందేమో!" అందామె.

"దాక్కుందా! ఎందుకు?" కళ్ళుచిట్లిస్తూ మనోహర్రావు ప్రశ్నించాడు.

"పెళ్ళిచూపుల్ని తప్పించుకోడానికి!" అంటూ అమృతం జోరుగా హాల్లోంచీ ఇవతలికి నడిచింది.

ఆమెని వారించబోయి. మనోహర్రావు మానుకున్నాడు. అలా తిరగడం ఆమెకీ మంచిదే. కాసేపు దుఃఖాన్ని మరిచిపోతుంది! పైప్ వెలిగించి, ఘాటుగా పొగలాగి, తలని సోఫా వెనక్కి వాల్చాడతను.

[ఇంకా వుంది]

నరమేధం

యస్.డి.వి. అజీజ్

పగ....!....పగ!!....పగ!!!

అవును పగే!

నా మది నిండా పగే!

నా ఎద నిండా పగే!!

నా తనువంతా ప్రతీకారజ్వాలతో దహించుకు పోతూ వుంది.

దెబ్బకు దెబ్బ తియ్యమని నాలోని ఆవేశం పెద

బొబ్బలు పెడుతూ రక్తాన్ని మరిగించి పురకలు తీయిస్తూ వుంది.

అడిగిన వెంటనే 'కాదు, లేదు' అనకుండా చేతనయి నంత సహాయం చేసే నా చేతులు నేడు ముడుచుకొన్నాయి. పిడికిళ్ళు బిగుసుకొన్నాయి. నరాలు బిగుతెక్కాయి.

ఇన్నాళ్ళు నిద్రావస్థలోవున్న నేను నేడు జాగృత పడ్డాను. నేనెంతగా పోగొట్టుకొన్నానో తెలిసొచ్చి గుండె లవిసిపోయేలా నాలో నేను ఏడ్చుకొన్నాను. నేను పోగొట్టుకొన్నది ధనం మాత్రమే కాదు. ధనంకంటే విలువైన కాలం. అంతకంటే విలువైన నా మనసు. నా మనసిపుడు నా ఆధీనంలో లేదు. ప్రశాంతంగా వుండే నా ఎదలో అశాంతి రేగింది. ఆ అశాంతికి కారణం?

'నివేదిత'

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటారు.

అది ముమ్మాటికి నిజమంటాను.

తొలి చూపుల్లోనే నివేదితను మనస్ఫూర్తిగా ప్రేమించాను. నా హృదయమంతా ఆమె రూపే నింపుకొన్నాను. అనుక్షణం, ప్రతిక్షణం ఆమె తలపులతోనే కాలం గడుపుతూ ఆమె ఉన్నతస్థాయి చేరుకోవడానికి ఎంతగానో చేయూత నిచ్చిన నన్నే నివేదిత ఘాతుకి అయి వెన్నుపోటు పొడిచింది. అందుకే నాలో ఈ పగ! ప్రతీకారం!!

అవును—ఆమె మరణంతోనే నా మనసు శాంతిస్తుంది. తిరిగి నాలో ప్రశాంతత నెలకొంటుంది.

కసిగా దౌడపళ్ళు నూరుతూ నా చేతిలోని వెడ్డింగ్ కార్డువంక మరోసారి చూశాను.

'ప్రమోద్ వెడ్స్ నివేదిత'

ప్రమోద్ స్థానంలో నా పేరు వుండాల్సింది. కాని

అంతా తారుమారు అయ్యింది. కాదు—కావాలని తారుమారు చేసింది నివేదిత. ఎంతో నయవంచకి! నన్ను వాజమ్మను చేసి తన పబ్బం గడుపుకుంది. నా అవసరం తీరింది కాబట్టి నన్ను దూరంగా విసిరి ఇంకొకడ్ని చేసుకొంటోంది.

నివేదితపై మనసంతా ఎన్నడూలేని జుగుప్సాభావంతో నిండిపోయింది. నా చేతుల్లోని శుభలేఖ నలిగి ముక్కలై పోయింది.

2

"నాగులూ!"

జవాబు రాలేదు.

గొంతు పెంచి కాస్త గట్టిగా పిలిచాను.

"నాగులూ!"

ఈమారు సమాధాన మొచ్చింది.

"ఎవర్రా అది?" కరుకు గొంతునుంచి వెలువడిన పలుకది.

"ఓమారు బయటికి వస్తావా?" గుడిశె తలుపుపై చిన్నగా శబ్దం చేస్తూ పిలిచాను.

ఓ నిముషం పాటు లోపల ఏదో అలికిడి.

నిముషం తర్వాత తలుపు తెరుచుకుంది.

నలభై ఏళ్ళ వయసులోపు వున్న నడివయసు వ్యక్తి బయటికి వచ్చాడు లుంగీ ఎగదోపుకొంటూ. ఎదపై షర్టు లేదు మెడలో పులిగోరు తాయెత్తు మాత్రం వేలాడుతూ వుంది. కుడిచేతి జబ్బకు కూడ రాగి తాయెత్తు కట్టబడి వుంది. సినిమాల్లో విలన్‌కు మల్లే కోరమీసాలు లేవు. అవి షేవ్ చెయ్యబడి వున్నాయి. తలనిండా వెంట్రుకలు లేవు. బట్టతల ఎండకు తళ తళ మెరుస్తూవుంది. బట్టతలపై

చెయ్యిపెట్టి రుద్దుకొంటూ అడిగాడు నా వంక ఎగాదిగా చూస్తూ, అనుమానంగా:

"ఎవర్నువ్వు?"

నా గురించి చెప్పాను.

"ఎందుకొచ్చావు?" అతని మాటల్లో కరుకుదనం.

"అందరూ నీ దగ్గ కి ఎందుకొస్తారు?" ప్రశ్నించాను.

"అందరూ రారు. కొందరే వస్తారు?" సమర్థింపుగా చెప్పాడు నాగరాజు.

"ఆ కొందరే ఎందుకొస్తారు?" మళ్ళీ అడిగాను, చిన్నగా నవ్వి.

"అంటే నీవూ అలాంటి బాపతు వాడివేనా?" నొసలు చిట్లిస్తూ అడిగాడు నాగరాజు.

"నీ ఇష్టం. నీవు నన్ను ఎలా అనుకొన్నా ఫర్వాలేదు. నిన్నటివరకు నీలాంటి వ్యక్తులతో నాకు అవసరంలేదు. కాని ఈనాడు అవసరమొచ్చింది. అందుకే వచ్చాను."

"ఏమిటా అవసరం?" నా వంక గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

"మరీ అంతగా గుచ్చి గుచ్చి చూడకు. నేనేం పోలీసు మనిషిని కాదులే!" చిరుకోపం వొలికిస్తూ అన్నాను.

"అయితే కాని నాకేం భయమా?" అతని పలుకుల్లో నిర్లిప్తత ....నిర్భయత.

"నువ్వో మనిషిని హత్య చెయ్యాలి" ఒక్కో అక్షరం కూడ బలుక్కుని ఒక్కమారుగా చెప్పాను.

"నా రేటు తెలుసా?" భుజా లెగరేస్తూ అన్నాడు నాగరాజు.

"తెలుసు."

"అయితే తెలుసుకొనే వచ్చానన్న మాట! పనికి

ముందు అయిదువేలు పని అయింతర్వాత పదివేలు."

"పనికిముందు పదివేలు పని అయ్యింతర్వాత పదివేలు ఇస్తాను."

అతని కళ్ళల్లో ఆశ్చర్యం!

ఓ నిముషం పాటు అతని శరీరంలో తుళ్ళింత! తిరిగి సర్దుకొని చెప్పాడు.

"అయితే అడ్వాన్స్ తెచ్చావా?"

"తేలేదు."

"డబ్బులేందే వచ్చావా?" నా వంక అపనమ్మకంగా చూస్తూ అడిగాడు.

"ప్రస్తుతం నా దగ్గిర అంత డబ్బులేదు. నా ఇంటిని ఉదయమే 30 వేలకు అమ్మాను. డబ్బు సాయంకాలం ఐదింటికి వస్తుంది."

"కాకమ్మ కథలు చెబుతున్నావా?" వ్యంగ్యంగా అడిగాడు నాగరాజు.

"నన్ను నమ్ము నాగులు. నిజం చెబుతున్నాను. సాయంకాలం ఐదింటికి డబ్బు నా చేతికి వస్తుంది. అప్పుడిస్తాను అడ్వాన్స్" అర్థింపుగా చెప్పాను.

"అయితే పనికూడ అప్పుడే మొదలు పెడతాను"

"అలాగే!" ఒప్పుకోలుగా అన్నాను.

"సాయంకాలం ఎక్కడికి రమ్మంటావు?"

"సరిగ్గా ఐదింటికి మెడికల్ కాలేజి వెనుక ప్లేగ్రౌండ్‌లో కలుసుకో! అక్కడిస్తాను డబ్బు"

"అచ్ఛా" అంటూ చెయ్యి ముందుకు చాచాడు షేక్ హ్యాండ్ కోసం. ఆనందంతో షేక్‌హ్యాండ్ ఇచ్చాను. నాగులు చేరువయి చిన్నగా నా భుజంతట్టి కళ్ళలోకి చూస్తూ అదోలా నవ్వాడు.

నా మేను జలదరించింది—

అతని నోటినుంచి వెలువడిన గంజాయి తాలుకు వాసన భరించలేక.

3

రోడ్డుపైకి చేరుకొన్న నేను ఆటో ఎక్కి ఇల్లు చేరుకొన్నాను.

తాళంతీసి తలుపులు తెరచుకొని లోపలికి అడుగు పెడుతుంటే ఎందుకో శరీరమంతా వొణుకు పుట్టింది. ఇల్లంతా కలియజూశాను. గుండె కలుక్కుమంది మనసులో చెప్పరాని బాధ మొదలయ్యింది. నా పూర్వీకుల తరతరం నాకు సంప్రాప్తించిన స్థిర, చరాస్థిలో మిగిలింది ఈ ఇల్లొక్కటే. అది కూడ నేడు ఇంకొకరి స్వాధీనమౌతూ వుంది.

అనుకోకుండానే కళ్ళవెంట కన్నీరొలికింది. మూగగా రోదిస్తూ వుండిపోయాను చాలసేపు. ఆ తర్వాత తేరుకొని నా స్థిరచరాస్థిలో పాతికవవంతు ఖర్చుపెట్టి సేకరించి పెట్టుకొన్న 'మినీలైబ్రరి'లోని విలువైన పుస్తకాలన్నీ ధారాదత్తం చేశాను, జిల్లా గ్రంథాలయానికి.

అనుకొన్న ప్రకారం సాయంకాలం ఐదింటికి నా ఇంటిని కొన్న సేట్ భజనలాల్ 30 వేల రొక్కం తెచ్చి నా చేతికిచ్చాడు. ఇల్లు అతనికి స్వాధీనపరచి డబ్బును జాగ్రత్తగా ప్యాంట్ జేబులో దాచుకొని వడివడిగా అడుగులు వేస్తూ ఫర్లాంగ్ దూరంలో వున్న మెడికల్ కాలేజి వెనుక వున్న ప్లేగ్రౌండ్‌లోకి వెళ్ళాను. అప్పటికే నాగరాజు నా కోసం ఎదురుచూస్తూ నిల్చొన్నాడు.

నలువైపుల పరికించాను. దూరంగా కొంతమంది కుర్రాళ్ళు క్రికెట్ ఆడుకొంటున్నారు. వారి దృష్టి మాపై

అణుమాత్రమయినా లేదు.

నాగరాజు ఎదురొచ్చి విష్ చేశాడు.

"నమస్తే!"

ప్రతి నమస్కారం చేసి జేబులోనుంచి 20 వేలు బయటికి తీసి అతని చేతిలో వుంచాను చిర్నవ్వుతో. అతను డబ్బువంక మార్చి మార్చి చూస్తూ అడిగాడు.
"20 వేలు ఇస్తున్నారేంటి?"

"ఫర్వాలేదు వుంచుకో!" అంటూ భుజం తట్టాను.

"పని అయింతర్వాత ఇవ్వండి సార్?" తిరిగి ఇవ్వబోయాడు.

నేను దూరంగా జరుగుతూ చెప్పాను.

"నాగరాజూ! ఇప్పుడిచ్చినా, అప్పుడిచ్చినా ఒకటే వుంచుకో!"

"సార్!" నాగరాజు పిలుపులో సౌమ్యత.

"ఏమిటి?" మందహాసం చేస్తూ అడిగాను.

"ఎందుకీ హత్య చేయిస్తున్నారు సార్?"

"తెలుసుకోవాలని కుతూహలంగా వుందా?"

"చెప్పాలనిపిస్తేనే చెప్పండి!"

"హత్య చెయ్యబోయేవాడివి నువ్వు. అసలు విషయం నీకు గాక ఇంకెవరికి చెప్పాలి? చెబుతాను. జరిగింది చెబుతాను." అంటూ నా మనసును గతంవైపు మళ్ళించాను.

4

"మాది బాగా కలిగిన కుటుంబం. నేను పుట్టిన మరు నిమిషంలోనే నన్ను కన్న నేరానికి మా అమ్మ చని పోయింది. మా నాన్నే అమ్మా, నాన్నై పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి చెట్టంత కొడుకు చేతికి అంది

వస్తున్న సమయంలో క్యాన్సరు వాతపడి హరిమన్నాడు. ఫలితం నేను. 'నా' అన్న తోడులేని ఒంటరివాడనై పోయాను.

రోజులు నిర్లిప్తంగా, భారంగా గడుపుతూ వుండగా అనుకోకుండా ఓరోజు నివేదిత అగుపించింది. ఆమె తొలి చూపుల్లోనే నా మనసును ఆకట్టుకుంది. ఆమెతో పరిచయం పెంచుకోవాలనిపించింది. పెళ్లాడాలనిపించింది. అడిగాను.

'ఇప్పట్లో వీలుకాదు. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు. విద్య ముగించుకొని ఏదైనా ఉద్యోగం చూసుకొని వారి ఆలన పోషణ నేనే చూడవలసి వుంటుంది. ఇపుడు అదను దొరికింది కదా! అనుకొని నా స్వార్థం నేను చూసుకొంటే వారేమైపోతారు? అవిటివాడై మూలన పడివున్న మానాన్న వారిని పోషించగలడా? ఇల్లిల్లు అంట్లుతోమి మా అమ్మ ఎంతమందిని బ్రతికిస్తుంది.' దుఃఖంతో ఆమె కంఠం పూడుకుపోయింది.

'ఏడ్వకు నివేదితా నీకు నేను అండగా వుంటాను. మీ కుటుంబ బాధ్యత నేను వహిస్తాను' అంటూ ఆమె దుఃఖం ఆపు చేశాను.

'మీరు వహిస్తారా?' విస్మయపోతూ అడిగింది నివేదితా.

'అవును నివేదితా....మీ ఇద్దరు చెల్లెళ్ళ బాధ్యతేకాక నీవు ఎంతవరకు చదవదలచుకొన్నా చదివిస్తాను.' ఆమెలో మనోధైర్యాన్ని కలిగిస్తూ చెప్పాను.

ఆనందాశ్రువులతో 'ఏమండి మీరు నిజంగా....' అంటూ ఇంకేదో అనబోతుండగా మధ్యలో నేను కల్పించుకొని చెప్పాను.

"నీకోసం నీ ప్రేమకోసం ఏమైనాచేస్తాను నివేదితా."

నా మాటలు ఆమెను ఆనంద పరిచాయి. నా చేతిని

స్పృశిస్తూ సుతారంగా ముద్దాడింది. అన్ని బాధ్యతలు తీరాకే తన పెళ్ళి అన్నది.

అన్నమాట ప్రకారం నివేదిత కుటుంబం తాలూకు బాధ్యత నేనే నిర్వహించి ఆమె ఇద్దరు చెల్లెళ్ళకు వారికి ఆసక్తి వున్నంతమేరకు చదివించి పెళ్ళిళ్ళు జరిపించాను. నివేదితను ఇంకా చదవమన్నాను. ఆమె చదువుకు వేలకు వేలు ఖర్చుపెట్టాను. ఆమె ఏవడిగినా 'కాదు. లేదు' అనక కొనిపెట్టాను. నివేదిత చదువు పూర్తయ్యేసరికి నా స్థిరచరాస్థి పూర్తిగా హరించుకుపోయింది. అయినా నేనేమి బాధ పడలేదు. నేను ప్రేమించిన నివేదిత నాదయితే చాలనుకొన్నాను.

చదువు అయిపోయిన కొన్ని నెలల్లోపే నివేదితకు కేంద్ర ప్రభుత్వంలో పెద్ద హోదాగల ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం రాగానే విశ్వసఘాతకి అయి నన్ను నా ప్రేమను మఱచి తనకంటే ఎక్కువ హోదా వెలగ బెడుతున్న ఇంకొకరిని పెళ్ళిచేసుకోవడానికి సంసిద్ధ మయ్యింది. ఈవిషయం తెలిసిన నాకు గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలయినట్లయ్యింది. వెళ్ళి 'ఏమిటిది?' అని అడిగితే.

'పెళ్ళి' అంటూ తేలిగ్గా నవ్వేసి 'నీవు చేసిన సహా యానికి నా జీవితాంతం రుణపడి వుంటాను. అయితే నిన్నుమాత్రం పెళ్ళాడలేను. సారీ' అంది.

'ఎందుకు? అని రెట్టించి అడిగిన నాకు ఆమె సమా ధానం ఇవ్వకుండా మొహం చాటేసింది. ఆమె సమా ధానం ఇవ్వలేకపోయిన అసలు విషయం తెలుసుకొన్నాను. అదేమిటంటే?

ఏమాత్రం ఆస్తిలేక బికారివాడినైన నన్ను చేసుకొంటే

తన హోదాకు భంగం వాటిల్లుతుందని, పదిమందిలో తన స్టేటస్ తగ్గుతుందని.

నాగరాజూ! నివేదితను నేను ఎంతగా ప్రేమించానో ఇప్పుడు అంతగా ద్వేషిస్తున్నాను. నాకు దక్కని నివేదిత ఇంకొకరికి దక్కకూడదు. అందుకే ఆమెను నీవు హత్య చెయ్యాలి. ఎలా చేస్తావో. ఏమి చేస్తావో నీ ఇష్టం. ఈ రాత్రి పన్నెండు గంటల పది నిమిషాలకు ఆమె మెళ్ళో పడాల్సింది పసుపుతాడు కాదు. యముని తాలూకు వురి తాడు" ఆవేశంతో చెప్పుకుపోయాను.

నాలోని ఆవేశం పూర్తిగా తగ్గింతర్వాత చెప్పాడు నాగరాజు.

తాను నివేదితను ఎలా చంపదలచుకొన్నది!

5

రాత్రి పదకొండయ్యింది.

పథకం ప్రకారం నేనూ, నాగరాజు నివేదిత బస చేస్తున్న బంగళాదగ్గరికి వెళ్ళాం. రంగు రంగుల విద్యు దీపాలతో అందంగా అలంకరించబడి వుంది బంగళా. వచ్చేజనంతో. అటూ ఇటూ తిరుగాడే జనంతో హడా వుడిగా సందడిగావుంది బంగళా ముందు ప్రాంతం. నిముషానికొకటి చొప్పున కార్లు వచ్చి ఆగి బార్లు తీరుతూ వున్నాయి.

ఖరీదయిన దుస్తులు ధరించిన వ్యక్తులు ఠీవిగా నడుచు కొంటూ లోపలికి వెళుతున్నారు. గేటుదగ్గిర కాపలా వుండే సెంట్రీ వారికి వొంగి వొంగి సలాములు కొడుతూ లోపలికి పంపిస్తూవున్నాడు. నేనూ. నాగరాజు మా రూపు రేఖలు మార్చుకొని ఎలెక్ట్రిషియన్స్‌గా తయారయ్యాము.

జంటగా కలసి లోపలికి వెళ్ళబోతుంటే గూర్ఖా అడ్డు

కుని మా వంక అనుమానంగా చూస్తూ అడిగాడు.

"కహా జాతేహై?"

"అందర్‌కో" జవాబు చెప్పాం!

"క్యోఁ....?"

"హమ్ ఎలెక్ట్రిషియన్స్ హై" అంటూ మా చేతుల్లోని ఎలెక్ట్రిక్ వర్క్స్‌కు సంబంధించిన కటింగ్ ప్లేయర్, స్క్రూ డ్రైవర్ టేపు....కొన్ని వైర్లు చూపి గేటుదాటి లోపలికి అడుగుపెట్టాం!

లోపల ముఖద్వారంవద్ద నిల్చొని ఆహ్వానితులకు సాదరంగా లోపలికి స్వాగతం పలుకుతున్నారు నివేదిత అవిటి తండ్రి శంకర్రావ్ అతని ఇద్దరు కూతుళ్ళు తలదించుకొని వడివడిగా అడుగులువేస్తూ లోపలికి వెళుతుంటే నివేదిత తండ్రి ఆపి చెప్పాడు.

"వంటింటిలో బల్బు వెల్గడం లేదంట. వెళ్ళిచూడు!"

"అలాగే సార్" అంటూ వినయంగా తలూపి లోపలికి వెళ్ళాను లోలోపల నవ్వుకొంటూ.

లోపల హాల్లో రకరకాల జనం. అందరూ 'హై' స్థాయికి చెందినవారే? తారలకు మల్లే విలువైన రకరకాల దుస్తుల్లో మెరిసిపోతూవున్నారు. మా గురించి ఎవరూ పట్టించుకొనే నాథుడేలేడు. అసలు వ్యక్తే పట్టించుకోనపుడు కొసరు వ్యక్తులు ఎవరు పట్టించుకొంటారు.

హాలు నలుదిక్కుల చూశాను.

నలువైపుల నాలుగు గదులున్నాయి.

ఒక వ్యక్తిని ఉద్దేశించి అడిగాను.

"వంటిల్లు ఎటు?"

అతను నా వంక ఎగాదిగా చూస్తూ అడిగాడు.

"ఎందుకు?"

జవాబు చెప్పాను.

అతను వంటగదికి ఎటు వెళ్ళాలో దారి చూపించి వెళ్ళాడు. అతను చెప్పిన గుర్తుల ప్రకారం వెళ్ళి నేనూ నాగరాజు వంటగదిలోకి ప్రవేశించాం!

నివేదిత చిన్న చెల్లెలు అరుణ క్యాండిల్సు వెలిగిస్తూ వంటవాళ్ళను పురమాయిస్తూ వుంది. అరుణకు నా దగ్గిర చను వెక్కువ. నాముందే లంగా, వోణీలు తొడిగిన పిల్ల. పెళ్ళవగానే ఎంత మార్పు వచ్చింది.

నివేదితతో నా పెళ్ళి కాకున్నా "బావా?" అంటూ ఆప్యాయంగా పిలుస్తూ నన్నల్లరి పట్టించేపిల్లా.... పెళ్ళవ గానే ఎంత మార్పు వచ్చింది?

నేరుగా అరుణ దగ్గిరకే వెళ్ళి అడిగాను.

"బల్బు ఎక్కడ పోయిందండి?"

"అదిగో అక్కడ!" అంటూ నా వంక అదోలా చూసింది. నేను చప్పున దృష్టి మరల్చుకొని అరుణ చెప్పిన చోటుకువెళ్ళి ఫిలమెంట్ ఎగిరిపోయి కాలిపోయిన బల్బు స్థానంలో కొత్తబల్బు వుంచి స్విచ్ వేశాను.

గదినిండా వెలుతురు.

నా ఎదలో మాత్రం చీకటి.

అరుణ నాకు చేరువయి అడిగింది.

"కాఫీ తాగారా?"

"నో థాంక్స్. నాకు అలవాటు లేదు" అంటుండగనే బయట నుండి కబురు వచ్చింది బయట కూడా ఎక్కడో బల్బు పోయిందని.

ఇద్దరం బయటికి వచ్చాము వంట గది నుంచి.

అక్కడ్నుండి హాలు గదిలోకి వస్తూండగా పక్క గదిలో నుండి పెద్ద ఎత్తున అమ్మలక్కల ఇకఇకలు పక

పకలు వినిపించాయి. రూఢిగా తెలిసిపోయింది అది పెళ్ళి కూతుర్ని ముస్తాబు చేస్తున్న గదని. ఓరగా పక్క కిటికీలో నుండి లోపలకి తొంగి చూశాను. పండు ముత్తయిదువలు, నివేదిత స్నేహితురాళ్ళు. నివేదితను కుర్చీలో కూర్చోబెట్టి పెళ్ళికూతురిగా తయారు చేస్తున్నారు. నివేదితకు వరుస అయినవారు ఛలోక్తులు విసురుతున్నారు. ఆ ఛలోక్తులు ద్వంద్వార్థంతో సాగుతున్నాయి. నివేదిత ముసి ముసి నవ్వులు నవ్వుతూ కుందనపు బొమ్మలా ఒదిగి కూర్చొని వుంది.

ఎందుకో నా కళ్ళు చెమ్మగిల్లాయి.

గుండెలోని మారుమూల కలుక్కుమంది.

పక్కనే వున్న రాతి స్తంభానికి తల కొట్టుకుని చచ్చిపోదామా అనిపించింది. నా పరిస్థితిని అర్థం చేసుకున్న నాగరాజు చిన్నగా భుజం తట్టి ముందుకు కదిల్చాడు కర్తవ్యం గుర్తుకు తెస్తూ.

తిరిగి బయటికి వచ్చి హాల్లోకి నడిచాం.

పెళ్ళికొడుకు పెళ్ళి పీటలపయి కూర్చొని సిద్ధంగా వున్నాడు తాళి కట్టడానికి. పురోహితుడు పెళ్ళి మంత్రాలు వల్లిస్తున్నాడు. దగ్గరగా వెళ్ళి పెళ్ళికొడుకును పరీక్షగా చూశాను. నాకంటే బాగున్నాడు. సినిమా హీరోలా వున్నాడు. నేనూ అందగాడ్నే! అయితే అతని అందం ముందు నా అందం దిగదుడుపే.

"పాపం అమాయకుడు" అనిపించింది. చిన్నగా నిట్టూర్చాను.

పురోహితుడు తన ముంజేతికి వున్న గడియారం వంక చూస్తూ "పన్నెండవుతూ వుంది. పెళ్ళి ముహూర్తం సమీ

పిస్తూ వుంది. త్వరగా పెళ్లికుమా_ర్తెను తీసుకురండి!"
అంటూనే ఒకవై_పు దురద తగ్గడానికి వీపు గోక్కుంటూ మరొక వంక అస్పష్టంగా మంత్రాలు చదువుతూవున్నాడు. నాగరాజు నా వంక ఓరగా చూస్తూ కనుసయిగ చేశాడు.

"సమయం దగ్గిర పడుతూ వుంది" అంటూ.

"గు_ర్తుంది" అన్నట్టుగా తలాడించి హాల్లో కుడివై_పు చివర్లో వున్న మెయిన్ స్విచ్ దగ్గిరకి వెళ్ళి నిల్చున్నాను. నేను లై_ట్లార్పగానే నాగరాజు సుడిగాలిలా దూసుకుపోయి నివేదిత గుండెల్లో క_త్తి దించాలి. నాగరాజు వంక చూశాను. తన బొడ్లో దోపుకున్న క_త్తిపై కుడి చెయ్యి వుంచి నరమేధానికి సిద్ధంగా వున్నాడు.

ఓ నిముషం గడిచింది.

నివేదిత సిగ్గుతో తల వాల్చుకుని అడుగులో అడుగు వేస్తూ వచ్చి పెళ్ళిపీటలమీద కూర్చుంది. పురోహితుడు ఇద్దరి మధ్య తెరకట్టి జీలకర్ర బెల్లం పెట్టించాడు. వాచీ వంక చూశాను. పన్నెండు రెండు నిముషాలు.

భజంత్రీల మోత మొదలయ్యింది. పురోహితుడు గొంతు చించుకుని మంత్రాలు చదువుతూ వున్నాడు.

వున్నట్టుండి ఎవరో నా భుజంమీద చెయ్యి వేసిన ట్లయ్యింది. ఉలిక్కిపడి అదురుపాటుతో వెనక్కి తిరిగి చూశాను. అరుణ! నా వంకే చూస్తూంది. నన్ను గు_ర్తు పట్టింది కాబోలు. అక్కడ్నుండి నిష్క్రమించబోయాను. కాని అప్పటికే చప్పున నా చెయ్యి పట్టుకుని పక్క గది లోకి లాక్కెళ్ళి గద్గద స్వరంతో పలికింది.

"బావా! మా అక్కయ్యని చంపడానికి వచ్చావు కదూ!"

అరుణ మాటలు నాలో కలవరం రేకెత్తించాయి. తను నివేదితను చంపదలనుకున్నట్టు అరుణ ఎలా పసిగట్టింది? నా కళ్ళల్లోని ప్రశ్నను గమనించి చెప్పింది. "మీరిద్దరు నివేదితను చంపడం గురించి గుసగుసలాడుకోవడం నే పొంచి విన్నాను బావా! అక్కయ్య అంటే నీకెంత ప్రేమో నాకు తెలుసు. మా బాగుకోసం, అక్కయ్య ఉన్నతి కోసం మీరెంతగా తపించి....తపించి ఈ స్థాయికి వచ్చారో నాకు బాగా తెల్సు. అక్కయ్య కూడ. అన్నీ తెలిసిన అక్కయ్య నిన్ను తిరస్కరించడానికి కారణం నువ్వే!"

"నేనా!" నిర్ఘాంతపోయాను.

"అవును నువ్వే!" అంటూ పక్కనే వున్న ఓ సూట్ కేసులో నుండి 'డైరీ' తీసి పేజీలు తిప్పి నా చేతిలో వుంచింది "చదువు" అంటూ.

ఆత్రంగా అందుకుని చదవడం మొదలు పెట్టాను.

"నా జీవితంలో మఱచిపోలేని, మరుపలేని వ్యక్తి శరత్. నేనీనాడు ఈ స్థితికి రావడానికి కారణం. నా కుటుంబ సభ్యులు ఓ నిలకడకు వచ్చారంటే అంతా అతని దయా బిక్షే! శరత్ నన్ను పిచ్చిగా ప్రేమించాడు. ఆ ప్రేమతోనే ఇదంతా చేశాడు. ఇంత చేసిన వ్యక్తికి నే నేమి చెయ్యలేక పోతున్నందుకు నాలో నేను ఎంతటి రంపపు కోత అనుభవిస్తున్నానో ఆ భగవంతుడికే తెలియాలి. అతడు నన్ను పెళ్లాడమన్నాడు. కాని నేను తిరస్కరించాను. కారణం!

మనిషి జీవితంలో ఒక్కోమారు అనుకోని పరిణామాలు ఏర్పడుతూ వుంటాయి. అలాగే ఈ పరిణామం

కూడ మా ఇద్దరి ఎడబాటుకు కారణమైంది.

ఇప్పటికి ఆర్నెల్ల క్రితం శరత్ ఓ బస్సు ఆక్సిడెంట్లో గాయపడి హాస్పటల్ పాలయ్యాడు. ఆ గాయపడ్డంలో అతని మూత్రపిండాలకు గట్టి దెబ్బ తగలటంవల్ల అతను సంసార సౌఖ్యానికీ అనర్హుడయ్యాడు. ఈ విషయం శరత్‌కు తెలిస్తే పిచ్చివాడు కావడమో, లేక ఆత్మహత్యకు పాల్పడటమో తప్పక జరుగుతుంది. శరత్‌ది అతి సున్నితమైన హృదయం. ఆ హృదయం ఇలాంటి విపత్పరిణామాలకు తట్టుకోలేదు.

ఈ ఒక్క కారణంతో అతనితో పెళ్ళికి నిరాకరించలేదు. అతన్ని పెళ్ళాడితే తొలిరాత్రే అతనికి ఈ విషయం తెలిసిపోతుంది. ఫలితంగా ఇద్దరి మధ్య అంతులేని అగాధం ఏర్పడుతుంది. అగాధాన్ని ఈది ఇద్దరం తీరం చేరుకోవడం కల్ల. శరత్‌ను పిచ్చివాడిగా మారకుండా పిరికివాడై ఆత్మహత్య చేసుకోకుండా వుండేందుకే ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను. అతను నన్ను మరచిపోయేందుకు నాకు దూరమయ్యేందుకు అతని సుఖం కోసమే అతనితో పెళ్ళికి నిరాకరించాను. నే నెంతగా కుమిలిపోయానో, అలా చెయ్యడానికి నా నరాలు ఎన్ని తెగి పడ్డాయో ఆ భగవంతుడికే తెలియాలి.''

ఆ తర్వాత వ్రాసింది చదవలేకపోయాను. నా కాళ్ళ క్రింద భూమి బ్రద్దలయిపోతున్నట్లు అనిపించింది. ఆపాదమస్తకం వొణుకు. గుండెల్లో దడ. వొళ్ళంతా ముచ్చెమటలు పోశాయి.

నా పరిస్థితి గమనించిన అరుణ కంగారెత్తిపోయి

బయటికి పరుగెత్తడానికి ఉద్యుక్తురాలు కాగా వారించి నేను ఏదో జవాబు చెప్పబోతున్నంతలో హాల్లో హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి.

ఆ తర్వాత ఏం జరుగుతుందో తెలుసు కాబట్టి ఇంకో క్షణం కూడా ఆ గదిలో వుండకుండా "నివేదితా!" అంటూ గట్టిగా అరుస్తూ సంధించిన బాణంలా వెళ్ళి పందిరివయిపు దూసుకుపోయాను. నాగరాజు చేతిలోని కత్తి చీకట్లో తళ తళ మెరుస్తూ నివేదిత గుండెలవయిపు దూసుకుపోతూ వుంది. పరిస్థితి గ్రహించిన నేను చప్పున నివేదితకు ఎదురు వెళ్ళాను.

ఫలితం? నాగరాజు చేతిలోని కత్తి నా వెన్నులో బలంగా, కసిగా దిగబడింది. □

చెయ్యి నొప్పి?

నీలం రంగు పెట్టె

యం. రాధిక

'బయలుదేరుతున్నానోచ్' అన్నట్టుగా రైలు ఒకసారి కూత వేసి, మెల్లిగా ముందుకు కదిలింది.

అప్పటిదాకా కింద నుంచుని కబుర్లతో కాలక్షేపం చేస్తున్న వాళ్ళంతా హడావిడిపడుతూ రైలు ఎక్కసాగారు.

సరిగ్గా అప్పుడే స్టేషన్ ముందు కీచుమన్న శబ్దంతో వచ్చి ఆగింది ఒక టాక్సీ.

మీటర్ ఎంతయిందో కూడా చూడకుండానే ఓ యాభై రూపాయలనోటు డ్రైవర్‌కు ఇచ్చేసి, టాక్సీలో ఉన్న నీలంరంగు సూట్‌కేస్‌ను తీసుకుని స్టేషన్‌లోకి రివ్వున పరిగెత్తాడొక ఆగంతకుడు.

రైలు వేగం పుంజుకుంటోంది.

ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చిన ఆ ఆగంతకుడు వెనకా ముందు ఆలోచించకుండా కనిపించిన కంపార్ట్‌మెంటులోకి ఎక్కేశాడు.

లోపలికి వెళ్ళకుండా అయాసం తీర్చుకోవడం కోసం గేటుదగ్గిర నిలబడ్డాడు.

ఇంతలో కొంతమంది పోలీసులు ప్లాట్‌ఫామ్ మీదికి అడుగుపెట్టారు.

వాళ్ళని చూడగానే అతని కళ్ళు భయంతో విశాలమయ్యాయి.

ఇందాకటి నుంచీ తనని నీడలా వెంటాడుతున్న పోలీసులు వాళ్ళు!!

కదుల్తున్న రైలు కనిపించగానే వాళ్ళూ అందులోకి ఎక్కుతారేమోనని కంగారుపడ్డా డతను.

అయితే అతను అనుకున్నట్లు జరగలేదు. వెళ్ళిపోతున్న రైలును చూపిస్తూ ఏదో చెబుతున్నాడు ఇన్‌స్పెక్టర్.

చూస్తుండగానే పోలీసులు, ఆ స్టేషన్ పరిసరాలు కళ్ళ ముందు నుంచి కదిలి వెళ్ళిపోయాయి.

తేలికగా నిట్టూర్చాడు ఆ ఆగంతకుడు.

ప్రస్తుతానికి పోలీసుల నుంచీ తనకు ప్రమాదం తప్పినట్లే. కానీ వచ్చే స్టేషన్‌లో తనకోసం ఉచ్చుపన్ని ఉండొచ్చు. ఆ స్టేషన్ రావడానికి ఇంకా రెండుగంటల

చైముంది. ఈ లోపల ఏదో ప్లాన్ ఆలోచించవచ్చులే అనుకుంటూ లోపలికి నడిచాడు.

అప్పటికిగానీ అతనికి తెలీదు—తను ఎక్కింది ఫస్ట్ క్లాసు కంపార్ట్‌మెంటని.

తెలిసిన తర్వాత తడబాటు కలిగింది. మళ్ళీ వెంటనే ధైర్యం తెచ్చుకుని ఖాళీగా కనిపించిన కూపేలో కూర్చున్నాడు.

అతనిలా కూర్చున్నాడో లేదో కోచ్ కండెక్టర్ వచ్చాడు 'టికెట్ ప్లీజ్' అంటూ.

వెంటనే అతను పర్సులోంచి పందరూపాయల నోట్ తీసి అందిస్తూ, "రాజమండ్రికి టిక్కెట్ ఇవ్వండి" అన్నాడు.

ఆ నోటువంకా, అతనివంకా మార్చి మార్చి చూస్తూ, "వాటీజ్ దిస్ నాన్సెన్స్. ఇదేమన్నా బస్ అనుకున్నారా? ఎక్కడబడితే అక్కడ టికెట్లు తీసుకోవడానికి" విసుక్కున్నాడు కండెక్టర్.

"సారీ సర్. మా ఫాదర్‌కు సీరియస్‌గా ఉందని టెలిగ్రామ్ వస్తే, ఆ కంగారులో టికెట్ కొనకుండానే ట్రైన్ ఎక్కేశాను. ప్లీజ్" అని నోటికి వచ్చిన అబద్ధం ఆడేశాడు.

కండెక్టర్ కాసేపు ఏదో గొణుక్కుని డబ్భై అయిదు రూపాయలకు రసీదు రాసిచ్చి, "ఛేంజ్ తర్వాత ఇస్తాను" అనేసి అర్జెంటుగా ఏదో పనున్నవాడిలాగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాగు.

చిన్నగా నవ్వుకుని, సీట్లో వెనక్కివాలి రిలాక్స్ అయ్యాడు అతను.

అప్రయత్నంగా అతని చెయ్యి పక్కనే ఉన్న నీలం

రంగు సూట్ కేస్ మీద పడింది.

వెంటనే దాన్ని దగ్గరకు లాక్కొని చేత్తో మృదువుగా తట్టాడు అంతవరకూ టెన్షన్‌తో నిండి వున్న అతని మొహంలో చిరునవ్వు రేఖ తళుక్కుమంది.

ఆ వ్యక్తి పేరు....పాపారావు. పాముల పాపారావు అంటే బాగా తెలుస్తుంది అందరికీ.

రకరకాల పాము చర్మాలని, కుబుసాల్ని సేకరించి స్మగుల్ చేస్తుంటాడు పాపారావు. ఆ బిజినెస్‌లో పెద్దగా పోటీ లేకపోవటంతో పాపారావు పని మూడు పాములు, ఆరు కుబుసాలుగా ఉంది.

పోలీసులకు చిక్కకుండా ఇంతవరకూ నేర్పుగా నెట్టుకుంటూ వస్తున్నాడు పాపారావు.

కానీ ఆరోజు మాత్రం చివరి క్షణంలో పాపారావు విషయం పోలీసులకు తెలిసి వెంటబడ్డారు. అతికష్టంమీద వాళ్ళకు టోకరా ఇచ్చి తప్పించుకోగలిగాడు.

ఆ విషయాన్ని తలుచుకుని 'బ్లడీషీట్' అనుకొని కణతల్ని రుద్దుకున్నాడు పాపారావు.

రెండు నిమిషాలసేపు అలాగే కదలకుండా కూర్చున్న తర్వాత టాయ్‌లెట్‌కు వెడదామని లేచి నుంచున్నాడు.

సూట్ కేసుని కూడా తన వెంట తీసుకెడదామా అని క్షణంసేపు ఆలోచించాడు పాపారావు.

మామూలు సూట్ కేస్ కాదది. తన బిజనెస్‌కోసం పాపారావు ప్రత్యేకంగా తయారుచేయించిన సూట్ కేస్ అది. సాధారణంగా ఎప్పుడూ ఆ సూట్ కేసుని వదలకుండా తిరుగుతుంటాడు పాపారావు.

మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో సూట్ కేస్‌ని అక్కడే వదిలేసి బయటకొచ్చి డోర్ లాగాడు.

ఆ కంపార్టుమెంటులో ఎవరూ లేకపోవడంతో ఎక్కడా అలికిడి లేదు.

రైలు మాత్రం శబ్దం చేసుకుంటూ వేగంగా పరిగెడు తోంది.

తన అవసరం తీర్చుకుని వచ్చిన పాపారావుకు కూపే డోర్ తెరిచిఉండటంతో కనుబొమలు ముడిపడ్డాయి.

సీరియస్‌గా చూస్తూ లోపలికి వెళ్ళబోయిన పాపా రావు ఒక్కక్షణం అదిరిపడి, కాలు వెనక్కి తీసేసు కున్నాడు.

"లోపలికి రా. పాపం ఎంతసేపని అలా నిలబడతావు. వచ్చి కూర్చో" అంతకుముందు పాపారావు కూర్చున్న సీటులో విలాసంగా పడుకున్న ఆగంతకుడు నవ్వుతూ ఆహ్వానించాడు.

అతని మొహంలో నవ్వురేఖ కనిపిస్తున్నా, గొంతులో ధ్వనించిన కమాండ్ పాపారావును మాట్లాడనివ్వలేదు. పైగా ఆగంతకుని చేతిలో ఆవురావురుమంటూ ఎదురు చూస్తున్న రివాల్వర్ పాపారావు నోటికి తాళం వేసింది.

ఎవరితను? తను టాయ్‌లెట్‌కు వెళ్ళి రెండు నిముషా లయినా కాలేదు. ఇతను లోపలకు ఎలా వచ్చాడు. ఎక్కడ్నుంచీ వచ్చాడు?— కూర్చుని ఆలోచిస్తున్నాడు. పాపారావు.

అతని ఆలోచనలు గ్రహించినట్లు చిన్నగా నవ్వాడు ఆగంతకుడు.

"నీలాంటి వాళ్ళను ఫాలో కావడమే నా వృత్తి బ్రదర్. ఇక ఇక్కడికి ఎలావచ్చావని మాత్రం అడగకు. ట్రేడ్‌సీక్రెట్ చెప్పడం నా కిష్టం ఉండదు. సరేగాని మొత్తానికి పోలీసులకు భలే టోకరా ఇచ్చావోయ్. వెరీ

గుడ్....ఆ....ఏం దాచావేమిటి....సారీ ఏం దోచావేమిటి ఈ సూట్ కేసులో?" దాన్ని అటూ ఇటూ కుదుపుతూ అడిగాడు.

అప్పటివరకూ మౌనంగా ఉన్న పాపారావు "వద్దు ఆ సూట్ కేసును కదపొద్దు" అన్నాడు కంగారుగా.

అతని కంగారు చూసి మరింతగా నవ్వాడు ఆగంతకుడు.

"ఏం బాంబులుగానీ ఉన్నాయేమిటి?" అని తన జోక్‌కు తనే పగలబడి నవ్వుకున్నాడు.

'ఇంత జరుగుతున్నా కండెక్టర్‌గాని, కోచ్ అటెండెంట్ గానీ రారేం' కసిగా అనుకున్నాడు పాపారావు.

"పాపం వాళ్ళిద్దరూ నా దయవల్ల మత్తులో జోగుతున్నారులే కానీ ఇంతకీ ఈ సూట్ కేసులో ఏముందో చెప్పలేదు" రివాల్వర్ మొనతో సూట్ కేసుమీద టకటక కొడుతూ అడిగాడు ఆగంతకుడు.

"సూట్ కేసులో ఏముంటాయి? బట్టలు అవీ ఇవీ" అన్నాడు పాపారావు వెంటనే.

"బుకాయించకు. ఇలా కబుర్లు చెప్పేవాళ్ళంటే నాకు అసహ్యం" రివాల్వర్‌ను పాపారావు కణతలకు ఆనిస్తూ చెప్పాడు ఆగంతకుడు.

పాపారావు భయంతో బిర్రబిగుసుకు పోయాడు.

అతనికి ఎప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. తన సూట్ కేసులో డబ్బో, నగలో ఉన్నాయనుకుంటున్నాడు ఈ ఆగంతకుడు. తీరా సూట్ కేస్ తెరిచి చూశాక తను అనుకున్నవేమీ లేకపోతే....? అసలే ఉన్మాదిలాగా కనిపిస్తున్నాడు. తనను పిట్టను కాల్చినట్టు కాల్చి పారేస్తాడేమో!

అసలు సూట్ కేస్ తెరిస్తే మరో ప్రమాదం కూడా ఉంది.

తను ఎంతో కష్టపడి సేకరించిన 'నజానీగ్రి కొల్లిస్' బయటకు వచ్చేస్తే....'మైగాడ్ ఇంకేమన్నా ఉందా?'

'నజానీగ్రి కొల్లీస్-దక్షిణాఫ్రికాకు చెందిన భయంకర మైన పాము. కొల్లీస్ తలవరకూ కనుగుడ్డు తప్ప మిగి లిన భాగమంతా లేత టామేటాపండు రంగులో ఉంటుంది. కన్ను కొంత నల్లగాను ఉంటుంది.

కన్ను చుట్టు ఉన్న పొలుసులని విడగొడుతున్న గాడిలో కనిపించే నలుపు, మనుషుల కనురెప్ప వెంట్రుక లంత సన్నని గీతలా ఉంటుంది. తలకి కిందనుంచి రెండు జానల పొడవున అటూ ఇటూ కొన్ని పొలుసులు తెల్లగా కొన్ని పొలుసులు నల్లగా ఉంటాయి. ఆ తర్వాత దాని శరీరమంతా కనిపించే పొలుసులు పండీ పండని గోరిం టాకు ఎరుపులో మెరుస్తుంటాయి.

ఆ పొలుసుల మధ్య సీతాఫలం గొగ్గుల మధ్య కని పించే తెలుపులా లేత నలుపురంగు కొట్టొచ్చేట్టు కని పిస్తుంది.

కొల్లీస్ చాలా బలంగా శత్రువును కాటువేయగలదు. అవసరాన్నిబట్టి వీలునుబట్టి శత్రువు కళ్ళలోకి విషాన్ని పిచికారీ చేసేశక్తి కూడా దానికుంది.

అతి చౌకగా లభ్యమయ్యే పాము కొల్లీస్ కావడంతో మన దేశంలో ఆ పాము చర్మానికి, విషానికి మంచి డిమాండ్ వుంది.

ఎంత లేదన్నా ఒక్క పాముని యాభై వేలకి అమ్మచ్చు.

రక రకాలుగా సాగిపోతున్న సాపారావు ఆలోచనలకు

ఆగంతకుడి కంఠం ఫుల్‌స్టాప్ పెట్టింది.

"వాట్ మాన్, మాట్లాడవేం? ఏ విషయమూ తొందరగా చెప్పు అసలే నాకు ఓపిక తక్కువ" అసహనంగా అడిగాడు ఆగంతకుడు.

తలెత్తి అతని వంక చూశాడు పాపారావు.

రివాల్వర్ గురిపెట్టి చిరాగ్గా చూస్తున్న అతన్ని చూడగానే పాపారావు మనసులో ఏదో ఆలోచన రూపు దిద్దుకుంది.

"ఆల్‌రైట్. ఆ సూట్‌కేస్‌లో నీకు పనికివచ్చేవేమీ లేవంటున్నా నమ్మడం లేదుగా. ఓ. కె. నువ్వే ఆ సూట్‌కేస్‌ని ఓపెన్ చేసి చూడు" చెప్పాడు పాపారావు.

అతనికేసి అనుమానంగా చూశాడు ఆగంతకుడు! మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో! తల వంకిస్తూ - "సరే- నువ్వు అటువేపు తిరిగి నుంచో. వెనక్కి తిరగడానికి ప్రయత్నించినా, పిచ్చివేషాలు వేసినా నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాను. జాగ్రత్త!" కఠినంగా చూస్తూ హెచ్చరించాడు.

తన ఎత్తు పారినందుకు సంతోషిస్తూ వెనక్కి తిరిగి నుంచున్నాడు.

జరగబోయేదానికోసం ఊపిరి బిగపట్టి ఎదురుచూడసాగాడు పాపారావు.

ఆగంతకుడు అతని వంక ఒకసారి చూసి సూట్‌కేస్ మీద చెయ్యి వేశాడు.

ఓరగా తల తిప్పి అతనేం చేస్తున్నాడో చూశాడు పాపారావు.

టెన్షన్‌తో స్పృహ తప్పుతుందేమో అన్నట్టుగా ఉంది అతని పరిస్థితి.

ఒకసారి సూట్ కేస్ అటూ ఇటూ కదిపి చూసి లాక్ మీద చెయ్యి వేశాడు ఆగంతకుడు.

టక్ మన్న శబ్దంతో సూట్ కేస్ ఓపెన్ అయింది.

అంతే! చాలాసేపటినుంచీ తనను బంధించి ఉంచినందుకు కోపంతో రెచ్చిపోయి ఉన్న నజాన్ గ్రీ కొల్లీస్ బుస్‌మంటూ ఒక్కసారిగా బయటకు వచ్చింది.

ఊహించని ఈ పరిణామానికి నిశ్చేష్టుడయిన ఆగంతకుడు తేరుకుని రివాల్వర్‌ని పేల్చబోయాడు.

కానీ అప్పటికే ఆలస్యం అయింది.

ఎదురుగా మనిషి కనిపించగానే తన బందిఖానాకు అతడే కారణమనుకొని మరింత రెచ్చిపోయి ఆగంతకుడి చేతిమీద బుస్సుమని కాటు వేసింది.

పెద్దగా కేకపెట్టి రివాల్వర్ వదిలేశాడు ఆగంతకుడు. అతడి కేక రైలు కూతలో కలిసిపోయింది. చూస్తూండగానే నోటి నుండి నురగలు ప్రారంభమయ్యాయి.

మరోసారి కాటు వేసింది కొల్లీస్. ఈసారి కాలుమీద.

కానీ అప్పటికే ఆగంతకుడు తల వాల్చేయడంతో అతని నోటి నుండి మళ్ళీ కేక వెలువడలేదు.

అయినా కసి తీరక పదే పదే కాట్లు వేసింది కొల్లీస్.

నీలివర్ణంగా మారిన ఆగంతకుడి శరీరాన్ని చూసి కొల్లీస్ తృప్తిపడి ముందుకు కదిలింది.

ఈ లోపల జేబులోనుండి గ్లవుస్ దేసి చక చక చేతులకు తొడుక్కుని కళ్ళజోడు పెట్టుకున్నాడు పాపారావు. తలుపు మూసేశాడు.

తలుపు చేరుకున్న కొల్లీస్ అది మూసుండటంతో దాని మీద కాట్లు వేస్తూంది!

శబ్దం చేయకుండా మునివేళ్ళమీద నడుస్తూ కొల్లీస్‌ను చేరుకున్నాడు.

అయితే ఆ సవ్వడిని పసికట్టిన కొల్లీస్ చివ్వున వెనక్కి తిరిగి తలెత్తి విషాన్ని పిచికారి చేసింది.

ఆ విషం 5 అడుగుల దూరం అవతల పడింది కానీ పాపారావు ఆరడుగుల దూరంలో ఉండటంతో ప్రమాదం తప్పింది. ఆ విషపు బొట్టు ఒకటి వంటిమీద పడినా చూస్తూండగానే దద్దుర్లు లేస్తాయి.

పాపారావు ఆలస్యం చేయకుండా ఒక్క అంగలో వెళ్ళి కొల్లీస్ తలను ఒడుపుగా పట్టుకున్నాడు.

ఫట్ మంటూ తోకతో వీపుమీద కొట్టింది కొల్లీస్.

చెప్పలేనంత బాధ కలిగింది పాపారావుకి. అయినా లక్ష్యపెట్టకుండా మరోచేత్తో తోకను గట్టిగా పట్టుకుని తెరిచి ఉన్న సూట్ కేస్‌లో కొల్లీస్‌ను పెట్టేసి అమాంతం మూసేసి సూట్ కేస్ లాక్ చేశాడు.

తర్వాత తేలికగా నిట్టూర్చి జేబులో నుంచి ఒక టాబ్లెట్ తీసి నోట్లో వేసుకున్నాడు.

విషాన్ని విరుగుడు చేసే టాబ్లెట్ అది.

అంతసరకూ వేగంగా పరిగెడుతున్న రైలు కొంచెం స్లో అవడంతో కిటికీలోంచి బయటకు చూశాడు పాపారావు.

ఏదో ఊరు దగ్గర పడుతున్నట్లుంది. దూరంగా ఇళ్ళు కనిపిస్తున్నాయి.

తల తిప్పి మళ్ళీ ఆగంతకుడి వంక చూశాడు. విగతజీవుడయి పడి వున్న అతనికి కొంచెం దూరంలో రివాల్వర్ పడి వుంది.

లేచి దాని దగ్గిరకు వెళ్ళి చేతిలోకి తీసుకున్నాడు రివాల్వర్‌ని.

ఒకసారి దానివంక పరీక్షగా చూసి జేబులో వేసుకున్నాడు.

అంతలో రైలు అవుటర్‌లో ఆగింది....సిగ్నల్‌కోసం.

ఒకసారి ఆగంతకుడి జేబులు వెదికి, పర్సును బయటకి తీసి చూశాడు.

కొన్ని వంద రూపాయలనోట్లు ఉన్నాయందులో. వాటిని కూడా జేబులో పెట్టుకుని సూట్‌కేస్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

"వస్తాను మై డియర్ ఫ్రెండ్! గుడ్‌బై" అని మరణించిన ఆగంతకుడికి చెప్పి రైలు దిగాడు పాముల పాపారావు. □

జలుబు ధార





డిగ్రీ పూర్తిచేసిన నేను నిరుద్యోగుల జాబితాలో చేరాను. ఎన్ని ప్రయత్నాలుచేసినా ఉద్యోగం దొరకలేదు. పోనీ, నాకు కూడుపెట్టే పెద్దలు ఎవ్వరూ లేరు. ఉన్న ఒక్క అన్న చదువు చెప్పించి. నా పొట్ట నన్ను పోషించుకో మని చెప్పి ఇంటినుండి తరిమివేశాడు.

నాకు ఈ వ్యవస్థమీద, చుట్టూ ఉన్న మనుషులమీద అసహ్యం పుట్టింది. చిన్నసైజు దొంగగా మారి కొన్ని

దొంగతనాలు చేశాను. అయినా నే నెప్పుడూ పోలీసులకు పట్టుబడలేదు!

ఒకసారి నేను తంజావూరు వెళ్ళడం తటస్థించింది. నేను ఎంత దొంగనయినా కొంత కళాత్మక హృదయం ఉంది. అందుకని తంజావూరులోని పురాతన మ్యూజియానికి వెళ్ళాను.

అక్కడ ఎన్నో కళాఖండాలు ఉన్నాయి. అతి పురాతనమైన శాసనాలు ఉన్నాయి. అన్నిటికన్నా నన్ను ఆకర్షించినది, ఒక అద్దాల బీరువాలో పెట్టి ఉంచిన నాల్గు తాళపత్ర రేకులు. ఆ బీరువా క్రింద ఈ విధంగా వ్రాసి ఉంది—

"ఇవి క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన తాళపత్రాలు (తాటాకు గ్రంథం). ఇందులో కామరూప విద్యనుపొందే శాస్త్రపు వివరాలు పొందుబరచబడి ఉన్నాయి."

అంతే. అది చదివిన దగ్గిరనుండి నా మనసు పని చేయడం ప్రారంభించింది. కామరూప విద్య అంటే మనకు కావలసిన రూపును మనం తలచుకొంటే పొందవచ్చు.

ఇక జీవితంలో నన్ను ఎవరూ పట్టుకోలేరు! ఏ పక్షి రూపమో ధరించి ఎక్కడికయినా ఎగిరిపోవచ్చు!

వెంటనే ఆ తాళపత్రాలు చేజిక్కించుకునేందుకు ఒక మాస్టర్‌ప్లాను తయారుచేశాను. రెండవరోజు కూడా మ్యూజియానికి వెళ్ళాను. మూసేసే సమయానికి ఎవరికీ తెలియకుండా ఒక పెద్ద శిల్పం వెనకాల నక్కి కూర్చున్నాను.

మ్యూజియం టైము అయిపోయింది. అన్ని తలుపులు వేసుకుని మ్యూజియం ఉద్యోగస్తులు వెళ్ళి

పోయారు.

వెంటనే నా వెంట తెచ్చిన నాల్గు ఎండిన తాటాకులు ఆ గ్లాసు బీరువాలో భద్రంగా ఉంచి, బీరువాలో ఉన్న తాళపత్రాలు జాగ్రత్తగా నా పాంటు జోబీలో పెట్టాను.

ప్రొద్దున పదిగంటలకు మ్యూజియం తీశారు.

జనం ఒక్కొక్కరే లోపలికి రాసాగారు. జనంతో కలసి అదను చూసి బయటపడ్డాను. మెల్లగా మద్రాసు చేరుకున్నాను.

ఆ తాటాకులోని మంత్రాలు అనబడే తెలుగు అక్షరాలు చదివాను.

అవి అతిక్లిష్టమయిన మంత్రాలు. ఐదురోజులు వాటితో కుస్తీ పట్టాను.

అయినా నాకేమీ అర్థం కాలేదు.

నాకు జ్ఞానోదయమయింది:

నా పిచ్చి కాకపోతే, ఈ కాలంలో మంత్రాలకు చింత కాయలు రాలతాయా? తీవ్రంగా ఆలోచించాను. ఏది ఏమయినా ఈ తాటాకులు మరలా మ్యూజియానికి చేర్చివేయాలని నిర్ణయించుకొన్నాను. అదీగాక దొంగతనం మానివేసి కనీసం రిక్షా అయినా తొక్కి గౌరవంగా బ్రతకాలని నిశ్చయించుకొన్నాను.

జేబులో అర్థరూపాయి మాత్రమే వుంది. ఎదురుగా వున్న టీ బంకుకు వెళ్ళి టీ ఆర్డరు చేశాను. పక్క బల్ల మీద ఒక తెలుగు న్యూస్‌పేపరులో మొదటిపేజీలో వార్త చదవగానే నా గుండె గుభిల్లు మనింది—

"తంజావూరు మ్యూజియంలో పురాతన తాళపత్రాలు

గల్లంతు _ పోలీసుల వేట ప్రారంభం."

ఆ టీకొట్టు వాడు తెలుగువాడే. వాడు "ఏమిటో సార్. బంగారం, వెండి కొట్టేసినా పరవాలేదు, ఆ పాత తాటాకులు ఆ దొంగ వెధవ ఏం చేసుకొంటాడు సార్?" అన్నాడు,

"అదోరకం పిచ్చి...." అని నేను గబగబ టీ త్రాగి, మళ్ళీ నాదగ్గర ఉన్న తాళపత్రాలు మ్యూజియంకు చేర్చేందుకు ఒక ప్లాను తయారుచేశాను.

ఆ రాత్రి ఎనిమిదిన్నరకు రోడ్డులో నడుస్తున్నాను.

ఒక కుక్కపిల్ల కనబడింది. వెంటనే నా బుర్ర పని చేసింది.

నా దగ్గరున్న తాళపత్రాలను దాని వీపుకి జాగ్రత్తగా కట్టాను.

అలాగే దానిని తీసుకవెళ్ళి ఎవరూ చూడకుండా ఆ వీధి చివరలో ఉన్న ఒక పోలీస్ స్టేషనులో వదిలాను. దూరంగా నిల్చుని అసలు ఏం జరుగుతుందో చూస్తున్నాను.

కుక్కపిల్ల కుయ్....కుయ్....మనసాగింది. లోపలి నుండి ఒక పోలీసు వచ్చాడు. దాని వీపుకి తాటాకులు కట్టి ఉండటం అతనిని ఆశ్చర్యపరిచింది! వెంటనే తమిళంలో మరొక పోలీస్‌ను కేకవేశాడు.

ఇద్దరూ దానిని పట్టుకొన్నారు. మెల్లగా దాని వీపుమీద తాటాకులు విప్పారు.

ఈలోపల సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఎన్‌ఫీల్డులో దిగి స్టేషన్‌లోకి పోతూ వారి హడావిడిని గమనించి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

"ఏం లేదు సార్ ఈ మధ్య తంజావూరు మ్యూజియములో పోయిన తాళపత్రాలు ఈ కుక్కకి కట్టి ఇక్కడ ఎవరో వదలిపెట్టారు" అని చెప్పాడు.

ఇన్స్పెక్టర్ బిగ్గరగా ఒక నవ్వు నవ్వాడు. "పిచ్చి వాళ్ళలారా, అవి ఎవరో కట్టలేదు. అందులో మంత్రాలు చదువుతే కుక్కగానో, పిల్లిగానో, పక్షిగానో మార వచ్చు

ఆ దొంగవెధవ ఆ మంత్రాలు చదివి కుక్కపిల్లగా మారి వుంటాడు! ఆ కుక్కపిల్లను అరెస్టు చెయ్యండి. ఆ తాటాకులు జాగ్రత్తగా మ్యూజియంకు పంపే ఏర్పాటుచేస్తాను" అన్నాడు.

ఇద్దరు కానిస్టేబిల్స్ నోరు తెరుచుకొని చూడసాగారు.

నాకు మతిపోయింది ఇన్స్పెక్టర్ తెలివితేటలకు. □

కళ్ళ డాక్టర్!!



మెడపైన చెయ్యివేసి విసురుగా గెంటారు రాజయ్యను.

ఆ విసురుకు సెల్‌లో ఆ మూల పడ్డాడు రాజయ్య.

‘‘ఒరేయ్ ఎదవ! ఇక్కడ మాదే రాజ్యం. మమ్మల్ని ఎదిరిస్తే నీ శవం కూడా మీ వాళ్ళకు దొరకదు’’ తాళం వేస్తూ హెచ్చరించాడు గార్డ్.

ప్రక్కనే వున్న మరో గార్డు చేతిలో లాఠీతో సెల్

వూచలపై గట్టిగా కొట్టాడు.

ఏమీ ఎదురుచెప్పలేదు రాజయ్య. మాట్లాడితే ఒళ్ళు మరింత చెడిపోవడం తప్ప ఫలితం వుండదని అర్థమైంది అతనికి. అలాగే పడుకుని వుండిపోయాడు. గార్డులు బూట్ల శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయారు. ఆ సెల్‌లోనే వున్న శ్రీనివాసు జాలిగా చూశాడు.

"ఈ ఒక్కరోజే కదా? ఎందుకు గొడవ పడ్డావు?" రాజయ్య ఒంటిపై గాయాలు చూస్తూ ఆందోళనగా అడిగాడు.

"వాళ్ళు నా పెళ్ళాం గురించి తప్పుడుగా కూశారు" ఆయాసపడుతూ చెప్పాడు రాజయ్య.

పెద్దగా నిట్టూర్చాడు శ్రీనివాసు. అతనికి తెలుసు రాజయ్యకు భార్య అంటే ఎంత యిష్టమో. అందుకే, కేవలం భార్యకోసమే తనతో పారిపోయి రావడానికి ఒప్పుకున్నాడు రాజయ్య.

ముప్పయ్యేళ్ళు వుండవచ్చు రాజయ్యకు. అతని భార్య చాలా అందంగా వుంటుంది. పిల్లలు కూడా లేరేమో, భార్యే లోకం రాజయ్యకు.

అస్తమానూ భార్యనే తల్చుకుని బాధపడుతున్న అతనిని చూశాక, శ్రీనివాసు తన పథకం రూపొందించాడు. మొదట పారిపోవడానికి రాజయ్య ఒప్పుకోలేదు. తన భార్యతో ఎక్కడైనా పోయి హాయిగా బ్రతకవచ్చని శ్రీనివాసు నూరిపోశాక ఒప్పుకున్నాడు.

ఈ రాత్రికే పారిపోవడానికి నిర్ణయించుకున్నారు.

చీకటి మెల్లిగా జైలు ఆవరణలోకి ప్రవేశిస్తున్నది.

జైలు గోడలపై వెలుగుతున్న ఫ్లడ్ లైట్లు ఆ చీకటిని పార ద్రోలడానికి ప్రయత్నిస్తున్నాయి. కాపలా గార్డుల బూట్ల చప్పుడు తప్ప యేమీ వినబడటంలేదు.

మెల్లిగా లేచి నిలబడ్డాడు శ్రీనివాసు. రాజయ్యని హెచ్చరిస్తూ సెల్ లో ఒక మూలకు వెళ్ళాడు. అక్కడ మంచినీళ్ళ కూజా వుంది. ఆ నీళ్ళలో చెయ్యి పెట్టాడు. బయటకు వచ్చిన అతని చేతిలో ఒక తాళంచెవి వుంది.

ఈలోగా రాజయ్య ఆ గదిలోనే మరో మూల దాచిన పొడవాటి తాడు భుజానికి తగిలించుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో గార్డు బూట్ల చప్పు డయ్యింది. వెంటనే నేలపై పడుకుండిపోయారు ఖైదీ లిద్దరూ.

గార్డు వరండాలో తిన్నగా వెళ్ళిపోయాడు. వీళ్ళ సెల్ వైపు చూడలేదు. కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న ఆ ఉద్యోగం అతనిలో యాంత్రికత్వాన్ని పెంచింది. అదే తన ఉద్యోగానికి, ఆఖరికి తన జీవితానికి ముప్పు తెస్తుందని అతనికి ఆ క్షణాన తెలీదు.

గార్డు తమ సెల్ దాటగానే లేచారు ఖైదీలు. ఆ గార్డు తిరిగివచ్చేలోగా తమ పని కానిచ్చుకోవాలి.

శ్రీనివాసు తలుపు దగ్గరకు నడిచాడు. తాళంకప్పులో తాళంచెవి వుంచి తిప్పాడు. రాలేదది. మళ్ళీ ప్రయత్నిం చాడు. ఈసారి కూడా రాలేదు.

చెమటలు పట్టేశాయి శ్రీనివాసుకు. రాజయ్య కూడా ఆందోళనగా చూశాడు. వరండాలో వున్న లైటులో తాళం కప్పు పట్టుకున్న శ్రీనివాసు చేతులు క్లియర్ గా కనిపి

స్తున్నాయి. ఏ ఒక్క గార్డు చూసినా చాలు; తమ బ్రతుకులు అంతమైపోతాయి.

తిరిగి గార్డు బూట్లచప్పుడు వినిపించింది. రాజయ్య వేగంగా వెళ్ళి సిమెంటుదిమ్మపై పడ్డాడు. అయితే శ్రీనికాసు కదల్లేదు. మరోసారి ప్రయత్నించాడు. వచ్చేసింది .... చిన్నగా శబ్దం చేస్తూ ఆ తాళం వూడి వచ్చింది.

మెరుపులా తన చేతులను లోపలకు లాక్కుంటూ గోడప్రక్కకు తప్పుకున్నాడు. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. మొహం నుండి ధారగా చెమట కారసాగింది.

తీసివున్న తాళంకప్ప గార్డు చూశాడా? అంటే! ఇక తమ జీవితాలు ఆ జైలులో ఆఖరయిపోతాయి. అయితే గార్డు యిదేమి గమనించలేదు. సూటిగా ముందుకు సాగిపోయాడు.

లేచాడు రాజయ్య. వేగంగా తలుపు దగ్గరకు వెళ్ళాడు. తాళంవేసి, తలుపు తెరిచాడు. యెంత జాగ్రత్తగా తీసినా ఆ పాతకాలపు యినప తలుపు చప్పుడు చేసింది.

వేగంగా పోయి స్తంభాల వెనుక దాక్కున్నారు, ముందుకు పోయిన గార్డు అనుమానంతో వెనక్కు వచ్చాడు. పొంచివున్న పెద్దపులిలా రాజయ్య గార్డుపైకి లంఘించాడు. అతని చేతిలోని తాడు యమపాశంలా గార్డు మెడను చుట్టేసింది.

కాళ్ళు చేతులు తన్నుకున్నాడు గార్డు. వదలలేదు

రాజయ్య. తనను ఒంటరిచేసి హింపించారన్న కక్ష, తన భార్యను అవమానించారన్న కసి అతని చేతులలో ప్రతి ఫలించాయి. శ్రీనివాసు అడ్డుకునేలోగానే ఆ గార్డు విగత జీవుడై పోయాడు.

శ్రీనివాసు ముఖం మ్లానమైంది. జైలునుండి పారి పోయిన వాళ్ళను క్షమిస్తారేమో కాని, గార్డులను చంపి మరీ పారిపోయిన వాళ్ళను క్షమించరు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌శాఖ తమ గూర్చి అహర్నిశలు ప్రయత్నిస్తుంది. కానిస్టేబుల్ నుండి పెద్ద పెద్ద పోలీస్ ఆఫీసర్స్ దాకా తమ గూర్చి వేట ప్రారంభిస్తారు.

అక్కడి నుండి ముందుకు కదిలారు ఖైదీలు. మెయిన్ గేటు వయిపు వెళ్ళలేదు. వెనుక వయివు కది లారు.

ఖైదీలందరూ స్నానాలు చేసే బాత్‌రూమ్‌లు వున్నా యక్కడ. ఒక మూల వుంది ఒక నాపరాయి. దానిని ప్రక్కకు గెంటారు. క్రింద డ్రెయినేజి వుంది. జైలులో వాడిన నీరు ఆ డ్రెయినేజి గుండా బయటకు పోతుంది.

ఒకరి వెనుక ఒకరుగా అందులో దిగిపోయారు ఖైదీ లిద్దరూ. మోకాళ్ళవరకు బురదనీటిలో నడుస్తూ ముందుకు సాగారు. దుర్వాసన వస్తున్న ఆ నీటిలో అలాగే నడి చారు. ఒక పావుగంట తర్వాత జైలుబయట తేలారు.

వెనక్కు చూశాడు శ్రీనివాసు. పాతకాలపు రాజుల కోటలా వుంది ఆ జైలు. వేగంగా ముందుకు నడి చారు.

2

అరగంట తర్వాత ఊళ్ళో ప్రవేశించారు. అక్కడ నుండి చాలా జాగ్రత్తగా నడవసాగారు. తమ జైలు దుస్తులు యెక్కడ వున్నా తమను పట్టిచ్చేస్తాయి. అందుకే యెవ్వరి కంటా పడకుండా జాగ్రత్తగా నడవసాగారు.

దారిలో కనిపించింది ఒక డ్రైక్లీనింగ్ షాపు. లోపలకు నడిచారు. అప్పటికే షాపు మూసివుంది. ఒక మనిషి పడుకుని వున్నాడు. అద్దాల బీరువాలో పెట్టివున్నాయి రక రకాల బట్టలూ. అన్ని రకాల సైజులూ, రంగులూ వున్నాయి.

చప్పుడు కాకుండా రెండు డ్రస్సులు తీసుకున్నారు. మంచంపైని మనిషి కదల్లేదు బట్టలు మార్చుకున్నారు. అయినా కదల్లేదు ఆ మనిషి. మెల్లిగా తలుపువద్దకు నడిచారు. అటువైపు పడుకున్న మనిషి ఇటు తిరిగాడు. ఒక్క దూకులో బయటకు గెంతారు.

అక్కడి నుండి వేగంగా ముందుకు సాగారు. కొంచెం దూరం వెళ్ళాక తెలిసింది తాము చేసిన పొరబాటు. జైలు దుస్తులు ఆ షాపులో వదిలివేశారు. అవి తమ మార్గాన్ని పోలీసులకి చెప్పేస్తాయి.

వెనక్కు వెళ్ళడానికి యిద్దరికీ ధైర్యం చాలడం లేదు. ఈపరికి తాము పారిపోయిన సంగతి తెలిసిపోయి వుంటుంది. త్వరగా వూరు వదలి పోవాలి.

"రాజయ్యా! ఇక నీ దారి నీది, నాదారి నాది. జాగ్రత్తగా పోలీసులకు దొరక్కుండా యే దూరప్రాంతానికో వెళ్ళి బతుకు" చెప్పాడు శ్రీనివాసు.

"అన్నా! నన్ను బయటకు తీసుకువచ్చి స్వేచ్ఛ ఇచ్చావు. నన్ను, నా పెళ్ళాన్ని ఎక్కడికైనా తీసుకువెళ్ళు. పోలీసుల బారినుండి నన్ను కాపాడు." చేతులు పట్టు కుంటూ అడిగాడు రాజయ్య.

సమాధానం చెప్పలేదు శ్రీనివాసు. మౌనంగా నడవ సాగాడు.

"మా ఓనరును చంపి కాజేసిన డబ్బు ఒకచోట దాచా నన్నా! అందులో పదివేలు నీకిస్తా. మమ్మల్ని కూడ ఎటైనా తీసుకెళ్ళు!" తిరిగ తనే చెప్పాడు రాజయ్య.

రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించాడు శ్రీనివాసు. ఆ తర్వాత చెప్పాడు.

"సరే! తొందరగా వెళ్ళిపోవాలి. ఆలస్యమయితే ఇద్దరం దొరికిపోతాం."

ఆనందంగా తల వూపాడు రాజయ్య.

3

ఒక పాడుబడ్డ ఇంటిలోనికి ప్రవేశించారు రాజయ్య, శ్రీనివాసు. ఆ ఇంట్లో ఒకప్పుడు పోస్టాఫీసు వుండేది. ఇప్పుడు ఖాళీగా వుంది. శుభ్రం చేసేవాళ్ళు లేక దయ్యాల కొంపలా వుంది.

ఆ ఇంట్లో ఒక మూల నేల త్రవ్వాడు రాజయ్య. ఎక్కువ శ్రమపడకుండానే ఒక ప్లాస్టిక్ కవరు కనిపిం చింది. దాన్ని జాగ్రత్తగా తెరిచాడు. ఒక చిన్న తాళంచెవి వుంది. దానిని తీసుకుని మరోవైపు కదిలాడు.

అక్కడవుంది ఒక పెద్ద పోసుబాక్స్. ఇనుముదికాదు. సిమెంటుతో చేసింది. దానికి వెనుకవైపు చిన్న తలుపు వుంది. దానికి వున్న చిన్నితాళాన్ని తెరిచాడు రాజయ్య.

"నేను దొంగిలించిన డబ్బు ఇందులో దాచానన్నా! పోలీసులకు దొ...."

రాజయ్య మాట పూర్తికాకుండానే అతని తలపై పిడుగు పడ్డట్లయ్యింది. చివ్వున వెనుదిరిగాడు. మరోదెబ్బ సరిగ్గా ఇందాకటి స్థలంలోనే తగిలింది. మొదలు నరికిన చెట్టులా వాలిపోయాడు రాజయ్య.

గర్వంగా నవ్వుకున్నాడు శ్రీనివాసు. తన ప్లాను సక్సెస్ అయ్యింది. ముందుకు వంగి పోస్టుబాక్సు నుండి డబ్బుమూట తీసాడు.

నేలపై చలనం లేకుండా పడివున్న రాజయ్యవంక చూసాడు. బహుశా చచ్చివుంటాడు. బయటకు నడిచాడు.

రెండు సందులు తిరిగాక ఒక ఇంటిముందు ఆగాడు. మునివేళ్ళతో తలుపుపై తట్టాడు. కాస్సేపటికి తలుపు తెరుచుకుంది. ఒక ఇరవైయేళ్ళ యువతి గుమ్మంలో నిల్చుంది.

"ఎప్పుడు బయటకు వచ్చావు?" ఆదుర్దాగా అడిగింది.

"సీతా! నీ దగ్గిర రాజయ్య నగ దాచాడటకదా? అది పట్రా" చెప్పాడు శ్రీనివాస్.

"రాజయ్యేడి?" అడిగింది సీత.

"ఈసరికి చచ్చిపోయివుంటాడు. తొందరగా రా! పోలీసులు వచ్చేలోగా మనం వెళ్ళిపోవాలి." కంగారుగా చెప్పాడు శ్రీనివాసు.

"ఎక్కడికి?"

"దూరంగా. పోలీసులకు దొరకనంత దూరంగా వెళ్ళిపోదాం."

"నేను రాను. నువ్వు వెళ్ళిపో" చెప్పింది సీత.

"ఏం? ఎందుకురావు?"

"నీతో వుంటే అనుక్షణం భయంతో బ్రతకాలి. నా వాటా నాకు ఇచ్చెయ్. నేను ఒంటరిగా బ్రతుకుతాను"

"నీవాటానా? అసలు నీకు వాటా ఎందుకు ఇవ్వాలి?" కర్కశంగా చూస్తూ అడిగాడు శ్రీనివాసు.

"ఎందు కివ్వాలా?" అరిచేసింది సీత. "నా మొగుడిని దొంగతనానికి పంపించినది నేను కాదా? ఆడు జైలుకుపోతే ఆ డబ్బు రహస్యం నీకు చెప్పింది నేనే కదూ? ఆఖరికి జైల్లో ఒక గార్డ్‌ను మంచి చేసుకుని జైలు మారు తాళం చేయించింది కూడా నేనే కదా? ఇంతా కష్టపడ్డాక నా వాటా నాకు ఇవ్వనంటావా?" అతడి చొక్కా పట్టుకు వూపివేస్తూ ఆవేశంగా అడిగింది.

ఆమెలా ఆవేశపడలేదు శ్రీనివాసు. అతని చేతులు ఆమె మెడచుట్టూ బిగించాడు. ఊపిరి అందటం కష్టమయ్యాక ఆ సంగతి అర్థమయ్యింది సీతకు. విదిలించుకుంది. ఉడుం పట్టులా బిగించాడు శ్రీనివాసు. కనుగ్రుడ్లు వెలుపలకు వచ్చాయి. నాలుక పిడచగట్టుకు పోసాగింది.

అదే సమయంలో తలుపు చప్పుడయ్యింది. సీతను వెనక్కు విసిరికొట్టి, తలుపు లాగాడు. రాలేదు. బయట గొళ్ళెం పెట్టివుంది.

కిటికీ తలుపు తీసి బయటకు చూసాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి బిగుసుకు పోయాడు.

ఆ కాస్త సమయంలో సర్దుకుంది సీత. మెడ రుద్దుకుంటూ వచ్చి శ్రీనివాసు వెనుక నుండి బయటకు చూసింది. ఆశ్చర్యంతో చిన్న కేక వెలువడింది ఆమె కంఠంనుండి.

రక్తసిక్తమైన దుస్తులతో చేతులలో కాలుతున్న ఒక కర్రతో నిలుచుని వున్నాడు రాజయ్య తాటాకులతో తయారైన ఆ ఇల్లు ఒక ప్రక్కనుండి భగభగ మండ సాగింది.

"హాయిగా నౌకరీ చేసుకు బ్రతికే నన్ను, దొంగను చేయటమే కాక, చంపాలనుకున్నావుకదే! నీకు ఆ శ్రీనివాసు గాడికి ఇదే శిక్ష" కసిగా పళ్ళు నూరాడు రాజయ్య.

ఆ మాటలతో చలనం వచ్చింది శ్రీనివాసులో. కంగారుగా తలుపువద్దకు నడిచాడు. భుజంతో తలుపు బాద సాగాడు.

"తలుపు తియ్యి. ఇక్కడ చాలా డబ్బువుంది. అనవ సరంగా తగలబడిపోతుంది" ఆశ చూపింది సీత.

పళ్ళు కొరుకుతూ చేతిలో మండుతున్న కట్టె కిటికీ వైపు విసిరాడు రాజయ్య.

"పోనీయ్! ఆ డబ్బు నీ కోసమే దొంగతనంచేసాను. నీతో పాటే పైకి పట్టుకుపో. నాకు అవసరంలేదు. నేను పోలీసులకు లొంగిపోతాను." గొంతు చించుకుని అరిచి మరీ చెప్పాడు.

శ్రీనివాసు తలుపులు బ్రద్దలు కొట్టాలని ప్రయత్ని స్తూనే వున్నాడు. కాని అప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. అగ్నిదేవుడు తన భార్య స్వాహాదేవితో కలిసి ఆ ఇల్లు ప్రీతిగా ఆరగిస్తున్నాడు.

ఆ ఇంట్లో ఇద్దరూ సజీవదహనంకాక తప్పదని నిశ్చ యించుకున్నాక, గాయపడ్డ శరీరంతో పోలీస్ స్టేషన్‌కు బయలుదేరాడు రాజయ్య. అతని శరీరంతో పాటు మనస్సు కూడా గాయపడింది. □

సీరియల్

వసుంధర

(గత సంచిక తరువాయి)

యువకుల నృత్యం ఆగిపోయింది.

సింహాద్రి తన పని తాను చక చకా చేసుకుని పోతున్నాడు.

"వందనా - వారిలో ఒకరి నెన్నుకో. లేకుంటే అందరూ నీ మీదకు వస్తారు. ఎక్కువ సమయము లేదు. ఊఁ క్విక్" అన్నాడు కుమారస్వామి.

వందన కళ్ళు తెరిచి వెంటనే మళ్ళీ కళ్ళు మూసేసుకుంది.

కుమారస్వామి మరోసారి ఆమెను హెచ్చరించాడు.

"నేనేం చేయాలి?" అంది వందన కళ్ళు తెరవకుండానే.

ఆమె స్వరం ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లుగా ఉన్నప్పటికీ - కుమారస్వామికి వినిపించింది. "నీ దుస్తులు ఒకటొక్కటిగా విప్పి - నీ వెన్నుకున్న ఆ యువకుడి చేతిలో పెట్టు. అంతే నీవు చేయవలసినది...." అన్నాడు కుమారస్వామి.

"ప్లీజ్ - అది నా వల్ల కాదు. నన్ను వదిలిపెట్టండి" అంది వందన స్వరం పెంచి.

"తర్వాత నన్ను తప్పు పట్టొద్దు. గ్యాంగ్ రేప్ జరక్కుండా కాపాడుకోవడం నీ చేతుల్లో ఉంది" అన్నాడు కుమారస్వామి.

జరుగనున్నది వందన వూహించుకుంది.

ఒకటొక్కటిగా తను దుస్తులు విడిచి ఓ యువకుడి కందిస్తూంది. అతడవి దూరంగా విసిరి పరుపుమీదకు వచ్చాడు. తనను నఖశిఖపర్యంతం చూస్తున్నాడు. తర్వాత నెమ్మదిగా తన వంటిమీద చేయి వేశాడు.

వందనకు తనువు పులకరించలేదు. వంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లుందామెకు.

చుట్టూ నగ్నయువకులు....దూరంగా కెమెరామన్....

ఆ పక్కన బైనాక్యులర్స్‌లో ఈ దృశ్యాన్ని చూసే ప్రొడ్యూసర్....

"ప్లీజ్ - నన్నీ గదిలోంచి వెంటనే బయటకు పంపండి" పిచ్చిదానిలా అరిచింది వందన.

ఆమె అక్కణ్ణించి పారిపోవాలనుకుంది కానీ ఎటు వెళ్ళినా యువకులామెను అదిలించి వెనక్కి పంపు తున్నారు.

కుమారస్వామి కొండ్రావుతో - "ఈ దేశపుటాడ పిల్లలకి గుట్టుకాపాడే నాటోటి పెద్దమనుషుల కెలా సహక రించాలో తెలియదు. ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. నువ్వు మళ్ళీ అంకెలు లెక్కపెట్టు. నిమిషంలో చెప్పిందాని కొప్పుకోకపోతే సామూహిక మానభంగం తప్పదు" అన్నాడు.

"అరవై" అన్నాడు కొండ్రావు వెంటనే.

వందన కళ్ళు మూసుకునే ఉంది. బరితెగించడానికీ,

సిగ్గు వదిలిపెట్టడానికీ ఆమెకు కొన్ని పరిమితులున్నాయి. తానేమైపోయినా ఆ పరిమితులు దాటలేదు. ఇప్పుడేం జరుగుతుందీ అని ఆలోచిస్తున్నదామె.

ఆమెకు తన్ను హెచ్చరించిన యువకుడు గుర్తొచ్చాడు. ఆ వెనువెంటనే 'మిస్ మిస్టరీ' గుర్తొచ్చింది.

ఎవరా మిస్ మిస్టరీ? ఆమె ఎక్కడుంటుంది? తానిప్పుడు తల్చుకోగానే వచ్చి రక్షిస్తుందా? తను తల్చుకున్నట్లామె కెలా తెలుస్తుంది?

నలభై రెండు - నలభై ఒకటి - నలభై ...."

"మిస్ మిస్టరీ - నువ్వే నన్ను రక్షించాలి ...." అనుకుందామె.

కొండ్రలావు లెక్క ముందుకు వెడుతోంది-"ఇరవై ఏడు - ఇరవయి ఆరు ...."

కుమారస్వామి అసహనంగా ఉన్నాడు. సెకండ్లు యుగాల్లా గడుస్తున్నాయతడికి.

సింహాద్రి కెమేరాలో యాంగిల్సు చూసుకుంటున్నాడు.

ఆరుగురు యువకులూ తీవ్రమైన కోరికతో ఒకేవైపు చూస్తున్నారు. వారి చూపుల కేంద్రం వందన. ఆమె కళ్ళు మాత్రం మూసుకునే ఉంది.

తొమ్మిది ....ఎనిమిది ....ఏడు ....

"పెళ్ళికిముందే శోభనం. చూడాల్సిన దృశ్యంకదూ?" అన్నాడు కుమారస్వామి.

కొండ్రలావు తలూపుతూనే-"మూడు-రెండు-ఒకటి" అన్నాడు.

* * *

బస్టాండులో అప్పుడే ఓ బస్సొచ్చి ఆగింది.

అందులోంచి దిగారు మాధవరావు, సీతాలక్ష్మి, శ్రీనివాసు.

శ్రీనివాసు భుజానికి ఎయిరు బ్యాగుంది. మాధవరావు చేతిలో చిన్నసైజు వీ ఐపీ సూట్ కేసుంది.

"సరాసరి పెళ్ళివారింటి కెళ్ళొద్దు. హోటల్లో దిగుదాం. ఎందుకంటే సాయంత్రం ఆరింటికొస్తామని వాళ్ళకు త్తరం రాశాం" అన్నాడు మాధవరావు.

"రాస్తే మాత్రం - హోటలుకు డబ్బు తగలేస్తామా? నేరుగా పెళ్ళివారింటికే వెడదాం" అంది సీతాలక్ష్మి.

"బస్సు ప్రయాణంలో బట్టలు నలిగిపోయాయి. ముఖం పిడయిపోయింది. హోటలుకు వెడితే ట్రిమ్‌గా తయారవ్వచ్చు...." అన్నాడు శ్రీనివాసు.

"ఎందుకుట?" అంది సీతాలక్ష్మి చిరాగ్గా.

"బాగుంది - లేకపోతే నేను డాబుగా కనబడొద్దూ...."

సీతాలక్ష్మి కొడుక్కేసి కోపంగా చూసి - "నువ్వు పిల్లను చూస్తావా? పిల్ల నిన్ను చూస్తుందా?" అంది.

"అమ్మా! ఇవి పూర్వపు రోజులు కావు. ఈ రోజుల్లో సెలక్షన్ ఇద్దరిదీనూ" అన్నాడు శ్రీనివాసు.

"అందుకే నిన్ను చచ్చువెధవంటాను. పూర్వకాలపు రోజులు పోయాయని ఎవరన్నారు? నే నడిగిన కట్నం రాబట్టందే నీ పెళ్ళి జరగనిస్తానా?" అంది సీతాలక్ష్మి.

"నేను కట్నానికి వ్యతిరేకిని" అన్నాడు శ్రీనివాసు.

"నోర్ముయ్" అన్నాడు మాధవరావు చిరాగ్గా.

"ఎందుకని?"

"కట్నం వద్దంటే నిన్నింట్లోంచి గెంటేస్తాను. నా

ఆస్తిలో చిల్లిగవ్వ కూడా యివ్వను. నీ పెళ్ళి నువ్వే చేసుకుని - నీ బ్రతుకు నువ్వే బ్రతుకు....'' అన్నాడు మాధవరావు.

“ఏదో సరదాగా అన్నాను నాన్నా! మొదట్నుంచీ ఎప్పుడయినా మీ మాట కాదన్నానా - మీరడిగినంతా కట్నంగా వస్తేనే నా పెళ్ళి!'' అన్నాడు శ్రీనివాసు తగ్గిపోయి.

“ఆ పిల్ల ఫోటో చూసినప్పట్నించీ వీడి మనసు చెదిరిందండీ - నిజంగానే ఫోటో చూస్తూంటే చిదిమి దీపం పెట్టుకునేలాగుందా పిల్ల. అలాగని కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటామా?'' అంది సీతాలక్ష్మి.

మాధవరావేదో అనబోతూండగా సీతాలక్ష్మి భుజం మీదెవరిదో చేయి పడింది.

“ఎవర్రా నువ్వు? నామీద చెయ్యేస్తావు?'' అంది సీతాలక్ష్మి.

“పోలీసు ....పోలీసు ....'' అన్నాడు మాధవరావు కంగారుగా.

“అమ్మా - డ్రస్సు చూసి కంగారుపడ్డావు.... ఈ పోలీసు ఆడపోలీసు.... కంగారుపడకు....'' అన్నాడు శ్రీనివాసు.

“ఆడపోలీసా?'' అంటూ సీతాలక్ష్మి ఆశ్చర్యంగా ఆ వ్యక్తిని చూసింది.

అయిదడుగుల నాలుగంగుళాల ఎత్తున్న ఆ యువతి పోలీసు యూనిఫాంలో కూడా ఎంతో అందంగా ఉంది. ఆమె చేయింకా సీతాలక్ష్మి భుజం మీదే వుంది.

“ఏయ్ అమ్మాయీ - చెయ్యి తీయ్'' అంది సీతాలక్ష్మి.

ఆ యువతి చేయితీసి - "మీరు స్టేషనుకు రావాలి" అంది.

"ఎందుకు?" అన్నాడు శ్రీనివాసు.

"అన్నీ అక్కడే చెబుతాను" అందా యువతి.

"స్టేషనుకి రావడానికి మేమేం తప్పు చేశాం?" అన్నాడు మాధవరావు.

"ఒక పోలీసాఫీసరు వింటూండగా కట్నం తీసుకోవాలని మాట్లాడుకుంటున్నారు. పెళ్ళికి కట్నం తీసుకోవడం చట్టవిరుద్ధం - తెలియదా?" అందామె.

సీతాలక్ష్మి గతుక్కుమని - "నీ ముఖాన బొట్టు లేక పోయేసరికి - మగాడిననుకుని గసిరాను తప్ప నేను పోలీసులతో గొడవ పెట్టుకునేదాన్ని కాదు. మేమేదో సరదాగా మాట్లాడుకుంటున్నాం. అది నువ్వు నిజమనుకుంటున్నావు...." అంది.

"వరకట్నం నిషేధిస్తూ చట్టం వచ్చి ఎన్నో ఏళ్ళయినా ఆ దురాచారం పోవటం లేదు. అందుకే యిప్పుడు ప్రభుత్వం మావంటి పోలీసాఫీసర్లను నియమించింది. ప్రజల్లో కట్నం గురించి మాట్లాడే సరదా పోగొట్టడమే నా ఉద్యోగం" అందా యువతి.

"అయితే యిప్పుడేమంటావమ్మా?" అన్నాడు మాధవరావు.

"మీ మాటల్నిబట్టి మీరు పెళ్ళిచూపుల కెడుతున్నట్లు గ్రహించాను. మీరు నాతోపాటు స్టేషన్‌కొచ్చి మీ వివరాలన్నీ యిచ్చి వెళ్ళాలి. మీరన్న మాటలు సరదాకన్నవనీ - ఈ పెళ్ళిలో కట్నం ప్రసక్తి ఉండదనీ - నాకు కాగితం వ్రాసివ్వాలి. ఆ తర్వాత పెళ్ళయ్యేదాకా కొన్నాళ్ళపాటు

మీ మీద పోలీసు నిఘా వుంటుంది. అన్నీ సక్రమంగా జరిగితే ఏ గొడవా ఉండదు....రండి."

"నువ్వు నిజంగా పోలీసువా - లేక ఆడపెళ్ళివారే నిన్నిక్కడిలా ప్రవర్తించమని పంపించారా?" అంది సీతాలక్ష్మి.

ఆ యువతి వెంటనే తన జేబులోంచి అయిడెంటిటీ కార్డు తీసి శ్రీనివాసు కందించి - "చూసి మీ అమ్మకు చెప్పు" అంది.

శ్రీ వాస్ కార్డు చూశాడు. అందులో ఆమె ఫోటో ఉంది. పేరు ఇంగ్లీషులో Mimy అని వ్రాసి ఉంది.

"మీ పేరు?" అన్నాడతడాశ్చర్యంగా.

"ఇన్‌స్పెక్టర్ మిమి" అందామె. అయిడెంటిటీ కార్డు నతడి నుండి తిరిగి తీసుకుంటూ.

"మిమి - అదేం పేరమ్మా ఏ మతం నీది?" అన్నాడు మాధవరావు.

"మతాలు శరీరానికేగానీ ఆత్మకుండవు...." అందామె.

"పోనీ నీ శరీరానిదేం మతం?"

"చూసి చెప్పుకోండి."

"తెలియకనేగదా అడుగుతూంట...."

"చూస్తే తెలీనప్పుడేమతమైతే మీ కెందుకు?" అంది మిమి.

శ్రీనివాసు కిసుక్కున నవ్వాడు.

సీతాలక్ష్మి అతణ్ణి రహస్యంగా గిల్లి - మందలింపుగా చూసింది.

"మేం స్టేషనుకొచ్చి తీరాలా?" అన్నాడు మాధవరావు.

"రావడం మీకు మంచిది. రాకపోవడం చెడ్డది...."

మారు మాట్లాడకుండా ఆ ముగ్గురూ సామానుతో సహా ఆమె ననుసరించారు.

కాస్త దూరంలో జీపుంది. జీపులో డ్రయివర్ లేడు. ఇనస్పెక్టర్ మిమి డ్రయివర్ స్థానంలో కూర్చుంది. ఆ వెంటనే జీపు బయల్దేరింది.

సీతాలక్ష్మి చిరాగ్గా - "ఇదేం దరిద్రగొట్టు సంబంధమో ఊళ్లో అడుగెట్టగానే పోలీసు స్టేషను చూడాల్సొస్తోంది" అంది.

"ఇష్ - గట్టిగా అరవకు. ఆమె వింటే మూధ నమ్మ కాలక్కూడా సంజాయిషీ యిమ్మంటుంది" అన్నాడు శ్రీనివాసు.

జీపు శరవేగంతో ఓ రెండంతస్థుల భవనం ముందు పోర్టికోలో ఆగింది. మిమి అందులోంచి దిగి "మీ రిక్కడే ఉండండి. కొద్ది క్షణాల్లో మీ రో విచిత్రం చూస్తారు" అంటూ లోపలకు వెళ్ళింది.

గుమ్మం దగ్గరే ఓ మనిషామె నటకాయించాడు.

"అర్జంటుగా కుమారస్వామిని పిల్చుకుని రా. లేకుంటే క్షణాలమీద యిల్లంతా సోదా చేయాలి" అందామె తీవ్రంగా.

ఆ మనిషి భయపడ్డాడు - "అమ్మా అయ్యగారికి మీ రెవరని చెప్పను?"

"ఇనస్పెక్టర్ మిమి...."

"రండి - కూర్చోండి" అన్నాడతడు వినయంగా.

విశాలమైన హాల్లో ఖరీదయిన కార్పెట్ పై నడుస్తూ

ఆమెవెళ్ళి సోఫాలో కూర్చుంది. మెత్తటి ఆ సోఫాలో కాలుమీద కాలేసుకుని వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుందామె.

ఆమె కళ్ళు తెరిచేసరికి ఎదురుగా కుమారస్వామి ఉన్నాడు. అతడు నిలబడే ఆమె వంక తీవ్రంగా చూస్తున్నాడు.

తపోభంగమైన పరమేశ్వరుడిలా ఉన్నాడతడు.

"కూర్చోండి" అంది మిమి.

కుమారస్వామి అంతవరకూ తాను నిలబడి ఉన్న విషయం గుర్తించి ఉలిక్కిపడి ఆమె కెదురుగా ఉన్న సోఫాలో కూర్చుని - "ఎవర్నువ్వు?" అన్నాడు.

"నన్ను చూస్తే తెలియడంలేదా - సిఐడీ ఇన్‌స్పెక్టర్" అందామె.

"ఈ ఊరుక్కొత్తగా వచ్చి ఉంటావు. లేకుంటే నా యింట్లో నా సోఫాలో నా ముందే యిలా కాలుమీద కాలు వేసుకొని కూర్చోవు...." అన్నాడు కుమారస్వామి కోపంగా.

"నేను కొత్తగానే ఈ వూరొచ్చాను. నా గురించి మీకింకా తెలియదు. తెలిస్తే మీకిక కాళ్ళూ చేతులూ ఆడవు...."

"నాతో నీకేమిటి పని?" అన్నాడు కుమారస్వామి.

"మీరిలా వచ్చి కూర్చుంటే వివరంగా చెబుతాను. నెమ్మదిగా చెప్పాలి. గొంతెత్తి మాట్లాడే విశేషం కాదిది"....

ఆమెనే తన దగ్గరకు రమ్మనాలనుకున్నాడు కుమారస్వామి. కానీ ఆమెను దెబ్బతీయాలనుకుని వెళ్ళి పక్కనే

కూర్చుని - "మనసుపడి పక్కకు రమ్మని పిల్చిన ఏ పిల్లనీ కాదనలేదు నేను" అన్నాడతడు.

"ఒక పోలీసాఫీసరుతో యిలా మాట్లాడుతున్నారంటే మీరు బరితెగించిన మనిషిలా కనబడుతున్నారు" అంది మిమి.

"పోలీసాఫీసర్లు నా కాలికింది తొత్తులు. నాతో మాట్లాడటానికి మీ డిపార్టుమెంటునించెవరయినా రావా లంటే - ఆయన ఏ డియస్పీయో, కమీషనరో కావాలి. నేనైతే హోం మినిస్టర్‌తో తప్ప మాట్లాడను" అన్నాడు కుమారస్వామి.

"అయితే ఏమంటారు?"

"నీ పేరు చెప్పు - ఇంకో క్షణంలో సస్పెన్షన్ ఆర్డర్లు తెప్పిస్తాను...."

"నా పేరు మిమి. నా విషయంలో మీరు చేయగలిగింది చూడాలనే ఉంది నా వివరాలన్నీ ఉన్న అయిడెంటిటీ కార్డిస్తాను. ఏం చేయగలరో చూద్దురుగాని...." అంటూ మిమి జేబులోంచి ఓ కార్డుతీసి అతడి కిచ్చింది.

కుమారస్వామి కసిగా ఆ కార్డందుకుని చూసి ఉలిక్కిపడ్డాడు.

అదొక ఫోటో —

అందులో ఆరుగురు యువకులున్నారు. అందరూ నల్లని పాంటు, తెల్లని చొక్కా వేసుకున్న దృఢకాయులు....

"ఈ ఫొటో నీ కెక్కడిది?" అన్నాడు కుమారస్వామి.

"ఫొటోయా? నేను మీ కిచ్చింది అయిడెంటిటీ కార్డు

కాదా?" అంటూ మిమి తన జేబులోంచింకో కార్డుతీసి కుమారస్వామి కందించింది.

కుమారస్వామి విసురుగానే ఆ కార్డందుకుని తెల్ల బోయుడు.

అదింకో ఫోటో!

ఫోటోలో ఓ యువతి!

ఆమె వంటిమీద లంగా మినహాయించి ఇంకేదుస్తులూ లేవు. నగ్నంగా ఉన్న ఆమె వీపును కప్పుతున్న బారెడు జడలోనిండా పువ్వులు కట్టబడి ఉన్నాయి. ఆమె ముఖం కెమేరావైపు లేకపోవడంవల్ల ఫోటోలో ఆమె ఎవరో తెలియడంలేదు.

"ఈ ఫోటో నీకెక్కడిది?" అన్నాడు కుమారస్వామి. ఆయన గొంతులో తీవ్రత తగ్గి రవంత కలవరపాటు ధ్వనిస్తోంది.

"హోం మినిస్టరు గారి నడగండి—చెబుతారు—"

"ఇన్‌స్పెక్టర్ మిమీ!" అన్నాడు కుమారస్వామి గంభీరంగా "ఈ ఫోటోలు నువ్వు నాకెందుకు చూపించావు?"

"అయాంసారీ—అయిడెంటిటీ కార్డు చూపిద్దామంటే యివొచ్చాయి...." అంటూ మిమి జేబులోంచింకో కార్డు తీసి అతడి కందించింది.

ఆ ఫోటో చూసి గుడ్లు తేలవేశాడు కుమారస్వామి.

అందులోకూడా ఇందాకటి యువతే వుంది. ఈసారి ఆమె ముఖం వెనక్కు తిప్పి కెమేరావైపు చూస్తోంది.

ఆ యువతిని గుర్తుపట్టిన కుమారస్వామికి వళ్ళంతా చెమటలు పట్టాయి.

ముఖంలో స్పష్టంగా కన్పించే భయం....

"ఎవరు నువ్వు." అన్నాడతడు. భయం గొంతులో కూడా ధ్వనిస్తోంది.

"ఆ ఫోటోలో అమ్మాయి నేరస్థురాలు. పట్టుబడిన క్షణం నుంచీ నేనెంత ప్రయత్నించినా ఆమె నిజం చెప్పటం లేదు. నిజం రాబట్టాలని ఆఖరి ప్రయత్నంగా ఆమెపై ఆరుగురు మగాళ్ళను ప్రయోగించాలనుకున్నాను. అందుకు నాదగ్గిర వీళ్ళున్నారు. మీరు చూడొచ్చు...." అంటూ మిమి అతడికో కార్డందజేసింది.

ఆ కార్డులో ఆరుగురు మనుషులున్నారు. వాళ్ళు మనుషుల్లా కాక రాక్షసుల్లా ఉన్నారు ఒకడు పర్వతాకారంలా ఉన్నాడు. ఒకడివి కొట్టొచ్చినట్లు కనబడే ఎత్తుపళ్ళు. ఒకడి ముఖంమీద కత్తిగాటు. ఒకడివి శరీరంలో గగుర్పాటు కలిగించే బుర్రమీసాలు—ఒకడిది తళతళ మెరిసే నున్నటి గుండు. మరొకడి ముఖమంతా కాలిన మచ్చలు.

కుమారస్వామి ఆ ఫోటో నే చూస్తున్నాడు.

మిమి చెప్పుకుపోతోంది "వీళ్ళ నామెపై ప్రయోగిస్తే రాక్షసుల్లా ప్రవర్తించి ప్రాణాలు తీస్తారు తప్ప ఆమెచేత నిజం చెప్పించలేరని నా కనిపించింది. ఈలోగా మీదగ్గిర నాకు పనికొచ్చే యువకులున్నట్లు సమాచార మందింది. ముందుగా మీరు చూసిన ఫోటో అదే! ఆ ఆరుగురినీ తాత్కాలికంగా నా కప్పజెప్పమని మనవి చేసుకుందుకు వచ్చాను. మీరు కాదంటే ఈ రాక్షసులనే ఆమెపై ప్రయోగించాల్సి ఉంటుంది. అయితే వ్యవహారం అంత వరకూ రాకుండా మీరు సహకరిస్తారని నాకు నమ్మక ముంది...."

కుమారస్వామి రెండు ఫోటోలనూ తదేకదీక్షతో చూస్తున్నాడు.

ఒక ఫోటోలో యువతి జాలిగా తనవంక చూస్తోంది.

రెండో ఫోటోలో రాక్షసుల్లాంటి మనుషులు....

"నాకెంతో వ్యవధి లేదు...." అంది మిమి.

కుమారస్వామి తలెత్తి ఆమెవంక చూసి—"నీకేం కావాలో చెప్పు" అన్నాడు. అసహాయత అతడి గొంతు మధ్య నిలిచింది.

"వందన" అంది మిమి చటుక్కున. ఆమె కళ్ళు నిళ్ళ లంగా ఉన్నాయి.

కుమారస్వామి ఉలిక్కిపడి "వందన యిక్కడుందని నీకెవరు చెప్పారు?" అన్నాడు.

"హోమ్ మినిస్టర్!"

కుమారస్వామి ముఖం పాలిపోయింది. స్వరం బాగా తగ్గించి "వందనను వదిలిపెడితే నా కూతుర్ని వదిలిపెడతావా?" అన్నాడు.

"మీ కూతురా—ఆమె ఎవరు?" అంది మిమి ఆశ్చర్యంగా.

"నీకు తెలియకుండా ఈ ఫోటోను నాకు తెచ్చిచ్చేవా?"

"ఈ ఫోటోలో అమ్మాయి మీ అమ్మాయా? నమ్మలేను...."

"నీకన్నీ తెలుసు...." అన్నాడు కుమారస్వామి. అతడు ఏడుపొక్కటే తక్కువన్నట్లు మాట్లాడుతున్నాడు.

"మీ అమ్మాయైతే నేరస్థురాలెందుకవుతుంది?" అని ఓ

క్షణ మాలోచించి "ఓహ్ – తండ్రి తప్పులు కూతుర్ని నేరస్థురాల్ని చేశాయన్నమాట" అంది మిమి.

"వందనను నీ కప్పగిస్తాను. నా కూతుర్ని నాకు భద్రంగా అప్పగిస్తావా?"

"తండ్రి నేరాలు కూతుర్ని నేరస్థురాలిని చేసినపుడు- తండ్రి తప్పు సవరించుకుంటే—కూతురూ రక్షించబడాలి. కుమారస్వామిగారూ! భగవంతుడు మీకు కూతుర్నిచ్చి వందనకు గొప్ప ఉపకారం చేశాడు" అంది మిమి.

"మాట తప్పవుకదూ!" అన్నాడు కుమారస్వామి.

"ఎందుకు తప్పుతాను? మీరు హోం మినిస్టరుతో చెప్పి నన్నేం చేయిస్తారో నన్న భయం నాకుండనే వుంది...." అంది మిమి.

కుమారస్వామి మాట్లాడకుండా లేచి నిలబడ్డాడు.

"ఒక్కమాట – ఆమె పెళ్ళికూతురి అలంకరణలో బైటకు రావాలి...." అంటూ మిమి సోఫాలో వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుంది. ఆమె కళ్ళు తెరిచేసరికి— ఎదురుగా ఓ పెళ్ళికూతురుంది.

"నువ్వేకదూ – వందనా!" అంది మిమి.

వందన తలూపింది. ఆమె కళ్ళనిండా నీళ్ళున్నాయి.

ఓ గొప్ప అవమానం నుంచి తప్పించుకుని బైటపడిన అనుభూతి ఆ కన్నీళ్ళ మరుగున పడిపోయింది.

"నేను – ఇన్‌స్పెక్టర్ మిమి. నీకోసం వచ్చాను. నాతో పద!" అంటూ లేచి నిలబడింది మిమి.

వందన చటుక్కున ఆమె పాదాలకు వంగి నమస్కరించి లేచింది.

"కుమారస్వామిగారూ – సెలవు!" అంటూ మిమి

వందన భుజాలమీద చేయివేసి బైటకు నడిచింది.

బైట జీపులో సీతాలక్ష్మి కిచకిచలాడిపోతోంది. మాధవ రావు గిజగిజలాడిపోతున్నాడు. వారి కిచకిచలూ, గిజ గిజలూ శ్రీనివాసుని అయోమయంలో పడేస్తున్నాయి.

మిమి వందనను వారికి పరిచయం చేస్తూ "మీరు చూడాలనుకుంటున్న పెళ్ళికూతురు వందన ఈమె! ప్రత్యే కాలంకరణ కోసం తలిదండ్రులిక్కడకు పంపారు. పెళ్ళి చూపులు ప్రత్యేకంగా జరగాలని నేను మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చాను. కాసేపు వధూవరులను పరస్పరం ఏకాం తంగా మాట్లాడుకోనివ్వండి! ఇంట్లో అయితే సాధ్యపడని విశేషమిది!" అంది.

శ్రీనివాసు వందనను కళ్ళప్పగించి చూస్తున్నాడు.

అనుకోని ఈ సంఘటనకు తెల్లబోయినా వందన అప్ర యత్నంగానే తలవంచుకుంది.

మిమి బలవంతంమీద వధూవరులిద్దరూ దూరంగా వెళ్ళి కాసేపు మాట్లాడుకుని వచ్చారు.

తర్వాత మిమి పెళ్ళివారినీ, పెళ్ళికూతుర్నీ—ఆడపెళ్ళి వారింట దిగబెట్టి కట్నం గురించి మాధవరావును మరో సారి హెచ్చరించింది.

పెళ్ళికూతురి అలంకరణలో పోలీసు జీపులోంచి దిగిన కూతుర్ని చూస్తూ తెల్లబోయింది వందనతల్లి.

ఆమెతోపాటే మగపెళ్ళివారు దిగడం చూసి విస్తు బోయాడు వందన తండ్రి.

మిమి వందన దగ్గిర సెలవుతీసుకుంటూ—"ధైర్యంగా ఉండు. వరుడు నీకు నచ్చితే ఈ పెళ్ళి జరిగి తీర్తుంది—" అని వెళ్ళిపోయింది.

మగపెళ్ళివారి ద్వారా జరిగినది విన్న వందన తల్లి— "ఇవి జరిగే పెళ్ళికాదు—" అనుకుంది.

వందనకు కుమారస్వామింట్లో పెళ్ళికూతురి అలంకర ణెలా జరిగిందో వందన యింట్లో ఎవరికీ అర్థంకాలేదు. ఎంతడిగినా వందన ఎవరికీ చెప్పనూలేదు.

నిజం చెప్పడం యిష్టంలేకా, అబద్ధం కల్పించే సత్తా మెదడుకు లేకా—వందన ఎవరేమడిగినా నవ్వి ఊరు కుంది.

10

పార్వతి తలుపు తీయగానే— "నా పేరు ఇనస్పెక్టర్ మిమి—" అందామె.

"మా యింట్లో పోలీసులకు పనేమిటి?" అంది పార్వతి కంగారుగా.

"మీ యింట్లో శ్రావణ్ ఉన్నట్లు తెలిసింది నాకు—" అందామె.

"శ్రావణ్ ఎవరు?" అంది పార్వతి ఏమీ ఎరుగ నట్లు.

"వాడొక హంతకుడు...." అంది మిమి.

"హంతకుడా? మా యింట్లో హంతకులెవరూ లేరు!" అంది పార్వతి.

"ఫలానావాడు హంతకుడని ఎవరి ముఖంమీదా రాసుండదు. ఒకసారి మీ యిల్లు సోదా చేయాలి...." అంది మిమి.

"చూడమ్మా — యింట్లో మగాళ్ళు లేనప్పుడు నువ్విలా జబర్దస్తీ చేయడమేమీ బాగోలేదు...." అంది

పార్వతి.

"మగాళ్ళులేరని తెలిసే—ఆడదాన్ని నే నొచ్చాను. అయినా ఇందులో జబర్దస్తీ ఏముంది? చట్టానికి సాయ పడడం పౌరుల బాధ్యత. తెలిసి నేరస్థులను దాచడం మీ నేరమవుతుంది!" అంది మిమి.

పార్వతి పక్కకు తప్పుకుని మిమిని లోపలకు రానిచ్చింది.

మిమి లోపలకు రాగానే తనే తలుపులు వేసింది.

"తలుపు లెందుకేస్తున్నావ్?" అంది పార్వతి.

"మీతో కాసేపు మాట్లాడాలి...."

"అయితే?"

"ఆ సమయంలో మనకు తెలియకుండా ఎవరూ లోపలకు రాకూడదు...."

ఇద్దరూ గదిలో చెరో కుర్చీలో కూర్చున్నారు.

"శ్రావణ్ ఇక్కడకు వచ్చాడు కదూ!" అంది మిమి.

"శ్రావణ్ ఎవరో నాకు తెలియదు —" అంది పార్వతి.

"మీ యింట్లోకి కొత్తదంపతు లద్దెకొచ్చారని తెలిసింది. ఎవరువాళ్ళు?"

చెప్పాలో చెప్పకూడదో తెలియక పార్వతి మాట్లాడ లేదు.

"ఎవరు వాళ్ళు?" రెట్టించింది మిమి.

"ఎవరో నాకేం తెలుస్తుంది?"

మిమి పార్వతివంక సానునయంగా చూసి— "శ్రావణ్ విషయం మీకు సరిగా తెలియదు. అతడికి మీ

రాశ్రయమిస్తే ఏదో ఒకరోజున మిమ్మల్నే నిలువునా హత్య చేయగలడు....'' అంది.

"నిజంగా నాకా శ్రావణ్ ఎవరో తెలియదు!''

"శ్రావణ్ తన భార్యను నిలువునా హత్యచేశాడు....'' అంది మిమి.

పార్వతి భయపడుతున్నదానిలా— "పోనీ నీ దగ్గిర ఆ శ్రావణ్ ఫొటో ఉందా?'' అంది.

"నా దగ్గిర వాడి ఫొటో ఎందుకుంటుంది? వాడి ఆన వాలేం కనబడ్డా మరుక్షణం నాశనం చేసేస్తాను నేను....'' అంది మిమి.

"పోలీసినస్పెక్టరువి—నీకంత ఆవేశముండకూడదు—'' అంది పార్వతి.

"ఆవేశం లేకుంటే మేము హంతకులను పట్టలేము''- అంది మిమి.

ఆమెను చూస్తూంటే పార్వతికి జాలేసింది. శ్రావణ్ తమ యింట్లోనే ఉన్నట్లు చెప్పేద్దామా అనిపించింది. కానీ— చెబితే శ్రావణ్ అరెస్టవుతాడు. తనింట్లో ఉండ డిక.

"మా యింట్లో ఉంటున్నతడు శ్రావణ్ అనుకోను. నువ్వు శ్రావణ్ వివరాలు చెప్పగలవా?'' అందామె.

"సన్నగా, పొడుగ్గా ఉంటాడు....''

మిమి ఇంకా ఏదో అనబోతూంటే—"అబ్బే—మా యింట్లో ఉంటున్నతడు లావుగా, పొట్టిగా ఉంటాడు....'' అంది పార్వతి.

"అతడు పేరేం చెప్పాడు?''

"ఏమో—నేనడగలేదు. మా వారికి తెలుసు. ఆయ

వింట్లో లేరు....''

''అతడి భార్య ఇంట్లోనే ఉందా?'' అంది మిమి.

''ఉందనుకుంటాను. కానీ జబ్బు మనిషో ఏమో— పడుకున్నట్లుంది. ఎక్కడా అలికిడి లేదు.'' అంది పార్వతి.

''ఆమెతో ఓసారి మాట్లాడాలి....'' అంది మిమి.

పార్వతికప్పుడు శ్రావణ్ మాటలు గుర్తుకొచ్చాయి.

ఈమె నిజంగా శ్రావణ్ చెప్పినట్లే —అతడిపైనా భార్య పగ తీర్చుకునేందుకు వస్తే—తానొక్కర్తీ ఏం చేయగలదు?

''ఆమెతో మాట్లాడాలంటే అతడున్నప్పుడు రామ్మా - ఎందుకొచ్చిన గొడవ?'' అంది పార్వతి.

మిమి కళ్ళలో అనుమానం తొంగిచూసింది— ''మీ రెందుకో కప్పదాటు వేస్తున్నారు—'' అందామె.

పార్వతి నవ్వి ఊరుకుంది.

''నేను బలవంతంగా ఒకరింట్లో దూరే మనిషినికాను. శ్రావణ్ ఈ యింట్లోనే ఉన్నాడని నా అనుమానం. చుట్టుపక్కల వాకబు చేయగా నాకు తెలిసిన వివరాలు నా అనుమానాన్ని బలపరుస్తున్నాయి. అందుకే మీకో విషయం చెబుతాను. అది మీ యింట్లో అద్దెకుంటున్నతడికి చెప్పండి—'' అంది మిమి.

''ఏమిటది?'' అంది పార్వతి కుతూహలంగా.

''శ్రావణ్ కారణంగా చచ్చిన యువతి దెయ్యమై అతడికోసం వెతుకుతోంది. అతడి అంతు చూసి తీరుతుంది....'' కసిగా అంది మిమి.

ఆ మాటలు వినగానే పార్వతి శరీరం జలదరించింది.

అది గ్రహించి మాట మార్చడానికా అన్నట్లు — "నాకు కాసిని మంచినీళ్ళిస్తారా?" అంది మిమి.

"తప్పకుండా—" అంటూ పార్వతి లోపలకు వెళ్ళింది.

ఆమె మనసు నిండా ఎన్నో ప్రశ్నలు....

శ్రావణ్ హంతకుడా?

అతడి కోసం దెయ్యం ఈ యింటి కొస్తుందా?

పోలీసు వేషంలో వచ్చిన యువతి నిజంగా పోలీసులేనా లేక శ్రావణ్‌పై పగబట్టిన ప్రేమికురాలా?

మంచినీళ్ళ గ్లాసులు వంటింట్లో వాష్‌బేసిన్లో ఉండిపోయాయి పార్వతి ఓ గ్లాసులోంచి మంచినీళ్ళు పట్టి తెచ్చేసరికామెకు కనబడలేదు.

"ఇన్‌స్పెక్టరమ్మాయ్....ఇన్‌స్పెక్టరమ్మాయ్........" అంటూ గట్టిగా పిలిచిందామె.

బదులు రాలేదు.

వీధి తలుపులవైపు చూస్తే అవి గడియ వేసి వున్నాయి.

అంటే మిమి బైటకు పోలేదు.

ఏమైందామె?

అప్పుడు పార్వతి కనుమానం వచ్చింది. మంచినీళ్ళు వంకపెట్టి తన్ను లోపలకు పంపించి—ఆమె శ్రావణ్ యింట్లో దూరలేదు గదా!

పార్వతి మంచినీళ్ళ గ్లాసుతో ఆ వాటావైపు వెళ్ళింది.

అంతవరకూ మూసివున్న ఆ వాటా తలుపులు తెరిచి ఉన్నాయి.

"ఇన్‌స్పెక్టరమ్మాయ్....ఇన్‌స్పెక్టరమ్మాయ్........" అంటూ పార్వతి లోపలకు వెళ్ళింది.

ఎక్కడా అలికిడిలేదు.

"ఇన్‌స్పెక్ట రమ్మాయ్—...." అంది పార్వతి మళ్ళీ.

బదులు రాలేదు.

పార్వతి ఆ వాటా అంతా తిరిగి చివరకు పడగ్గదిలో ప్రవేశించింది.

పడగ్గదిలో మంచంమీద బోర్లాపడుందో యువతి. ఆమె వీపుల పిడిదాకా దిగివుందొక కత్తి. రక్తమింకా ధారగా కారుతోంది.

ఆ యువతి కదలడంలేదు.

"హత్య!" అనుకుంది పార్వతి.

అంటే శ్రావణ్ శత్రువు పోలీసు వేషంలో వచ్చి సంధ్యను హత్య చేసింది.

ఇది గ్రహించగానే పార్వతికి నరనరాల్లోంచీ వణుకు పుట్టుకొచ్చింది.

ఆ ఇన్‌స్పెక్టరమ్మాయ్ హంతకురాలు తనామెను చూసింది. ఆమె చేసిన హత్యను కూడా చూసింది.

హంతకులు సాక్ష్యాలుంచరు.

ఆమె తనను కూడా హత్య చేస్తుందా?

భయంతో పార్వతి ఆపాదమస్తకం వణికిపోయింది.

ఆమెకు తెలుసు ఆ అమ్మాయి బైటకు వెళ్ళ లేదని — అంటే యింట్లోనే యెక్కడో వుంది. కావీ

యెక్కడ;

బయటకు వెళ్ళే దారులన్నీ లోపల్నుంచే మూసి ఉన్నాయి. ఆమె బైటకు వెళ్ళే అవకాశం లేదు. ఇంట్లో కనబడదు, మరామె ఏమైంది?

అప్పుడు పార్వతి కామె మాటలు గుర్తుకొచ్చాయి.

శ్రావణ్ కారణంగా చచ్చిన యువతి దెయ్యమై తిరుగుతోందనీ—అతడి కోసం వెతుకుతోందనీ— అతడి అంతు చూసితీరుతుందనీ అందామె.

ఇప్పుడొచ్చిన యువతి ఆ దెయ్యం కానీ కాదు గదా!....

ఈ ఆలోచన రాగానే పార్వతి చటుక్కున ఆ గది లోంచి బయటకు వచ్చి—ఆ వాటా తలుపులు దగ్గరగా వేసింది.

మంచినీళ్ళ గ్లాసింకా ఆమె చేతిలోనే ఉంది. పార్వతి గటకటా ఆ గ్లాసుడు నీళ్ళూ తాగేసింది.

ఇంట్లో యిప్పుడు తనూ, ఓ శవం, ఓ హంతకురాలో లేక దెయ్యమో ఉన్నారు. ఏం చేయడానికీ ఆమెకు పాలు పోవడంలేదు.

బయటకు వెళ్ళి నలుగుర్నీ పిలద్దామంటే—హత్యకు మొదటిసాక్షిగా పోలీసులు తననే అనుమానిస్తారు. అసలు హత్య గురించి తన కేమీ తెలియనట్లుంటే మంచిది కదా!

ఒకవేళ సంధ్యలో ప్రాణ ముందేమో—యే డాక్టరైనా పిలిస్తే....

కానీ ఆ దెయ్యమింకా యింట్లోనే ఉంది. అది తనమీద పగబట్టి ఏమైనా చేస్తే....

ఎటూ తేల్చుకోలేక పోతోందామె. భర్త తొందరగా వస్తే అతడితో సంప్రదించి కర్తవ్యం నిర్ణయించవచ్చు ననుకుందామె.

అందుకని కర్తవ్యాన్ని వాయిదావేసి మంచినీళ్ళ గ్లాసును బల్లమీద పెట్టి—పడకగదిలో మంచమెక్కి పడు కుందామె. బయట ఉక్కగా ఉన్నప్పటికీ ఆమెకు చలి వేస్తూండడంవల్ల దుప్పటి తీసి కప్పుకుంది.

కళ్ళు మూసుకుంటే ఇన్‌స్పెక్టరమ్మాయి వికృతా కారంతో దెయ్యంలా భయపెడుతోంది. కళ్ళు తెరిస్తే కంటికి కనబడే ప్రతి కదలికలోనూ దెయ్యం స్ఫురి స్తోంది. ఆలోచనలో—లోపలికొచ్చిన ఇన్‌స్పెక్టర్ మిమి యేమయి పోయిందీ అన్న అనుమాన మామెను వేధి స్తోంది.

పార్వతికి తను నిద్రపోతోందో, మెలకువగా ఉందో తెలియదు. కాసేపు కళ్ళు తెరుస్తోంది. కాసేపు మూస్తోంది.

అలా యెంతసేపు గడిచిందో ఆమెకు తెలియదు. గడిచిన ప్రతిక్షణమూ ఒక యుగమే ఆమెకు....

చివరికామె ఒంటరితనాన్ని ఛేదించడానికా అన్నట్లు కాలింగ్ బెల్ మ్రోగింది.

ఆ మ్రోత పార్వతిలో లేని ఉత్సాహాన్ని సృజించింది. వచ్చింది తన భర్తే అయుండాలనీ—అతడితో తన అను భవాన్ని పంచుకుని ఏడ్చేయాలనీ అనుకుందామె.

ఆమె దుప్పటిలోంచి క్షణంలో బైటపడింది. చకచకా చీర సవరించుకుంది.

ఒక్క పరుగున వెళ్ళి వీధి గదితలుపు తీసింది.

తలుపు తీస్తూ—యింకా గడియ వేసే వుందంటే ఆ యిన్ స్పెక్టరమ్మాయి యింట్లోనే ఉండివుండాలనుకుం దామె.

అయితే పార్వతి ఆశించినట్లు బైట నిలబడ్డది ఆంజ నేయులు కాదు.

శ్రావణ్....

అతడి పక్కనే మరో యువకుడు. ఆ యువకుడి చేతిలో చిన్న బ్రీఫ్ కేసు వుంటిదుంది.

"సంధ్యకు వంట్లో బాగుండడం లేదు. డాక్టర్ని తీసు కొచ్చాను—...." అంటూ శ్రావణ్ లోపలకు ప్రవేశిం చాడు.

నోట మాటరాలేదు పార్వతికి.

ఇప్పుడేం జరుగుతుంది?

ఆ ఇన్ స్పెక్టరమ్మాయి మనిషి కావచ్చు....దెయ్యం కావచ్చు.....

ఆమె శ్రావణ్ కోసం పొంచి ఉంటుంది.

లోపల సంధ్యను చూసి గుర్తుపట్టి చంపేసింది. ఆ తర్వాత శ్రావణ్ కోసం యింట్లోనే మాటేసింది.

ఇప్పుడు శ్రావణ్ యింట్లోకి వెడితే కూడా డాక్టరుం డడం కొంతవరకూ మంచిది. డాక్టర్ వెళ్ళేదాకా బహుశా ఆమె అతడి జోలికి వెళ్ళదు.

కానీ వాళ్ళిద్దరూ హత్యను చూసి—తన్ను సంజాయిషీ అడిగితే....

తనకేమీ తెలియదని బుకాయించాలి. వారు తనను నమ్మాలంటే యేమీ జరగనట్లే మామూలుగా వుండాలి తను....

పార్వతి అదృష్టం కొద్దీ శ్రావణ్ తన హడావుడిలో తా నున్నాడు. ఆమెను పెద్దగా పట్టించుకోకుండానే అతడు డాక్టర్ని వెంటబెట్టుకుని తన వాటాలోకి వెళ్ళాడు.

కొద్ది క్షణాల్లో ....

"సంధ్యా!" అన్న పెద్ద కేక ఆ యిల్లంతా ప్రతిధ్వని స్తూండగా పార్వతి గట్టిగా చెవులు మోసుకుని కుర్చీలో కూర్చుండిపోయింది. అప్రయత్నంగా ఆమె కళ్ళు మూతలు పడ్డాయి.

వెంటనే వికృతంగా నవ్వుతున్న యిన్స్పెక్టర్ మిమి ....

ఆమె చేతిలో కత్తి.... ఆ కత్తినిండా రక్తం....

మిమి ముందుకు వస్తోంది. ఆమె గురి పార్వతి గుండె....

"వద్దు...." అంటూ పార్వతి కళ్ళు తెరిచింది.

ఆమె యెదురుగా శ్రావణ్........అతడి చూపుల్లో క్రూరత్వం.

"నిజం చెబుతున్నాను. నాకేం తెలియదు—" అంది పార్వతి.

శ్రావణ్ ఆమెను సమీపించి—"అదేమిటి? మీ రలా వణికిపోతున్నారు? ఏమయింది మీకు....?" అన్నా డాశ్చర్యంగా.

అతడి మాటల్లో ఆశ్చర్యంతో కూడిన మృదుత్వం కూడా ఉంది.

కోపం, ఆవేశం స్థానంలో ఆశ్చర్యం నెలకొన్న అతడి గొంతు విని పార్వతి క్షణకాలంపాటు ధైర్యాన్ని పుంజు

కుని అతడి ముఖంలోకి చూసింది.

అతడి కళ్ళలో ఆమె ఊహించుకుంటున్న క్రూరత్వం లేదు. అయినప్పటికి "నన్ను నమ్మ. నిజంగా నా కేమీ తెలియదు" అంది పార్వతి.

"మీరేమంటున్నారో నాకు తెలియడంలేదు" అన్నాడు అతడు.

"సంధ్య గురించి" సగంలో మాట ఆపేసిందామె.

శ్రావణ్ నవ్వి "సంధ్య ముభావం మనిషి. ఎవరితోటీ ఎక్కువగా మాట్లాడదు. ఆమె కనారోగ్యంగా ఉంటే మీ కేమీ తెలియలేదని బాధపడకండి. ఆమె ఆరోగ్యం చూసు కోవడం నా బాధ్యత...." అని "ఇంట్లో కాఫీపొడి లేదు. డాక్టరుగారికి కాఫీ కావాలి...." అన్నాడు.

ఒకమూల భార్య చచ్చిపడుంటే—డాక్టరు కాఫీగురించి మాట్లాడుతాడేమిటీ అనుకుంది పార్వతి. అయినా తనే బయటపడడ మెందుకనుకుని "సంధ్య కెలా ఉంది?" అంది ఏమీ ఎరుగని దానిలా.

"సంధ్యకేం—నిక్షేపంలా గుంది" అన్నాడు శ్రావణ్.

"మరి—నువ్వేగా అనారోగ్యమన్నావు...."

"అదా—మానసిక బలహీనత వల్ల అలా జరుగుతూ వుంటుంది మా కాపురం చక్కబడి — మేము నలుగురి లోనూ ధైర్యంగా మసలగలిగిన నాడు సంధ్యకేజబ్బూ ఉండదు. ప్రస్తుతం — అప్పుడప్పుడు కళ్ళు తిరుగు తూంటాయి. మానసికమని తెలిసీ డాక్టర్ని పిలుచు కొచ్చాను."

"అంటే సంధ్యకేమీ కాలేదా?"

"లేదు—రండి—చూద్దురుగాని...."

పార్వతి ఆత్రుతగా శ్రావణ్ ననుసరించి వెళ్ళింది.

ముందుగదిలోనే డాక్టరుతో మాట్లాడుతోంది సంధ్య. అప్పుడామె ముఖంపై ముసుగులేదు.

చూస్తూనే సంధ్యను గుర్తు పట్టింది పార్వతి. అయితే....

ఎప్పుడూ ముభావంగా కనబడే సంధ్య అప్పుడు చలాకీగా వుంది.

ఇందాకా తను చూసినప్పుడు ఆకుపచ్చని చీర అదే రంగు రవిక రెండు జడలు జడలో ఆకుపచ్చ రంగు రిబ్బన్లు....

ఎటొచ్చీ ఆమె అప్పుడు మంచంమీద బోర్లాపడి ఉంది.

ఆంత భయం, కంగారులోకూడా పార్వతి కామె వేష ధారణ గుర్తుండిపోయింది. దాంతోపాటే ఆమె వీపులో కత్తి....ధారగా కారుతున్న ఎర్రటి రక్తంకూడా ఆమెకు గుర్తుండిపోయాయి.

ఆ సంధ్యలో చలనం లేదు.

ఇప్పుడు చలనమున్న ఈ సంధ్యకూడా అదే ఆకుపచ్చ చీర—అదే రవిక—అవే జడలు—అవే రిబ్బన్లు....

సంధ్య లేచి నిలబడి పార్వతికి నమస్కరించి "రండి, కూర్చోండి" అంది.

సంధ్య ముభావంగా ఉండడమే తప్ప ఎప్పుడూ ఆమెను పలకరించలేదు. వచ్చి వారం రోజులైనా—రండి, కూర్చోండనడం అదే మొదటిసారి!

పార్వతి కూర్చోలేదు. ఏదో పనున్నట్లు సంధ్య వెనక్కు వెళ్ళింది.

స్టూలుమీద కూర్చున్న సంధ్య వీపామెకు స్పష్టంగా కనబడుతోంది. అక్కడ ఎర్రని చారగానీ, కత్తిగానీ లేదు.

ఆ ప్రాంతమంతా స్ఫటికంలా మెరిసిపోతోంది తప్ప అక్కడ చిన్న పుట్టుమచ్చకూడా లేదు.

"కూర్చోండి" అంది సంధ్య మళ్ళీ.

"కూర్చుంటానమ్మా - ముందు డాక్టరుగారికి కాఫీ తెచ్చి...." అని అక్కణ్ణించి వెడుతూ ఆమె శ్రావణ్‌కు సైగచేసింది.

శ్రావణ్ ఆమె ననుసరించి వెళ్ళాడు.

"సంధ్యకేమీ కాకపోతే—నువ్వింట్లో అడుగుపెడు తూనే - సంధ్యా అంటూ పెద్దగా కేకపెట్టావేం?" అంది పార్వతి.

"నేనేమీ కేకపెట్టలేదే! మామూలుగా పిలిచానంతే" అన్నాడతడు.

"సరే నేవెళ్ళి కాఫీ కలిపి తెస్తాను. నువ్వెళ్ళు...." అందామె.

శ్రావణ్ వెళ్ళిపోయాడు.

పార్వతికి గుర్తొస్తుంది. అతడు మామూలుగానే సంధ్యా అంటూ పిలిచాడు. తన భయం, అనుమానం ఆ పిలుపును కేకగా మార్చాయి.

అతడి కేక నిజంగా కేకకాదు. తన ఊహ సృష్టించిన భ్రమ!

"ఎంత పిచ్చిదాన్ని! ఎంత పిరికిదాన్ని!" అనుకుంది పార్వతి.

కాఫీ కలుపుతూంటే ఆమెకు ఇనస్పెక్టర్ మిమి రావడం

కూడా తన భ్రమ కాదు గదా అన్న అనుమానం వచ్చింది.

శ్రావణ్ తనకు రానున్న ప్రమాదాలు చెప్పాడు. అవన్నీ విని - తను లేనిపోనివన్నీ జరిగినట్లూహించుకుం టోందా?

లేకుంటే యింట్లోకి వచ్చిన ఇన్‌స్పెక్టరమ్మాయేమై పోతుంది? చచ్చిన సంధ్య తిరిగి ఎలా బ్రతుకుతుంది?

త్వరలోనే తన సందేహా లన్నింటికీ జవాబులు రాగల వని అప్పటికి తెలియకపోవటంవల్ల ఇన్‌స్పెక్టర్ మిమి రాకకూడా తన భ్రమేనన్న భావంతో మనసును సరిపెట్టు కుందుకు ప్రయత్నిస్తోంది పార్వతి.

మిమి కారణంగా తన గుండెలవిసిపోయే సంఘటనలా యింట్లో జరుగుతాయని తెలిస్తే—అప్పుడే జాగ్రత్త పడే దామె!

11

రఘుపతి నాయుడింటిపేరు ఎంపీ కాదు. కొన్నిదశాబ్దా లుగా ఆయన పార్లమెంటు మెంబర్‌గా కొనసాగుతూండటం వల్ల అంతా ఆయన్ను ఎంపీ రఘుపతినాయుడంటారు. ఇంకా చెప్పాలంటే క్లుప్తంగా ఎంపీ నాయుడని కూడా అంటారు.

రఘుపతినాయుడి పేరు విని చాలామంది ఆయన కులాన్ని తప్పంచనా వేసుకోవచ్చు.

కులాలగురించిన తగవుల్లో కొన్ని విప్లవాలు తీసుకుని రావాలని శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి సూతాశ్ర మాన్ని స్థాపించినప్పుడు రఘుపతి చాలా చిన్నవాడు. శ్రీ

చౌదరి ప్రభావంతో అప్పట్లో కొందరు కమ్మవారు బ్రాహ్మణులు పాటించే నియమాలన్నీ తమ కన్వయించుకోవడమే కాక—శాస్త్రి శర్మ అవధానివంటి కొన్ని (సాధారణంగా బ్రాహ్మణులకే పరిమితమైన పేర్లను) పేర్లను తమ పేర్లకు చివర తగిలించుకుంటూండేవారు.

ఇవి రఘుపతినీ ప్రభావితం చేసి— ఔన్నత్యం బ్రాహ్మణుల పేర్లలోనే ఉందనుకోవడం అజ్ఞానం—బ్రాహ్మణులు కూడా నాయుడు, రెడ్డి చౌదరివంటి పేర్లను స్వీకరించి—పేర్లను బట్టి కులం తెలుసుకునే పద్ధతికి స్వస్తి చెప్పాలని నిశ్చయించుకున్నాడు. తనకు తగిన వయసు వచ్చి స్వతంత్రుడు కాగానే ఆయన తన పేరు చివర నాయుడు పదం తగిలించుకున్నాడు.

అప్పట్లో ఆయన బంధువర్గంలో అది గొప్ప సంచలనం సృష్టించింది. అయితే అంతకు మించి ఆయన చర్య ఆయన కితరకులాల్లో పేరు తెచ్చిపెట్టింది. రాజకీయ పరంగా అయితే ఆయన కదెంతగానో ఉపకరించింది కూడా!

పెరుగుతున్న పరువు ప్రతిష్ఠలతోపాటు డబ్బు కూడా బాగా వచ్చి చేరడంతో బంధువులు కూడా ఆయన్ను మహా మనిషిగా గుర్తించి గౌరవించారు.

జన మాయన్ను రఘుపతినాయుడనేనా అంటారు. నాయుడుగారనేనా అంటారు. ఉత్తినే రఘుపతి అనేవాళ్ళెక్కరు కూడా లేరు.

రఘుపతినాయుడు పేరుతో సృష్టించిన విప్లవం ఆయనకు మాత్రమే పరిమితమై - ఆయనతోనే ఆగిపోయినప్పటికీ రాజకీయరంగంలో ఆయన ప్రగతిమాత్రం ఎప్పుడూ

ఆగలేదు.

ఇంకా నలభై ఏళ్ళు కూడా లేనప్పుడే - ఆయనకు కేంద్రంలో మంత్రయ్యే అవకాశం వచ్చింది. మంత్రయి పోయినట్లే అందరూ చెప్పుకున్నారు. అప్పుడేశక్తి ఆయ నకు వ్యతిరేకంగా పని చేసిందో తెలియదు కానీ చివరి క్షణాల్లో వచ్చిన అవకాశం వచ్చినట్లే చేజారిపోయింది. అప్పుడాయన అనుయాయులందరూ కూడా-వేరే పార్టీ ప్రారంభించమని ఆయన్ను ప్రోత్సహించారు. ఆయన వేరేపార్టీ పెడుతున్నట్లు పుకార్లు వచ్చాయి.

కానీ రఘుపతినాయుడు కొత్తపార్టీ ప్రారంభించలేదు. తన పార్టీ విడిచిపెట్టలేదు. జీవితంలో మంత్రి పదవి నాశించననీ - ఎంపీగానే ఉండి మరింత ఎక్కువగా ప్రజా సేవ చేస్తాననీ ప్రతిన పూనాడు.

ఆ తర్వాత కూడా ఆయన కొకటి రెండుసార్లు మంత్రయ్యే అవకాశాలు వచ్చాయి. ఆయన మృదువుగా నిరాకరించాడు.

నిస్వార్థపరుడనీ, పదవీ వ్యామోహం లేనివాడనీ క్రమంగా ఆయనకు పేరు, గుర్తింపు వచ్చాయి.

ఏంపీ అయినప్పటికీ ఆయన తక్కువ కాలం ఢిల్లీ లోనూ, ఎక్కువ కాలం తన నియోజక వర్గంలోనూ గడుపుతూంటాడు. ఇంట్లోంచి గనుక ఆయనొక్క ఫోన్ చేస్తే చాలు - ఢిల్లీలో పనులు క్షణాలమీద అయిపోతా యని నానుడి. అందుకే కాబోలు ఆయనిల్లు రద్దీగా ఉంటుంది.

ఆ రోజు కూడా ఆ యిల్లలాగే రద్దీగా వుంది. ఆ సమయంలో ఆయనకో ఫోన్ కాల్ వచ్చింది.

"ఎవరూ?" అనడిగా రాయన సెక్రటరీని.

"ఎవరో నాంచారయ్యట సార్!"

"నాంచారయ్యా....?" అని కుర్చీలోంచి లేచి ప్రైవేటు రూంలోకి వెళ్ళాడు రఘుపతినాయుడు.

లైను ఆ గదికి కనెక్టు చేయబడింది.

"హలో - నాంచారయ్యా - ఏమిటి విశేషం?"

"నాయుడుగారేనా - మీతో చాలా అర్జంటుగా మాట్లాడాలి...."

"ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావ్?"

"మనూర్నించే...."

"ఊఁ చెప్పు...."

"శ్రావణ్ ఎలాగున్నాడు?"

"నిక్షేపంలాగున్నాడు - ఏం?"

"ఇక మీదట ఉండడు-ప్రమాదం ముంచుకొస్తోంది."

"ఏమిటి ప్రమాదం?"

"ఓ దెయ్యం వాడి మీద పగబట్టింది."

రఘుపతినాయుడు ముఖం చిట్లించాడు - "దెయ్యం పగబట్టడమేమిటి? నువ్వు స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా?"

"నా కళ్ళారా చూశాను. దెయ్యమంటే నిజంగా దెయ్యమే....అది వాడి అంతు చూస్తుంది. ఊరొదిలితే అది నా అంతు చూస్తానంది కాబట్టి నేనేమో స్వంతంగా వచ్చి మిమ్మల్ని కలుసుకోలేను. అందుకే ఈ రోజే అసలు విశేషం తెలియపరుస్తూ మీకు ఉత్తరం రాశాను. అదందు దానికి నాలుగయిదు రోజులు పడుతుందేమో మరి! ఈ

లోగా ఈ ఫోనెందుకంటే - రేపుదయమే మరిడయ్యనే మంత్రగాడు మిమ్మల్ని కలుసుకుంటాడు. వాడిచేత శ్రావణ్‌కు తాయెత్తు కట్టించండి ...."

"ఎందుకు?"

"ఉత్తరం చదివితే అన్నీ మీకే తెలుస్తాయి. మరిడయ్యెల్ల కూడా మీకు కొన్ని విశేషాలు తెలుస్తాయి."

"ఉత్తరం కూడా మరిడయ్యకే యివ్వలేక పోయావా?"

"మరిడయ్యకు చెప్పి - ఇంటికొచ్చేక ఉత్తరం అయిడియా వచ్చింది. అప్పటికే మరిడయ్య బయల్దేరి పోయాడు...."

"ఏమిటో - అంతా నీ చాదస్తంలా ఉంది?"

"చాదస్తమని కొట్టిపారేయకండి. శ్రావణ్‌ని కాపాడండి" అన్నాడు నాంచారయ్య. సరేనని ఫోన్ పెట్టేశాడు రఘుపతినాయుడు.

అప్పుడు బల్లమీద ఎర్రదీపం వెలిగింది,

అంటే సెక్రటరీ తన్ను కలుసుకోవాలనుకుంటున్నాడు.

రఘుపతినాయుడు ముందున్న బల్లమీద ఓ బోర్డుంది, దానిమీద చాలా మీటలున్నాయి. ఆయనో మీట నొక్కగానే తలుపు తోసుకుని సెక్రటరీ లోపలకు వచ్చాడు. అతడు నాయుణ్ణి చూస్తూనే "అదేమిటి సార్! అలాగున్నారు?" అన్నాడు.

"నీకు దెయ్యాల మీద నమ్మకముందా?" అనడిగాడు నాయుడు.

"ఉంది సార్—" అన్నాడు సెక్రటరీ.

"నువ్వు చూశావా?"

"చూశాను సార్!"

నాయుడాశ్చర్యంగా—"ఎలా ఉంటుంది దెయ్యం" అన్నాడు.

"మనం చేసిన తప్పులే దెయ్యాలై మనల్ని పీడిస్తాయి సార్!"

నాయుడు తడబడి - "దెయ్య మెలాగుంటుందో చెప్పు" అన్నాడు.

"మనం చేసిన తప్పునుబట్టి దాని రూపం మారుతూం టుంది ..."

నాయుడు విసుగ్గా - "నువ్వు చూసిన దెయ్య మెలా గుందో చెప్పు" అన్నాడు.

"కమల తెలుసుకదూ సార్ మీకు?"

నాయుడులిక్కిపడి "ఊఁ" అన్నాడు.

"దెయ్యం నాకలా కనపడుతూంటుంది."

నాయుడు సెక్రటరీని పరీక్షగా చూశాడు.

అతడికరవై ఏళ్ళుంటాయి. బట్టతల. తెల్లని ఖద్దరు పంచెపై ఖద్దరు లాల్చీ వేసుకున్నాడు. భుజంమీద ఎర్రంచు ఖద్దరు కండువా ఉంది.

నాయుడికీ సెక్రెటరీకీ పరిచయ మీనాటిది కాదు.

సెక్రటరీ కళ్ళలో నాయుడికి పాత కథలు కనబడు తున్నాయి.

నాయుడు కళ్ళు మూసుకున్నాడు.

"ఏమయింది సార్?" అన్నాడు సెక్రటరీ ఆత్రు తగా.

"నీ కళ్ళలో నాకు దెయ్యాలు కనబడుతున్నాయి...."

సెక్రటరీ మాట తప్పిస్తూ. "బయట చాలామంది మీ కోసం చూస్తున్నారు సర్—మీరు అనుమతి స్తే—మీ ఆరోగ్యం బాగోలేదని చెబుతాను—" అన్నాడు.

"చెప్పు—నమ్మకంకోసం—వాళ్ళెదురుగానే డాక్టరుకి ఫోన్ చేయి...."

"చేస్తానుసార్—కానీ మీకు విశ్రాంతి ఉంటుందను కోను...."

"ఎందుకని?"

"కుమారస్వామి మిమ్మల్ని కలుసుకోవాలని ఆత్రపడు తున్నాడు. అతణ్ణించి ఫోన్ వచ్చింది కాబట్టి నేను మిగతా జనాల్ని పంపించేయాలనుకున్నాను...."

"కుమారస్వామి పెద్ద న్యూపెన్స్....ఈ రోజు కతదొద్దు...."

"తప్పదుసార్....అతడు త్రీస్టార్స్ చెప్పాడు...."

"త్రీస్టార్స్ చెప్పాడా?" అన్నాడు నాయుడు కంగా రుగా.

"త్రీస్టార్స్ పదం వారి మధ్య ప్రమాదాన్ని సూచి స్తుంది."

"అవునుసార్—"

నాయుడి ముఖం పాలిపోయింది.

"అలాగైపోయారేంటి సార్—మనం పెద్ద పెద్ద ప్రమాదాలనుంచే ఎన్నోసార్లు తప్పించుకోగలిగాం...."

"సెక్రటరీ—నాకు చివరి రోజులు వచ్చాయి...."

"అలాగంటారేంటిసార్—మీకింకా షష్ఠిపూర్తయినా కాలేదు...."

నాయుడు నిట్టూర్చి—"షష్టిపూర్తికి ముందే జీవితం పూర్తయిన వాళ్ళెందరు లేరు? అన్నాడు.

"మీరు నూరేళ్ళు బ్రతుకుతారుసార్!"

"బ్రతకను ...." అన్నాడు నాయుడు.

"బ్రతుకుతారుసార్—" అన్నాడు సెక్రటరీ నమ్మకంగా

"లేదు—సెక్రటరీ—కొద్దిరోజులుగా నాకలలోకి మా అమ్మవచ్చి—నన్ను రమ్మనమని పిలుస్తోంది—"

"మీ వంటి మహానాయకుల కలలోకి అమ్మగారొస్తే - ఆ అమ్మ దేశమాతేనని అర్థంసార్....దేశమాత మీ సేవలు కోరుతోంది సార్....

"ఇప్పుడు నేను సేవలు చేయడం లేదంటావా?" అంటూ నాయుడోసారి భారంగా నిట్టూర్చాడు.

"మీరు మంత్రి అవుతారుసార్—" అన్నాడు సెక్రటరీ.

వెంటనే నాయుడు గంభీరంగా అయిపోయి- "వెళ్ళు- ఉన్నవాళ్ళని పొమ్మను. కుమారస్వామిని రమ్మను—" అన్నాడు.

సెక్రటరీ వెళ్ళిపోయాడు.

సరిగ్గా అరగంటలో కుమారస్వామి ఆ గదిలో అడుగు పెట్టి- "నాయుడుగారూ- నమస్కారం—" అన్నాడు.

"రా-కూర్చో-" అన్నాడు నాయుడు లేవకుండానే.

కుమారస్వామి వచ్చి కూర్చుని ఒక్క గుక్కలో జరిగిందంతా చెప్పి "ఇదంతా ఎలా జరిగిందో నా కర్థం కావడంలేదు—" అన్నాడు.

"మీ అమ్మాయి క్షేమంగా యింటికొచ్చేసిందా?"

అన్నాడు నాయుడు.

"వచ్చేసింది. ఎంతడిగినా ఏడుస్తుంది తప్ప ఏం చెప్పడంలేదు. జరిగిందానికి హడిలిపోయిందది—"

"ఊఁ" అన్నాడు నాయుడు.

"ఊ అని నా యింట్లో అందర్నీ శాసిస్తూ ఈ ప్రపంచాన్ని కూడా అలాగే శాసించగల ననుకున్నాను. కానీ ఆఫ్టరాల్ ఆడపిల్ల నన్ను దారుణంగా శాసించి వెళ్ళిపోయింది. మనం అర్జంటుగా ఏదో ఒకటి చేయాలి...."

"ఏం చేయాలంటావు?"

"మీరే చెప్పారు—కష్టసమయాల్లో మన నాదుకునేందుకో మనిషున్నాడని...."

"ఎవరి సంగతీ — శ్రావణ్ మాటేనా నువ్వంటూంద?"

"అవును—అతణ్ణి రంగంలోకి దింపండి—"

"వాడజ్ఞాతంగా ఉంటున్నాడు. ఇప్పుడు బైటకు రాడు."

"రాడంటే ఎలా?"

నాయుడు సాలోచనగా — "నా అనుమానం వేరే ఉంది. మనచేత శ్రావణ్ని బైట పెట్టించాలని ఎవరో పెద్దెత్తున పన్నాగం పన్నుతున్నారు...." అన్నాడు.

"అంటే?"

"ఆ వివరాలు తర్వాత చెబుతాన్లేగానీ. నువ్వు ఇనస్పెక్టర్ ఈశ్వర్రావును కలిశావా?"

"వెంటనే కలిశాను. తన ఎరికలో ఇనస్పెక్టర్ మిమి ఎవ్వరూ లేరన్నాడు. ఈ ఏరియాకు ఆడపిల్ల లెవర్నీ సి.ఐ. డీలుగా పంపిన సమాచారం తన కందలేదన్నాడు. ఆ

అమ్మాయి ఫొటో చూపిస్తే తనేమైనా సాయపడగల నన్నాడు—"

"ఫొటో లేదా నీ దగ్గర....

"ఫొటో తీసేలా ఉందా అప్పుడు నా పరిస్థితి?"

నాయుడదోలా నవ్వి—"సుఖంగా ఉన్నప్పుడు శత్రువుల్ని కష్టపెట్టడ మెవరైనా చేస్తారు. కష్టాల్లో బుర్ర పని చేయాలి. ఏదో విధంగా ఆ పిల్ల ఫొటో తీయించాల్సింది?" అన్నాడు.

కుమారస్వామి మాట్లాడలేదు.

"జరిగిందేదో జరిగిపోయింది. ఉన్నట్లుండెక్కడ పడితే అక్కడ ప్రత్యక్షం కావడానికా పిల్ల దేవతో, దెయ్యమో కాదుగదా—ఆ పిల్ల ననుసరించమని మనుషుల్ని పంపలేక పోయావా?" అన్నాడు నాయుడే మళ్ళీ.

"పోలీసు జీపులో వచ్చింది. పోలీసేననుకున్నాను...."

"కుమారస్వామీ—నిన్నే అయోమయంలో పడేసి పోయిందంటే - ఆ పిల్ల చాలా గట్టిదే అయుండాలి. ఆ పిల్లను పట్టాలంటే ఒక్కటే మార్గం....నువ్వు మళ్ళీ మరో పిల్లను పట్టు...." అన్నాడు నాయుడు.

"పిల్లను పడితే ఈ పిల్ల దొరుకుతుందా?"

"పిల్ల దొరుకుతుందని కాదు. అవతల శంకర నారాయణ సినిమాకోసం ఆగుతాడా అని!" అన్నాడు నాయుడు.

"ఈ హడావుడిలో ఆ విషయమే మర్చిపోయాను...."

"జాగ్రత్త మరి....ఈసారంతా పకడ్బందీగా జరగాలి. అమ్మాయి జాగ్రత్త!"

"అలాగే!" అని వెళ్ళిపోయాడు కుమారస్వామి.

అతడు వెళ్ళాక నాయుడు ప్రైవేటు గదిలోంచి బైటకు వచ్చాడు. అక్కడే పచార్లు చేస్తున్న సెక్రటరీ ఆయన్ను చూస్తూనే నమస్కరించాడు.

"నువ్వు వెళ్ళిపోవచ్చు—" అన్నాడాయన సెక్రటరీతో.

"రేపుదయం ఏడున్నవరకు వస్తాను సార్—" అని వెళ్ళిపోయాడు సెక్రటరీ.

నాయుడు లోపలకు వెళ్ళాడు.

బెడ్రూంలో ఉంది చందన.

చందన వయసు ఏభై వుంటుంది. కానీ చూడ్డానికామె ముప్పైయేళ్ళ మనిషిలా కనబడుతుంది. ఆమెలో యింకా అందముంది. ఆ అందానికింకా రెచ్చగొట్టే గుణముంది.

చందన నాయుడు భార్య.

నాయుడు గదిలో ప్రవేశించే సమయానికి చందన నిలువుటద్దం ముందు నిలబడి తన అందానికి మెరుగులు దిద్దుకుంటోంది. అప్పుడామె కద్దంలో భర్త ప్రతిబింబం కనబడింది. వెంటనే ఆమె వెనక్కు తిరిగి భర్తను చూసి—"అదేమిటలా వున్నారు?" అనడిగింది.

"శ్రావణ్ ఉనికి బైటపెట్టాల్సిన సమయమొచ్చింది" అన్నాడు నాయుడు కంగారుగా.

"ఎందుకు?"

"వాడిమీద ఓ దెయ్యం పగబట్టింది. వాడికి తాయెత్తు కట్టడానికి రేపు మరిదయ్యొస్తున్నాడు...."

"మరిదయ్యెవరు?"

"ఓ మాంత్రికుడు...."

"మీకుగానీ మతిపోయిందా—మాంత్రికుడి కోసం మనవాడి ఉనికిని బయట పెడతారా....?" అంది చందన.

"మతంటూ పోతే అది నాక్కాదు-నాంచారయ్యకు పోయింది. అతడే ఫోన్ చేసి నాకు చెప్పా డీ విషయం. మరిడయ్యనూ అతడే పంపుతున్నాడు...."

"నాంచారయ్య చెప్పాడా." అంది చందన సాలోచ నగా. ఆ వెనువెంటనే ఆమె తీవ్రాలోచనలో పడి పోయింది.

"దెయ్యాన్ని నాంచారయ్య కళ్ళారా చూశాట్ట—...."

"ఊఁ" అని ఉలిక్కిపడింది చందన. "అసలు నాంచారయ్య మీకేం చెప్పాడో వివరంగా చెప్పండి—...."

"ఫోన్లో యెక్కువ చెప్పలేదు—...." అంటూ నాయుడు జరిగిన సంభాషణ భార్యకు చెప్పాడు

"అంటే ఉత్తరం వచ్చేదాకా మనకేం జరిగినదీ తెలి యదు. మరిడయ్య మాత్రం రేపుదయమే వచ్చే స్తాడు—...."

"అవును—శ్రావణే శ్రావణ్ అని మరిడయ్య కూ్కడా తెలియకూడదు...."

చందన ముఖంలో కలవరపాటు కనబడింది. అది బైట పడనివ్వకుండా—"మన మనవసరంగా భయపడుతున్నా మేమో—" అంది.

"నేనూ అలాగే అనుకుంటున్నాను. కానీ...."

"ఊఁ కానీ...?"

నాయుడు బదులివ్వలేదు. తనకు కమల గుర్తుకు వచ్చిందన్న విషయ మాయన భార్యకు చెప్పదలుచుకో

లేదు.

"చెప్పండి...." అంది చందన.

"చెప్పడాని కేమీలేదు కానీ—శ్రావణ్‌కి మరిడయ్య చేత తాయెత్తుపూస కట్టించాలో వద్దో నిర్ణయించు...." అన్నాడు నాయుడు.

"మరిడయ్యపోలీసుల మనిషంటారా?"

"పోలీసుల మనిషయితే నాంచార యెందుకు పంపుతాడు?"

"ఒకసారి శ్రావణ్‌తో మాట్లాడనా?" అంది చందన.

"ఊఁ? వాడేమన్నాడో చెప్పేదాకా నేను నడ్డి వాలుస్తాను—" అన్నాడు నాయుడు.

చందన తన డ్రస్సింగ్ టేబిల్ అరను ముందుకు లాగింది. అందులో పాకెట్ రేడియో ఒకటుంది. దానిమీద నాలుగు మీటలున్నాయి. ఆ మీటల నామె వరుస పాటిస్తూ ఎనిమిదిసార్లు నొక్కింది.

అప్పటికి నాయుడు వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

"శ్రావణ్!" అంది చందన.

"అమ్మా!" అంటూ రేడియోలో పలికిందో గొంతు.

"కులాసాగా ఉన్నావా?"

"ఊఁ"

"రేపోసారి నేను నిన్ను చూడాలి...."

"ఎందుకు?"

"నీ మీదో దెయ్యం పగబట్టిందని మీ నాన్న తాయెత్తు కట్టించాలనుకుంటున్నారు. రేపుదయం మంత్రగాడు మనింటికొస్తాడు...."

"సరే - అయితే ఆ మంత్రగాణ్ణి ఆవేషంలో కాక మరో వేషంలో నా దగ్గరకు పంపు...."

"ఎక్కడకు పంపను?"

"నటరాజ్ హోటల్లో ముప్పైమూడో నంబరు గదికి."

"నువ్వు జాగ్రత్తగా ఉండటం మర్చిపోకు...."

"నేనెప్పట్నించో నా జాగ్రత్తలో ఉన్నాను. మకాం మార్చేశాను...."

"మకామెందుకు మార్చేశావు?"

"అమ్మా - సంధ్యను నేను ప్రేమిస్తున్నాను. సంధ్య పోతే బ్రతకలేను. ఆమెను కాపాడుకోవడం నా విధి."

"సంధ్యకు ప్రమాదముందని నేను చెప్పకుండా నీకెలా తెలిసింది?"

"నాకు పల్లెటూర్నించి ఫోనొచ్చింది. అక్కడేం జరిగిందో తెలుసా? నా చేత మోసపోయానంటూ ఓ పిల్ల నాంచారయ్య గారిని కలుసుకుంది. తర్వాత ఆ ఊళ్ళోనే ఆత్మహత్య చేసుకుంది. శవాన్ని స్మశానంలో పాతి పెట్టారు. నాంచారయ్య మరిడయ్యనే మాంత్రికుణ్ణి పిలిచి చచ్చినమ్మాయి దెయ్యమై తన్ను బాధించకుండా చేయమని చెప్పారు. మరిడయ్య మంత్రాలకు నాంచారయ్యగారు చూస్తూండగా గోతిలోంచీ శవంలేచి ఎక్కడికో వెళ్ళిపోయింది. ఆ శవం సరాసరి పట్నం వెళ్ళి నామీద పగ తీర్చుకుంటుందని మరిడయ్య నాంచారయ్యగారికి చెప్పాడు. ఆయన నాకు వెంటనే ఫోన్‌చేసి జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు...."

"శవం గోతిలోంచి లేచిందా?" అంది చందన ఆశ్చర్యంగా.

"ఆ మరిడయ్యేదో ట్రిక్ చేసుంటాడు. డబ్బుకోసం మనుషుల్ని భ్రమలో పడేసి నమ్మించగల మోసపు మంత్రగాళ్ళు మన దేశంలో కోకొల్లలు...."

చందన కంగారుగా "నా మాట విని నువ్వు మరిడయ్య చేత తాయెత్తు కట్టించుకో అంది.

"తప్పకుండా కట్టించుకుంటాను. నాకు పెద్దల మాటంటే చెప్పలేనంత గౌరవం. నువ్వేమీ భయపడకు. రేపుదయం తొమ్మిదింటికి మరిడయ్యను నటరాజ్ హోటల్లో ముప్పైమూడో నంబరు గదికి పంపు...."

"సరే జాగ్రత్తగా ఉండు మరి!"

"ఉంటాను. సెలవా మరి?"

చందన పాకెట్ రేడియోలో మళ్ళీ కొన్ని మీటలు నొక్కి—దాన్ని డ్రెస్సింగు టేబిలు అరలో ఉంచింది.

"ఏమంటాడు శ్రావణ్?" అన్నాడు రఘుపతినాయుడు.

చందన వివరించింది.

"అంటే నాంచారయ్య నాకంటే ముందుగా శ్రావణ్‌ని హెచ్చరించాడన్నమాట. మంచిపనే చేశాడు. కానీ....తన మూర్ఖత్వంతో మనవాడి ప్రాణాలమీదకు తెస్తాదేమోనని నాకు భయంగా వుంది...." అన్నాడు రఘుపతినాయుడు.

"తాయెత్తు కట్టించుకుంటేనే వాడి ప్రాణాల మీద కొస్తుందా?"

"ఒకవేళ మరిడయ్య శత్రువుల మనిషనుకో?"

"అయితే?"

"మనవాణ్ణి గుర్తించడానికే ఆతడు తాయెత్తు కడుతున్నాడనుకో...."

చందన ఉలిక్కిపడి "కానీ మరిడయ్యను నాంచారయ్య పంపుతున్నాడు. మీరా విషయం మర్చిపోకూడదు...." అంది.

"శవం గోతిలోంచి లేచి నడిచి వెళ్ళిపోయిందని నాంచారయ్యను మరిడయ్య నమ్మించాడు. దాన్నిబట్టి -

వాళ్ళిద్దర్లో ఎవరు తెలివైనవాళ్ళో ఊహించుకో ...."

"ఏం - దెయ్యాలు నిజంగా ఉండవంటారా?" అంది చందన.

ఆ ప్రశ్న వినగానే నాయుడదోలాగై పోయాడు. ఆయనకు తన సెక్రటరీ మాటలు గుర్తొచ్చాయి.

మనం చేసిన తప్పులు దెయ్యాల రూపంలో వెంటాడి వేధిస్తాయంటాడతడు.

"చెప్పండీ నాంచారయ్య నిజంగానే దెయ్యాన్ని చూసుండొచ్చుగా ...."

"ఉండొచ్చు-అయితే అప్పుడు శ్రావణ్ కూడా నిజంగా ఏదో తప్పు చేసుండాలి" అన్నాడు నాయుడు.

చందన భర్తవంక ఆశ్చర్యంగా చూసి "ఉన్నట్లుండి మీరు తప్పుకీ దెయ్యాలకీ ముడిపెడుతున్నారేమిటి?" అంది.

నాయుడు బదులివ్వలేదు. ఆయన కనుల ముందు కమల కనబడుతోంది. ఆ కమల కనులెర్రగా మెరుస్తున్నాయి.

12

ఆంజనేయులా రోజు ఆలస్యంగా యింటికొచ్చాడు.

"ఇంత లేటయిందేమండీ?" అంది పార్వతి.

"ఓవర్ టైం ...." అన్నాడు విసుగ్గా ఆంజనేయులు.

పార్వతికి భర్తతో జరిగిందంతా చెప్పాలనుంది. ఆయన విసుగు చూసి భయపడింది. కాసేపటికి స్థిమిత పడితే అప్పుడు నెమ్మదిగా అన్నీ చెప్పొచ్చు ననుకుందామె. కానీ ఆంజనేయులి చిరాకు మరీ పెరిగిపోయింది.

ఇది పార్వతికి కొత్తకాదు. ఆఫీసులో ఆయనకో శత్రువున్నాడు. అతగాడప్పు డప్పు డాంజనేయుల్ని మాటలతో

రెచ్చగొట్టి వినోదిస్తూంటాడు. సాధారణంగా ఆంజనేయులు రెచ్చిపోడు. రెచ్చిపోయిన రోజున ఇంట్లో చెప్పలేనంత చిరాకు.

ఇలాంటి సమయంలో తను భ్రమపడిందో లేదో తెలియని విశేషాన్ని భర్తకు చెప్పడం మంచిది కాదని గుర్తించి ఊరుకుంది పార్వతి. అయితే ఆ విషయమామె మెదడును దొలుస్తూనే వుంది.

ఆంజనేయులు భోంచేసి పెందరాళే పడుకున్నాడు.

పార్వతికో పట్టాన నిద్రపట్టలేదు. పట్టక పట్టక ఓ రాత్రివేళ నిద్రపడితే - ఎవరో గది తలుపు తట్టారు.

ఆంజనేయులు గాఢ నిద్రలో ఉన్నాడు.

పార్వతికి వెంటనే ఆ చప్పుడు వినిపించి కళ్ళు తెరిచింది.

గదిలో దీపం లేదు.

అప్పుడామె తన్ను తానే నిందించుకుంది.

నిద్ర పట్టటం లేదని గదిలో బెడ్‌లైట్ కూడా ఉంచకుండా తీసేసింది.

గదిలో పూర్తి చీకటి....

ఇప్పుడెవరో తలుపు తడుతున్నారు.

"ఏమండీ?" అంటూ భర్తను కుదిపిందామె.

"ఊఁ" అంటూ విదిలించాడామె నాంజనేయులు.

ఆ విదిలింపులో ఆమె కర్థమయింది - భర్త నిద్ర లేవడని.

ఆ ఎవరో ఇంకా తలుపు తడుతూనే ఉన్నారు. ఇక లాభం లేదని పార్వతి మంచంమీంచి లేచింది. అలవాటైన గది కావడంవల్ల చీఁట్లో దారి సులభంగానే తెలిసింది.

గుమ్మందగ్గిర బాట్రీలైటు వెలుగుతోంది.

"నేనండీ" అన్నాడు శ్రావణ్.

"హమ్మయ్య" అని నిట్టూర్చింది పార్వతి.

"ఆంజనేయులుగారు లేవలేదా?"

"ఆయన నిద్రపోతూన్నారు" అనగానే పార్వతిలో భయం ప్రవేశించింది.

తను ఒంటరి ఆడది!

ఇప్పుడే ఉద్దేశ్యంతో అతడీ గదిలో అడుగుపెట్టాడు?

అప్రయత్నంగా పార్వతి వెనుకడుగు వేసింది. ఆమె ఊహలో శ్రావణ్ తనమీదకీ వచ్చి - తనను దగ్గరగా తీసుకొన్నాడు.

కెవ్వుమంది పార్వతి.

ఉలిక్కిపడి లేచాడాంజనేయులు.

పార్వతి ఒక పరుగున మంచంమీదకు వెళ్ళిపోయింది. ఈలోగా ఆంజనేయులు మంచం దగ్గర్లోనే ఉన్న స్విచ్ వేశాడు.

అప్పుడాయన కెదురుగా శ్రావణ్ కనిపించాడు.

"ఏం జరిగింది?" అన్నాడాయన.

శ్రావణ్ తప్పుచేసిన వాడిలా వణుకుతున్నాడు. అతడి చేతిలో బ్యాటరీలైటు - కరెంటు దీపం వెలుగులో కాంతి హీనంగా ఉంది.

"ఏం జరిగిందే?" అన్నాడాయన పార్వతివంక చూసి.

పార్వతి మంచంమీదే ముడుచుకుని కూర్చుంది. నోరు విప్పలేదు.

శ్రావణ్ మంచానికి దగ్గరగా వచ్చి—"జీవితంలో భయమన్న దెరుగను. ఈ రోజు భయపడ్డాను—"

"ఏం జరిగింది?" అన్నాడాంజనేయులు.

"సంధ్య ఈరోజు విచిత్రంగా ప్రవర్తిస్తోంది—"

అన్నాడతడు. భయం అతడి మాటలో, స్వరంలో, కదలి కలా — ప్రతిఫలిస్తోంది.

"వంట్లో బాగోలేదా?" అన్నా డాంజనేయులు.

"డాక్టర్ మందిచ్చాడు. సాయంత్రం వేసుకుని పడు కుంది. తన్ను డిస్టర్బ్ చేయడం యిష్టంలేక నేనే వంట కూడా చేశాను. ఎనిమిదింటికి లేపితే లేచింది. భోంచేయ మంటే చేసింది. పడుకుంటావా అన్నాను. అదోలా పళ్ళు బైటకు పెట్టి ఇహీహీ అని నవ్వింది —"అన్నాడు శ్రావణ్.

"వేళాకోళం చేసిందేమో —"

"అలాగే సరిపెట్టుకుని—అదేంటని అడిగాను. వెంటనే కళ్ళు మూసుకుని పడుకుంది. తర్వాత నేను గిన్నెలు సర్దు కుని తన దగ్గరకు వెళ్ళాను. కళ్ళు మూసుకుని పడుకుని ఉంది. దీపం ఆర్పేయనా అన్నాను. చటుక్కున కళ్ళు తెరిచి ఇహీహీ అని నవ్వింది.నా గుండె లవిసిపోయాయి. ఎంతో అందంగా వుండే సంధ్య - అలా నవ్వినప్పుడు మహా వికృతంగా కనబడింది. అలా నవ్వుతావేం సంధ్యా అంటే చటుక్కున లేచి కూర్చుని—ఏం—నవ్వొస్తే నవ్వకూడదా అంది. నేనేమీ అనలేదు. మాట్లాడరేం— అంటూ నా కేసి గుడ్లురిమి చూసింది.

ఆ చూపులు భయంకరంగా ఉన్నాయి. నువ్వలా చూస్తే నాకు భయంగా ఉందన్నాను. ఏమనుకుందో వెనక్కు వాలి పడుకుంది. నేను పుస్తకం చదువుకుంటూ పడుకున్నాను. అలా చాలాసేపు చదివాను. టైము పది దాటుతూండగా సంధ్య మళ్ళీ లేచి—యింకా పడుకోలేదా అని నన్నడి గింది. నిద్ర రావడంలేదన్నాను. నేనయితే కళ్ళు తెరిచి కూడా నిద్రపోగలనంది. దానికేముంది—కళ్ళు తెరిచి

చూస్తూ నిద్రపోతున్నట్లు నటించడమే కదా అన్నాను.

అలాకాదు-కళ్ళు తెరిచి నిద్ర పోతూంటే కనురెప్పలు మూతపడవందామె. అదెలా సాధ్యమన్నాను. తనకు సాధ్యమే నందామె. నేను సవాలు చేశాను ఆంజనేయులు గారూ—మీరు నమ్మరు— ....అరగంటసేపు రెప్ప వేయ లేదు సంధ్య. చివరకు నేనే భయపడి—ఇకచాల్లే పడు కుందామన్నాను. ఏమనుకుందో పడుకుంది. నేనప్పుడు లైటార్పేశాను....''

శ్రావణ్ చెప్పింది వినగానే పార్వతి శరీరంలో కొత్త రకం వణుకు మొదలయింది. ఆమెలో రక రకాల ఆలోచ నలు....

ఇన్‌స్పెక్టర్ మిమి సంధ్యను చంపేస్తే సంధ్య దెయ్యమై ఇంట్లో తిరుగుతోందా? అయితే మిమి ఏమైంది? ఆమె కూడా దెయ్యమేనా?

అంటే—తను నిజంగా దెయ్యంతో మాట్లాడిందా?

"నువ్వు నిజమే చెబుతున్నావా?" అన్నా డాంజ నేయులు.

"నా భార్యగురంచబద్ధం చెబుతానా?"అన్నాడు శ్రావణ్ మళ్ళీ ప్రారంభిస్తూ—"ఆమె చాలా మంచిది. నాకు ప్రాణంతో సమానం. కానీ కాసేపలా ప్రవర్తించేసరికి నాకామె అనగానే భయం ప్రారంభమౌతోంది. ఎలాగో కంటిమీదకు కునుకు తెచ్చుకుందామని ప్రయత్నించాను. ఎప్పుడో నిద్రపట్టింది. కానీ కాసేపటి క్రితం ఉన్నట్లుండి మెలకువొచ్చింది. అందుక్కారణం సంధ్య గుర్రు. ఏదో పిల్లి, కుక్క అరచినట్లు కాక అదో రకమైన వికృత

స్వరంలా వినబడుతోంది. ఎందుకో నాకు భయం వేసింది. చటుక్కున మీ యింటికొచ్చాను. ఆ అరుపులు తనకూ వినిపించాయేమో—పార్వతిగారు భయపడ్డారు....—" అన్నాడు శ్రావణ్.

ఆంజనేయు లాశ్చర్యంగా శ్రావణ్‌వంక చూసి—"సంధ్య యిప్పుడేం చేస్తోంది?" అన్నాడు.

"నిద్రపోతోంది—"

"పద—వెళ్ళిచూద్దాం—" అన్నా డాంజనేయులు.

"వద్దు—" అంది పార్వతి.

"ఏద్దనకు. నా కీ దెయ్యాలూ గియ్యాలూ అంటే భయంలేదు. అది రోగమో, నాటకమో తేల్చేస్తాను—పద...." అన్నా డాంజనేయులు.

"వద్దు—...." అంది పార్వతి మళ్ళీ.

"నీకేం భయం లేదులే—నువ్విక్కడే ఉండు...."

"అది కాదండీ—ఈ మధ్యాహ్నమేం జరిగిందో మీకు తెలీదు—" అంది పార్వతి వెంటనే.

"ఏం జరిగింది? సంధ్య కానీ మిమ్మల్ని కూడా భయ పెట్టలేదు గదా—" అన్నాడు శ్రావణ్.

"భయపట్టలేదు కానీ అంతకంటే పెద్ద విశేషం...." అంటూ పార్వతి మధ్యాహ్నం జరిగినదంతా చెప్పింది.

శ్రావణ్ కది వినగానే నోట మాట రాలేదు.

"ఇంత జరిగితే నాకేం చెప్పలేదేం?" అన్నా డాంజ నేయులు.

"ఇంటి కొచ్చినప్పట్నించీ ఒకటే చిరాగ్గా ఉన్నారు మీరు. చెప్పాలని అనుకుంటే మాత్రం కుదురుతుందా?" అంది పార్వతి.

నూతన పబ్లికేషన్ ప్రారంభం

ఏజెంట్లకు! పాఠకులకు!!

నమస్కారములు!!

మీకో శుభవార్త! మా సంస్థనుండి ప్రతి నెలా సుప్రసిద్ధ రచయితల యువరచయితల స్పై అడ్వెంచర్స్, డిటెక్టివ్, జానపద భయానక నవలలు విడుదల కాబోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ అంతటా
మాకు ఏజంట్లు కావాలి.

ఏజెంట్లకు లాభసాటి కమీషన్ కలదు.

పూర్తి వివరాలకు :

BLYP BOOKS
బ్లిప్ బుక్స్
24/117, రొట్టెల స్ట్రీట్
మూలాపేట
నెల్లూరు-524 003 (A.P.)

"మీరు నా కూడా వెంటనే యేమీ చెప్పలేదు...."
అన్నాడు శ్రావణ్.

"ఏం చెప్పను? నువ్వు లోపలకు వెడుతూనే సంధ్యా అని పెద్దగా కేకపెడతానను కున్నాను. కానీ మహా హుషారుగా తిరిగొచ్చావు. సంధ్య నిక్షేపంలా ఉందన్నావు. నాకేం పాలుపోలేదు. నేనే భ్రమపడ్డానా అనిపించింది—"
అంది పార్వతి.

"మీరు భ్రమపడ్డారనే నా అనుమానం—" అన్నాడు శ్రావణ్.

"అయితే నువ్వా యిప్పుడు భ్రమపడే ఉంటావు—"
అంది పార్వతి.

ఆమె చెప్పినదానికీ, తన అనుభవానికీ లంకె ఉండవచ్చునన్న ఆలోచన అప్పుడే శ్రావణ్‌కి తట్టింది.

"అయితే యేం జరిగిందంటారు?...." అన్నాడు శ్రావణ్.

"ఇంట్లో దెయ్యం అడుగెట్టింది...."

"నా సంధ్య దెయ్యం కాదు....—" అన్నాడు శ్రావణ్.

"నేను దెయ్యాన్నని ఎవరన్నారు?"

ఈ ప్రశ్న శ్రావణ్ వెనుక నుంచి వచ్చింది. ప్రశ్నతో పాటే సంధ్య ముందుకు వచ్చింది.

ఆమెను చూస్తూనే పార్వతి ఉలిక్కిపడింది. అప్పుడామె కళ్ళకు దెయ్యంలాగే కనబడింది.

ఆంజనేయులు సంధ్యవంక ఆశ్చర్యంగా చూశాడు. ఆమె ఆయన కళ్ళకు — అమాయకంగానూ, అపురూపమైన అందగత్తెగానూ కనబడింది.

అపరాధ పరిశోధన పోటీ-230

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-9-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబరు'87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఈ దేశ ప్రధానిమీద ఇటీవల హత్యా ప్రయత్నం జరిగింది—? (ఇండియా శ్రీలంక)
2. రాష్ట్రంలో యీ వ్యాధి చాలామంది ప్రాణాలు బలి గొంది—? (మెదడువాపు వ్యాధి, అతిసార వ్యాధి)
3. దేశంలో ఇది పెచ్చుపెరిగి పోతున్నది—? (టెర్రరిజం, అవినీతి)
4. ప్రస్తుతం వార్తల్లో నున్న వ్యక్తి—? (వి.పి. సింగ్, అమితాబ్‌బచ్చన్)
5. కొందరి జీవితాలలో ఇదంటే తెలియదు—? (నిజాయితీ, ప్రేమ)

"నేను దెయ్యాన్నా?" నవ్వుతూ పార్వతి వంక చూసింది సంధ్య.

"నువ్వు దెయ్యానివని ఎవరన్నారు?" అన్నా డాంజనేయులు.

"మరి మీరంతా ఎవరి గురించి మాట్లాడుకుంటున్నారు?" అంది సంధ్య.

"ఎందుకో నీ భర్త జడుసుకున్నాడు—" అన్నా డాంజనేయులు.

సంధ్య నవ్వి—"నన్ను పెళ్ళిచేసుకున్న క్షణం నుంచీ భయపడుతూనే ఉన్నాడు శ్రావణ్. ఎందరో్ని కాదని నన్ను చేసుకున్న మూలాన—వాళ్ళంతా తననూ, నన్నూ యేదో చేసేస్తారన్న అనుమానమే అతడి భయాని క్కారణం —" అంది.

శ్రావణ్ భార్యవంక అదోలా చూసి —"అందరితో పాటు నువ్వూ నన్ను భయపెట్టకు—" అన్నాడు.

సంధ్య మళ్ళీ నవ్వి—"ఇంత రాత్రిపూట నన్నొదిలి పక్కింట్లోకి వెళ్ళిపోతే భయం నాకా, మీకా—రండీ, పోదాం" అంది.

శ్రావణ్ తటపటాయిస్తూనే వెనక్కి తిరిగాడు.

"గుడ్ నైట్—" అంది సంధ్య ఆంజనేయులు దంపతులతో.

అప్పుడు శ్రావణ్ కూడా వెనక్కి తిరిగి గుడ్ నైట్ చెప్పి ముందుకు నడిచాడు. అతడి ననుసరిస్తూ సంధ్య వెళ్ళిపోయింది

"ఈ రాత్రి శ్రావణ్ పనేమవుతుందో?...." అంది పార్వతి.

"అతడికేం నిక్షేపంలాగుంటాడు. నువ్విక పడుకో."



మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు. ఎక్సర్‌సైజు పుస్తకములు, హిందీ, ఇంగ్లీషు నవలలు లభించును.

నేడే కేటలాగుకై వ్రాయండి.

ఫోన్ నెం: 3444

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు — రాజమండ్రి

అన్నా డాంజనేయులు.

"లేదండీ — అతణ్ణి రక్షించడానికి మన మేదైనా చేయాలి...."

"ఏం చేయాలో తెల్లారి లేచాక ఆలోచిద్దాం—" అంటూ ఆంజనేయులు పక్కమీద వాలాడు.

"ఏమండీ-పడుకుందురు గానీ-ముందు మీ రా తలుపులు వేసిరండి-" అంది పార్వతి.

ఆంజనేయులు లేచివెళ్ళి తలుపేసి వచ్చి—"పిచ్చి పార్వతీ—భయపడ్డావా?" అన్నాడెంతో అభిమానంగా.

"చాలా భయంగా వుంది నాకు....—" అంది పార్వతి.

"రేపొద్దున్న శ్రావణ్ నవ్వుతూ పలకరిస్తాడు మనని. నువ్వేం భయపడకు" అన్నాడాంజనేయులు అనునయంగా.

"పలకరించకపోతే?"

"లేకపోతే చస్తాడు. అతగాడి గురించి మధ్య మనమెందుకూ యిప్పుడు చావడం?" అన్నాడాయన ఈసారి కాస్త విసుగ్గా.

"నాకు మన గురించి కూడా బెంగగా వుందండీ!"

ఆంజనేయులోసారి లేచి నిలబడి చేతులాడించి కండలు పొంగించాడు.

"ఏమిటండీ?" అంది పార్వతి.

"నా పేరు ఆంజనేయులు. దెయ్యాలంటూ ఉంటే అవి నా దరిదాపుల క్కూడా రావు. తెలిసిందా?"

"మరి సంధ్య వచ్చిందిగా—"

"వచ్చిందంటే - ఆమె దెయ్యం కాదన్నమాట...."

పార్వతింకేమీ మాట్లాడలేదు. భర్త లైటార్పబోతూంటే మాత్రం - "ఈ రాత్రికి దీపముంచండీ" అంది.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్ధ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

13

"కొండల్రావ్! దామోదరం పంపిన ఫోటో లేవీ?" అన్నాడు కుమారస్వామి.

కొండల్రావు వెంటనే అతడికి ఫొటోలు చూపించాడు. కుమారస్వామి వాటిలోంచి ఓ ఫొటో ఎన్నికచేసి "పిల్ల బాగుంది కదూ?" అన్నాడు.

"ఈ పిల్ల పేరు వందన...." అన్నాడు కొండల్రావు.

కుమారస్వామి నాలిక్కొరుకుని - "మళ్ళీ నా చేతికీ పిల్ల ఫోటోయే వచ్చిందేమిటీ" అన్నాడు.

"తమ ఎన్నిక గొప్పది" అన్నాడు కొండల్రావు.

"కానీ ఒకసారి తప్పించుకుని పారిపోయిన పిట్ట మళ్ళీ చేజిక్కుతుందా?" అన్నాడు కుమారస్వామి.

"పిట్ట తప్పించుకు పోలేదు. తమరే వదిలిపెట్టేశారు."

అదెంత నిజమో కుమారస్వామికి తెలుసు. అయినా కాదనకుండా - "అవుననుకో—కానీ మన సంగతి తెలిసి పోయిందిగా...." అన్నాడు.

"తెలియనివ్వండి - తమరు గొప్పవారు కదా!"

"అయితే?" అన్నాడు కుమారస్వామి.

"గొప్పవాళ్ళ విషయంలో ఎన్ని నిజాలు తెలిసినా ఫరవాలేదు. అందుకే కదా మంత్రులు మళ్ళీ మళ్ళీ ఎన్నికవుతున్నారు. జనం మళ్ళీ మళ్ళీ పొగుడుతూనే ఉంటూ ఉంటారు...."

"నువ్వు చెప్పదల్చుకున్నదేమిటో వివరంగా చెప్పు."

"బాబూ - తమరు వందన నెందుకొదిలిపెట్టారో నా కిప్పటికీ అర్థం కావటం లేదు. తమరు కావాలంటే ఆ అమ్మాయినే క్షణాలమీద మళ్ళీ రప్పించగలం. మీకూ ఈ విషయం తెలుసు...."

శ్రీ వేంకటేశ్వరా వారి

సూపర్ థ్రిల్లర్స్

ఆగష్టు 15 విడుదల

1.	మృత్యుహేల (అపన సీరియల్)	శ్యాంబాబు	20 00
2	మృత్యువలయం (అపన సీరియల్)	బొమ్మిడి అచ్చారావు	20-00
3.	మృగ విన్యాసం (అపన సీరియల్)	శశికుమార్	20-00
4	బ్యూటీ గేమ్	రాంబాబు	20-00

మీ ఆర్డర్ తోపాటు అడ్వాన్స్ పంపగలరు

శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్
మాజేటివారి వీధి,
గాంధినగర్ —విజయవాడ - 3.

"వస్తుందంటావా?" అన్నాడు కుమారస్వామి.

"బాబూ - మిడత అగ్నివైపు, సైనికులు యుద్ధరంగం లోకి మళ్ళీ మళ్ళీ వెడుతూనే ఉంటారు...." అన్నాడు కొండల్రావు.

"అయితే ముహూర్తం రేపు మధ్యాహ్నమే...." అన్నాడు కుమారస్వామి.

కొండల్రావు వినయంగా తలాడించాడు.

కుమారస్వామి సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

తను మళ్ళీ వందననే రప్పించడంవల్ల రెండు ప్రయోజనాలు.

తన నుంచి తప్పించుకోవటం తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదని వందనకు తెలుస్తుంది. తన సామర్థ్యం ఇన్‌స్పెక్టర్ మిమి కర్థమవుతుంది.

కానీ....

కుమారస్వామి గుండె అదిరింది.

గతంలో జరిగిన పొరపాటు మళ్ళీ జరక్కూడదు.

అతడు చటుక్కున కళ్ళు తెరిచి లేచి నిలబడి "అన్ని ఏర్పాట్లూ చేయి" అని అక్కణ్ణించి కదిలాడు.

అతడు హాల్లో అడుగు పెట్టగానే అక్కడున్న పనివాళ్ళందరూ స్థంభించిపోయారు.

కుమారస్వామి వారిని గమనించకుండా మేడమెట్లెక్కి తిన్నగా తన గదిలోకి వెళ్ళాడు.

గదిలోంచి కబుర్లు బైటకు వినపడుతున్నాయి.

ఉమాదేవి పాప మంచం మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-9-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు నవంబరు'87 నెల సంచికలో ప్రకటిస్తాము.

జులై '87 పోటీ ఫలితాలు

(1) జులై '87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అతివ వేదన!

అరణ్య రోదన!!

పంపినవారు: శ్రీ ఎమ్.ఏ నాయుడు, ఎమ్.కాం., 13-16-25, కె.పి. రోడ్, జడ్.పి.పి. దగ్గర, శ్రీకాకుళం—532 001.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

దేశమును ప్రేమించుమన్నా!

దేహమును పీడింపకురన్నా!!

పంపినవారు: శ్రీ కె. ఈశ్వరరెడ్డి, బి.ఎ., వాణి క్లినికల్ లేబరేటరీ, ఆర్. అగ్రహారం, గుంటూరు-3.

భర్తను చూస్తూనే లేచి నిలబడింది ఉమాదేవి.

"పాపా!" అన్నాడు కుమారస్వామి.

ఎప్పటిలా ఆమె లేచి తండ్రి వద్దకు రాలేదు.

"ఇలా రామ్మా!" అన్నాడు కుమారస్వామి.

"నేను రాను" అంది పాప.

"ఎందుకని?"

"నువ్వు మగాడివి...."

చెళ్ళుమన్నట్లయింది కుమారస్వామికి. అతడు తడబడుతూ - "తప్పమ్మా అలా అనకూడదు. నేను నీకు తండ్రిని" అన్నాడు.

"తండ్రయినా సరే - నా కిప్పుడు మగాడంటే భయంగా ఉంది" అంది పాప. ఆ మాట లంటున్నప్పుడామె తలెత్తలేదు.

అల్లారుముద్దుగా ఆ యింట్లో పెరుగుతోందామె. తనేమంటే అది జరిపించే తలిదండ్రులున్నా - ఆమె ఎన్నడూ మితిమీరి ప్రవర్తించలేదు.

పాప మనసు మంచిది.

పాపది వినయగుణం.

కష్టమెరుగని పాప మనసు వూహించని సంఘటనతో చెదిరిపోయి దెబ్బతింది.

'మిమీ - నువ్వు నాకు పాపను దూరం చేస్తున్నావు' అనుకున్నాడు కుమారస్వామి మనసులో.

"తప్పమ్మా - నాన్న బాధ పడతారు. దగ్గరగా వెళ్ళు" అంది ఉమాదేవి.

"ఎలా వెళ్ళనమ్మా? నేనా దృశ్యం మర్చిపోలేకపోతున్నాను" అంది పాప.

ఏ దృశ్యమని ఉమాదేవి అడగలేదు.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

ఆగష్టు 10 విడుదల

1.	ఆఖరి క్షణం	'మీరా'లక్ష్మి	25 00
2	నవ్వితే 'నవ్'రత్నాలు-2	మల్లిక్	20-00
3.	మరణయాత్ర (అపన సీరియల్)	ప్రతాప రవిశంకర్	20.00
4	పరిశోధన	సామవేదుల గీతారాణి	20.00
5	వెన్నెల కురిసింది	దేవరాజు రవి	20 00
6	జైలుగోడల మధ్య (నేరస్థుల యదార్థ గాథలు)	వేదగిరి రాంబాబు	18 00
7.	విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే 1001 కోర్సులు	VS హరినారాయణ్	25 00

(దేశంలో మెడికల్, టెక్నికల్, వృత్తివిద్యా కోర్సుల పూర్తి వివరాలు—చిరునామాలతో సహా)

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డరు పంపండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.

కుమారస్వామి నిట్టూర్చి - "సరే లేమ్మా నీ యిష్టం. కానీ నేను నీకో ముఖ్య విషయం చెప్పాలని వచ్చాను. రెండు రోజులు నువ్విల్లు కదలొద్దు...." అన్నాడు.

"ఏం?"

"శత్రువులు నిన్ను మళ్ళీ ఎత్తుకుపోయే ప్రయత్నాలు చేయొచ్చు. మన జాగ్రత్తలో మన ముండాలిగా!"

పాప భయంగా-"ఈ శత్రువులు నన్నొదలరా?" అంది.

"నీకేం భయం లేదు నేను వాళ్ళను కాల రాయ గలను. ఎటొచ్చీ కొంత టైము కావాలి...."

పాప కళ్ళెర్రబడ్డాయి - "నాన్నా నిజంగానే నువ్వు వాళ్ళను నాశనం చేయగలవా?"

"నా శక్తిని దేవుడే శంకించలేడు" గర్వంగా అన్నాడు కుమారస్వామి.

"అయితే నాన్నా! నీ సర్వశక్తులూ వినియోగించి ఆ మిమిని కాలరాయి. కానీ మిమితో ఆగిపోకు. అలాంటి వాళ్ళ నందర్నీ వెతికి వెతికి మరీ ప్రాణాలు తీయి. అలాంటివాళ్ళ విషయంలో నువ్వు పరశురాముడివి కావాలి" అంది పాప.

"అలాంటి వాళ్ళంటే?"

"కన్నకూతురు తండ్రి దగ్గరకు వెళ్లాలంటే సిగ్గుపడేలా చేసే నరాధములు....రాక్షసులు...." కసిగా అంది పాప.

ఆ మాటలు సూటిగా తనకే తగలటంతో కుమార స్వామి ఆమెకు బదులివ్వకుండా చప్పున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001·